www.andhrajyothy.com
హైదరాబాద్ సిటీ*
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 275
శనివారం | 20-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 7.28 తదుపరి ఏకాదశి; నక్షత్రం: కృత్తిక తె. 3.10 తదుపరి రోహిణి; వర్జ్యం: మ.3.00-4.37; దుర్ముహూర్తం: ఉ.6.53-8.22; అమృతఘడియలు: రా.12.44-2.21; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.00

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

'అయోధ్య' కోసం అయుథ్యా


రామమందిర ప్రతిష్ఠ మహోత్సవం తిలకించేందుకు థాయ్‌లాండ్‌లో ఏర్పాట్లు


ఇప్పటికే అయుథ్యా నుంచి మట్టి, 3 నదుల జలాలు అయోధ్యకు

2

ఆలయ ప్రారంభోత్సవానికి రండి

కేసీఆర్‌కు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆహ్వానం





అదిగో.. బాల రాముడు!

పద్మపీఠంపై ముగ్ధమనోహర రూపం

ప్రాణప్రతిష్ఠకు ముందే 4.25 అడుగుల ఎత్తైన బాలరాముని దివ్య దర్శనం

అయోధ్యకు తరలివస్తున్న భక్తులు

అయోధ్య, జనవరి 19: అయోధ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠకు మూడు రోజులు ముందే బాల రాముడి విగ్రహం తొలి చిత్రం శుక్రవారం వెలుగు చూసింది. కృష్ణశిలపై చెక్కిన రాముడి విగ్రహం ముగ్ధమనోహరంగా ఉండి అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ విగ్రహంలో శ్రీరాముడు పద్మపీఠంపై చిరునవ్వులు చిందిస్తూ, చేతిలో బంగారు

మిగతా 2వ పేజీలో...

భద్రతా వలయంలో

అయోధ్య

12 వేల మంది మోహరింపు

నగరంలో 10 వేల సీసీ కెమెరాలు

ఏఐ టెక్నాలజీతో ప్రత్యేక నిఘా

2

కృష్ణా ప్రాజెక్టులు చేజారొద్దు

ఏ ప్రాజెక్టునూ కృష్ణాబోర్డుకు అప్పగించొద్దు



నీటి పంపకాలు తేలేదాకా అంగీకరించొద్దు

మంత్రి ఉత్తమ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

లండన్ నుంచి సీఎం ఫోన్.. పరిణామాలపై ఆరా

కేంద్రం ఆదేశాలకు ఒప్పుకోం


ప్రాజెక్టుల అప్పగింతకు అంగీకరించలేదు

బీఆర్ఎస్ వల్లే రాష్ట్రానికి కృష్ణా నీళ్లు తగ్గాయి

వారికి మాట్లాడే అర్హతే లేదు: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణా ప్రాజెక్టులు చేజారకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆదేశించారు. ఒక్క ప్రాజెక్టును కూడా కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు అప్పగించరాదని అన్నారు. లండన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ శుక్రవారం మంత్రి ఉత్తమ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ నెల 17న న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన సమావేశం, అనంతర పరిణామాలపై ఆరా తీశారు. తెలుగు రాష్ట్రాల అధికారులతో జరిగిన ఆ సమావేశంలో.. గెజిట్ ప్రకారం కృష్ణా బేసిన్‌లోని ఉమ్మడి ప్రాజెక్టులు శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను కృష్ణా బోర్డుకు అప్పగించాలని కేంద్ర జలశక్తి శాఖ ఆదేశించిన విషయం తెలిసిందే. వారం రోజుల్లోగా ప్రాజెక్టుల అప్పగింత కోసం లాంఛనాలు పూర్తిచేయాలని, నెలరోజుల్లో అప్పగింత పూర్తికావాల్సిందేనని కేంద్రం ఆదేశించింది. అయితే దీనిపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలు ఇంకా తేలలేదని గుర్తు చేసింది. తాగు, సాగునీటి అవసరాల రీత్యా కృష్ణా జలాలను 50:50 నిష్పత్తితో పంచాల్సిందేనని, ఈ పంపకాలపై అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొంది. ఈ వివాదాలు తేలేదాకా

మిగతా 13వ పేజీలో...



పైసల కోసమే ప్రాజెక్టులు!

ప్రజలను తాకట్టుపెట్టి 2 లక్షల కోట్ల అప్పులు

అద్భుతాలు చేస్తున్నట్లు భ్రమలు కల్పించారు.. కాళేశ్వరం అవినీతి బాధ్యులను వదిలిపెట్టం.. సీతారామ ప్రాజెక్టులోనూ భారీ స్కాం: ఉత్తమ్

సీతారామలో రూ.8 వేల కోట్లు పెట్టినా ఎకరానికి కూడా నీళ్లివ్వలే: భట్టి

13

ప్రాజెక్టుల అప్పగింతకు తెలుగు రాష్ట్రాలు అంగీకరించాయి!

13

వారంలో లాంఛనాలు.. నెలలో అప్పగించాలి

సమావేశం మినిట్స్ విడుదల చేసిన కేంద్రం

బోర్డు అంగీకరిస్తేనే ప్రాజెక్టులపై అధికారులను అనుమతించాలని సీఆర్‌పీఎఫ్‌కు ఆదేశాలు

పురోగతిపై 15 రోజుల్లో మరోసారి భేటీ

కేంద్రం చేతిలో సాగునీటి ప్రాజెక్టులా?

కేఆర్ఎంబీ పరిధిలోకి సాగర్, శ్రీశైలం వెళ్తే రాష్ట్రానికి నష్టం

ఇది రాష్ట్రానికి ఆత్మహత్యా సదృశమే

గతంలోనూ కేంద్రం ఈ ప్రతిపాదన చేసింది.. కేసీఆర్ వ్యతిరేకించారు

మాజీ మంత్రి హరీశ్ వ్యాఖ్యలు

ప్రాజెక్టులను అప్పగిస్తే కష్టాలే!

నీటి పంపకాలు తేలకుండా అప్పగింతతో నష్టం

పాలమూరు-రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీకి తాళలే!

విద్యుత్తుకూ ఇబ్బందులేనని రాష్ట్ర ప్రభుత్వ ఆందోళన

ఎస్సీ వర్గీకరణపై కమిటీ

ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం

కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ సారథ్యం

హోం, న్యాయ, సామాజిక న్యాయ, గిరిజన శాఖల కార్యదర్శులు సభ్యులు

23న తొలిసారిగా భేటీ కానున్న కమిటీ

మాదిగ తదితర వర్గాలకు న్యాయం జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం

కమిటీ వేస్తామని గత ఏడాది హైదరాబాద్ మహాసభలో హామీ ఇచ్చిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులాల వర్గీకరణ అంశంపై అధ్యయనం చేసేందుకు కేంద్రప్రభుత్వం ఐదుగురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా నేతృత్వంలోని ఈ కమిటీలో కేంద్ర హోంశాఖ, న్యాయశాఖ, గిరిజనశాఖ, సామాజిక న్యాయశాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. ఈ నెల 23వ తేదీన ఈ కమిటీ తొలిసారిగా సమావేశం కానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. 'ఎస్సీలలో మాదిగ తదితర సామాజిక వర్గాల ప్రయోజనాలను పరిరక్షించటానికి తీసుకోవాల్సిన చర్యలను అధ్యయనం చేసేందుకు కేంద్రప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఎస్సీలలో సాపేక్షికంగా ముందంజలో ఉన్న వర్గాల కారణంగా నష్టపోతున్న అత్యంత

మిగతా 3వ పేజీలో...

బీజేపీ వర్గీకరణాస్త్రం

లోక్‌సభ ఎన్నికల్లో మాదిగల ఓటు బ్యాంకు కలిసొస్తుందని కమలనాథుల లెక్కలు

3




దేశీయ హెపటైటిస్-ఏ టీకా వచ్చేసింది

'హవిష్యూర్'ను విడుదల చేసిన ఐఐఎల్

13

విస్తృతమైన క్లినికల్ ట్రయల్స్ తర్వాత అందుబాటులోకి

కాలేయ ఇన్ఫెక్షన్లకు చెక్




500 దాటేశాయ్

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల పోస్టులకు దరఖాస్తులు

పదవులకు తీవ్ర పోటీ

12

వివిధ రంగాల నిష్ణాతుల నుంచి భారీగా స్పందన



మూసీ అభివృద్ధికి బ్రిటన్ సహకారం

స్థానికులకు అధిక లబ్ధితోనే ప్రాజెక్టు సక్సెస్.. నదిలో నిరంతరం నీరుండేలా చూడండి

తీరం పొడవునా అభివృద్ధికి ప్రాధాన్యమివ్వండి.. రేవంత్‌కు థేమ్స్ పాలక మండలి సలహా

మూడేళ్లలో 55 కి.మీ. సుందరీకరిస్తాం.. విజన్ 2050లో భాగంగా చేపడుతున్నాం

వివరించిన సీఎం రేవంత్‌రెడ్డి.. పర్యటనలో రేవంత్ వెంటే మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్

థేమ్స్ పాలకమండలి సభ్యులతో భేటీలో సీఎం రేవంత్



హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరం మధ్యలో ప్రవహిస్తున్న మూసీ నదిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడంలో తమవంతు సహకారం అందిస్తామని పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హామీ ఇచ్చింది. మూసీ నది పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇతర దేశాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను తెలుసుకునేందుకు

మిగతా 12వ పేజీలో...

పెట్టుబడులు రెట్టింపు!

దావోస్‌లో రూ.40,232 కోట్లకు ఒప్పందాలు.. గత ఏడాది ప్రతిపాదనలకు రెట్టింపు

12

4 రోజుల్లో 200 సంస్థలతో సంప్రదింపులు.. అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలతో భేటీలు

కొత్త ప్రభుత్వం చొరవకు కంపెనీల ప్రశంస.. సీఎం రేవంత్ దావోస్ పర్యటన విజయవంతం



సీఎంఆర్ బకాయిలపై సర్కారు కొరడా

మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

ఉమ్మడి నల్లగొండలో రూ.360 కోట్లు

మొండికేస్తున్న బడా రైస్‌మిల్లర్లు

సర్కారు సీరియస్.. వసూళ్లే లక్ష్యం

సీఎంఆర్ అందజేయకపోతే మిల్లులను బ్లాక్‌లో పెడతాం: ఉత్తమ్

13

మేత మిల్లర్లకు.. వాత సర్కారుకు

రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు భారీ వడ్డీ మోత

ఐదేళ్లలో రూ.9,966 కోట్లు.. రూ.4,983 కోట్లు అదనపు భారమే

కస్టమ్ మిల్లింగ్ డెలివరీ ఆలస్యంతో తీవ్ర అప్పుల ఊబిలోకి

బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఉదాసీనత పర్యవసానమిది

నిరుటి బకాయిలే 42 లక్షల టన్నులు.. విలువ 16,405 కోట్లు

హైదరాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్లేమో కోటీశ్వరులవుతుంటే.. వారికి అడ్డం ఉండి అప్పులు తెస్తున్న రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ బికారిగా మారుతోంది.! జేబులు దండిగా నిండిన మిల్లర్లు రియల్ ఎస్టేట్ చేస్తూ.. ఎకరాలకు ఎకరాలు కొంటుంటే.. బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చి.. రైతుల వద్ద ధాన్యం కొని అప్పగించి.. మధ్యలో వడ్డీలు కడుతూ పౌర సరఫరాల సంస్థ దివాలా తీస్తోంది.! ధాన్యం మిల్లింగ్, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీలో ఉద్దేశపూర్వకంగా మిల్లర్లు చేస్తున్న ఆలస్యానికి బలవుతోంది. ఇచ్చిన ధాన్యాన్ని ఇచ్చినట్లే మిల్లర్లు గుటుక్కుమనిపిస్తుంటే.. సంస్థ మాత్రం బయటపడలేని స్థాయిలో అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గాడి తప్పిన సీఎంఆర్ వ్యవస్థ కొత్త ప్రభుత్వంలోనైనా పట్టాలెక్కాల్సి ఉంది. కాగా, పౌర సరఫరాల సంస్థ రైతుల నుంచి వానాకాలం, యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొని డబ్బులు

మిగతా 13వ పేజీలో...

దేవాదాయ భూమిలో రోడ్డు

విల్లాల కోసం స్టేటస్‌కోను ధిక్కరించి నార్సింగ్ మునిసిపాలిటీ అత్యుత్సాహం

బళ్ల బాట ఉందంటూ బలవంతంగా పనులు

2 సార్లు అడ్డుకున్న దేవాదాయ శాఖ అధికారులు

కోర్టు ధిక్కారమే అవుతుందంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు



నార్సింగ్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విల్లా ప్రాజెక్టు కోసం నార్సింగ్ మున్సిపాలిటీ అత్యుత్సాహం ప్రదర్శించింది. హైకోర్టు నుంచి స్టేటస్ కో ఉత్తర్వులు ఉన్న దేవాదాయ శాఖ భూమిలో బలవంతంగా రోడ్డేసే ప్రయత్నం చేసింది. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న విలువైన భూమిని కాపాడుకొనే ప్రయత్నంలో భాగంగా దేవాదాయ శాఖ అధికారులు ఈ రోడ్డు నిర్మాణాన్ని

మిగతా 13వ పేజీలో...

బకాయిలు రాబడదాం

14

హౌసింగ్ బోర్డుకు రూ.1000 కోట్లు

భూ కొనుగోలుదారుల నుంచి వసూలు చేయాలని ప్రభుత్వ నిర్ణయం

మార్చి 31కల్లా రికవరీ చేయాలని లక్ష్యం

స్వగృహ ఫ్లాట్ల ధరలు, విక్రయాలకు కమిటీ

దిల్, హౌసింగ్ బోర్డు పరిధిలోని లిటిగేషన్ భూముల పరిష్కారానికి లీగల్ కౌన్సిల్

సమీక్షలో మంత్రి పొంగులేటి

జగన్ కేసుల్లో జాప్యమేల?

విచారణలో ఆలస్యం ఎందుకు?

ఒక్కడిశ్చార్జి పిటిషనైనా పరిష్కరించారా?

సుప్రీంకోర్టు వరుస ప్రశ్నలు

తమకు సంబంధం లేదన్న కేంద్రం, సీబీఐ

ఇంకెవరికి ఉంటుందని సుప్రీం ప్రశ్న

ఎంపీ రఘురామ పిటిషన్‌పై విచారణ

పిటిషన్‌ను కొట్టేయాలన్న జగన్ లాయర్

సొలిసిటర్ జనరల్‌దీ అదే మాట

తిరస్కరించిన సుప్రీం ధర్మాసనం



న్యూఢిల్లీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణలో ఎందుకు ఆలస్యం జరుగుతోందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ముఖ్యమంత్రి పదవిలో ఉండి విచారణను తప్పించుకుంటూ సుదీర్ఘకాలం బెయిల్‌పై కొనసాగడంపై కూడా దృష్టి సారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. అక్రమాస్తుల కేసులో జగన్ బెయిల్ రద్దు చేయాలని, ఆయనతోపాటు ఇతరులపై

మిగతా 14వ పేజీలో...

అదిగో.. బాల రాముడు!

(మొదటి పేజీ తరువాయి)

విల్లు, బాణం పట్టుకొని ఉన్న ఐదేళ్ల బాలుడి రూపంలో దర్శనమిస్తున్నారు. ఆలయంలో ప్రతిష్ఠించాల్సిన విగ్రహాన్ని గురువారం వేకువజామున గర్భగుడిలోకి ప్రవేశపెట్టారు. మైసూరుకు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కిన 51 అంగుళాల విగ్రహాన్ని పవిత్ర జలాలతో అభిషేకించి ఆసనంపైకి చేర్చారు. సోమవారం ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్న నేపథ్యంలో ట్రస్టు అధికారులు ముందుగా తెల్లటి వస్త్రం కప్పి ఉన్న విగ్రహాన్ని గర్భగుడిలో ఉంచుతున్న ఫొటోలను గురువారం విడుదల చేశారు. విగ్రహం కళ్లు పసుపు వస్త్రంతో కప్పి ఉన్న మరో ఫొటో శుక్రవారం ఉదయం బయటకు వచ్చింది. అయితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాముడి చేతిలో బంగారు విల్లు, బాణం ఉన్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కాగా, ప్రాణప్రతిష్ఠలో వినియోగించడానికి మహారాష్ట్రలోని అమరావతి నుంచి అయోధ్యకు 500 కిలోల కుంకుమను కానుకగా పంపారు. కర్ణాటకలోని హంపి ప్రాంతంలో ఉన్న హనుమంతుడి జన్మస్థలం కిష్కింధ నుంచి ప్రత్యేక రథం అయోధ్యకు చేరుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలను సందర్శిస్తూ, అయోధ్యకు చేరేముందు ఈ రథాన్ని నేపాల్‌లోని సీతా మాత జన్మస్థలమైన జనక్‌పూర్‌కు తీసుకెళ్లారు. భక్తుల సందర్శనార్థం ఈ రథాన్ని సరయూ నది ఒడ్డున నిలిపి ఉంచారు.



చేతిలో బంగారు ధనస్సుతో ఉన్న బాల రాముడి విగ్రహం. ఈ ఫొటో శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది.



శుక్రవారం సాయంత్రం దీప కాంతులతో వెలిగిపోతున్న అయోధ్య రామాలయం

దారులన్నీ అయోధ్యకే

అందరి గమ్యం ఒకటే.. దారులన్నీ అయోధ్యకే.. ఎముకలు కొరికే చలి కూడా వారిని అడ్డుకోలేకపోతోంది. 22న జరిగే బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠను కనులారా వీక్షించి తరలించడానికి దేశం నలుమూలల నుంచి ప్రజలు వెల్లువలా తరలి వస్తున్నారు. వందలాది కిలోమీటర్ల దూరాన్ని కొందరు కాలి నడకన అధిగమిస్తుండగా, మరికొందరు సైకిళ్లపైనా, ఇంకొందరు స్కేటింగ్ చేసుకుంటూ అయోధ్య దిశగా ముందుకు సాగుతున్నారు. రాముడిపై ఉన్న అచంచల విశ్వాసంతో ఈ చరిత్రాత్మక ఘట్టంలో తాము కూడా భాగం కావాలని ఉవ్విళ్లూరుతున్నారు. బిహార్‌లోని మాథేపురా జిల్లాకు చెందిన నితీశ్ కుమార్(21) సైకిల్‌పై 615 కిలోమీటర్లు ప్రయాణించి అయోధ్యకు చేరుకున్నారు. గిన్నిస్ బుక్‌లో లాంగెస్ట్ డ్యాన్స్ మారథాన్ (124 గంటలు) రికార్డును సొంతం చేసుకున్న సోనీ చౌరాసియా ఆహ్వానితుల్లో ఒకరు. ఆమె వారాణసీ నుంచి స్కేటింగ్ చేస్తూ అయోధ్యకు వెళ్తున్నారు. హిందూ ముస్లింల ఐక్యత సందేశాన్ని వ్యాప్తి చేసే లక్ష్యంతో ముంబైకి చెందిన షబ్నమ్ షేక్ అయోధ్యకు కాలినడకన వస్తున్నారు. మహాత్మా గాంధీ వేషధారణలో కర్ణాటకలోని కరాకిట్టి ప్రాంతానికి చెందిన ముత్తా తిర్లాపుర 2000 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి అయోధ్యకు చేరుకున్నారు.

రామయ్యకు కానుకల వెల్లువ

అయోధ్యలో రామమందిరం ప్రతిష్ఠాపన ముహూర్తం ముంచుకొస్తున్న వేళ రామయ్యకు కానుకలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 22న జరగబోయే వేడుకకు కనౌజ్ నుంచి వివిధ రకాల అత్తరులు, అమరావతి నుంచి 500 కిలోల కుంకుమ, ఢిల్లీ నుంచి రామాలయాల్లో సేకరించిన ధాన్యం అయోధ్యకు చేరుకున్నాయి. ఇవేకాకుండా 108 అడుగుల అగరుబత్తీ, 2,100 కిలోల గంట, 1,100 కిలోల భారీ దీపం, బంగారు పాదుకలు, పది అడుగుల తాళం, ఏకకాలంలో 8దేశాల సమయాన్ని సూచించే గడియారం ట్రస్టుకు అందాయి. సీతమ్మ జన్మస్థలం నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్ నుంచి వెండి పాదరక్షలు, ఆభరణాలు, వస్త్రాలతో పాటు 3వేలకు పైగా బహుమతులు కాన్వాయ్‌గా వచ్చాయి. శ్రీలంక ప్రతినిధి బృందం అశోకవాటిక నుంచి ప్రత్యేక కానుక తీసుకొచ్చింది. ఉజ్జయిని మహాకాలేశ్వర్ ఆలయం నుంచి 5లక్షల లడ్డూలతో కూడిన ట్రక్ శుక్రవారం అయోధ్యకు బయల్దేరింది. మధురలోని శ్రీకృష్ణ జన్మస్థాన్ నుంచి 200 కిలోల లడ్డూలు, తిరుమల శ్రీవారి ఆలయం నుంచి లక్ష లడ్డూలు పంపారు. భక్తుల కోసం 7వేల కిలోల రామ్ హల్వాను తయారు చేయనున్నట్లు నాగపూర్‌కు చెందిన చెఫ్ విష్ణు మనోహర్ ప్రకటించారు. రాముడికి బంగారు పూతపూసిన పాదరక్షలను సమర్పించడానికి హైదరాబాద్‌కు చెందిన 64ఏళ్ల చల్లా శ్రీనివాస శాస్త్రి 8వేల కిలోమీటర్లు నడిచి అయోధ్యకు చేరుకున్నారు.




అంతా రామమయం!

రామాలయ ప్రతిష్ఠకు ముందు.. అయోధ్య మొత్తం రామమయమైంది. మొబైల్ ఫోన్ల కాలర్ ట్యూన్స్, రింగ్ టోన్లు, సోషల్ మీడియాలో శ్రీరాముడి పేరు మార్మోగిపోతోంది. అయోధ్య వీధులన్నీ ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. మరోవైపు, రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముందు అయోధ్య జిల్లా, నగరంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో బెడ్లను రిజర్వ్ చేసి ఉంచారు. అత్యవసర సమయంలో ఎలా స్పందించాలో ఎయిమ్స్ నిపుణులు స్థానిక ఆరోగ్య సంస్థల సిబ్బందికి శిక్షణ అందించారు. ఈ నెల 22న జరిగే ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యే వారి కోసం ఈ బెడ్లను రిజర్వ్ చేసినట్టు అధికారులు తెలిపారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా సుమారు 7 వేల మంది అతిథులను ఆహ్వానించారు. కాగా, అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఉత్తరప్రదేశ్ జైళ్లలోని ఖైదీలకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూపించనున్నారు.

భద్రతా వలయంలో అయోధ్య..


అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠకు సమయం దగ్గర పడడం, ఆలయ అధికారులకు ఇటీవలే ఓ బెదిరింపు కాల్ రావడంతో.. అధికారులు అప్రమత్తమయ్యారు. భద్రత ఉల్లంఘన జరిగినట్టు కేంద్ర హోం మంత్రిత్వశాఖ నుంచి సమాచారం అందడంతో.. భద్రతను కట్టుదిట్టం చేసి అయోధ్య మొత్తాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అయోధ్య నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో 12 వేల మంది పోలీస్ సిబ్బందిని మోహరించారు. బెదిరింపుల నేపథ్యంలో భద్రతను పర్యవేక్షించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని వినియోగిస్తున్నారు. 'అయోధ్యలో మొత్తం 10వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఫేస్ రికగ్నిషన్ కోసం ఏఐని ఉపయోగిస్తున్నాం' అని ప్రశాంత్ కుమార్ చెప్పారు.

అయోధ్య ఆలయ ప్రారంభానికి చంద్రబాబు



అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు హాజరవుతున్నారు. కొద్ది రోజుల క్రితం ఆలయ ట్రస్ట్ ఆయనకు ఆహ్వానం పంపింది. దీనితో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన నిర్ణయించుకొన్నారు. ఖరారైన కార్యక్రమం ప్రకారం ఈ నెల 21న సాయంత్రం ఆయన హైదరాబాద్ నుంచి బయలుదేరి అయోధ్య వెళ్తారు. ఆ రాత్రి అక్కడ బస చేసి 22న ఉదయం ఆలయ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. అదే రోజు అక్కడ నుంచి బయలుదేరి హైదరాబాద్ తిరిగి వస్తారు. దీని నిమిత్తం ఈ నెల 21 నుంచి 23 వరకూ ఆయన తన జిల్లాల పర్యటనకు విరామం ఇచ్చారు. మళ్లీ 24 నుంచి ఆయన పర్యటనలు ప్రారంభిస్తారు.

లోకం తీరు



'జై శ్రీరామ్'కు కౌంటర్‌గా

'జై జగన్నాథ్'

ఒడిశాలో బీజేపీకి దీటుగా బీజేడీ ప్లాన్

పూరీ, జనవరి 19: లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ 'జై శ్రీరామ్' నినాదానికి కౌంటర్ ఇచ్చేందుకు ఒడిశాలోని అధికార బీజేడీ 'జై జగన్నాథ్' నినాదాన్ని ఎత్తుకుంది. దీంతో బీజేడీ, బీజేపీ మధ్య రాజకీయ దుమారం రేగింది. ఈ నెల 22న అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముందే ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ పూరీలోని జగన్నాథ ఆలయంలో నూతనంగా నిర్మించిన 'జగన్నాథ్ కారిడార్'ను ప్రారంభించారు. వచ్చే నెల రోజులపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ 10 వేల మంది వచ్చి దీన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది లోక్‌సభతో పాటు ఒడిశా అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యర్థుల నుంచి ఎదురయ్యే ప్రతి సవాల్‌నూ ఎలా ఎదుర్కోవాలో సీఎం నవీన్ పట్నాయక్‌కు తెలుసని బీజేడీ సీనియర్ నేత ఒకరన్నారు. బీజేపీ హిందుత్వ ఎజెండాను ఎదుర్కొనేందుకు బీజేడీ ప్రణాళిక ఏమిటని ఆయనను ప్రశ్నించగా 'జై జగన్నాథ్' అని బదులిచ్చారు.




వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని యాంకి గ్రామానికి చెందిన కళాకారుడు సున్నపు అశోక్ ఐస్‌క్రీమ్ పుల్లలతో అయోధ్య రామ మందిర నమూనాను తయారు చేసి అబ్బురపరిచాడు. 2వేల పుల్లలను ఉపయోగించి రోజుకు గంట చొప్పున 20 రోజులు శ్రమించి ఆలయ నమూనాను తయారు చేసినట్లు అతడు చెప్పాడు.

- దౌల్తాబాద్




నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన స్వర్ణకారుడు కపిలవాయి గోపి చారి కేవలం 2.73 గ్రాముల బంగారంతో అయోధ్య రామ మందిర నమూనాను తయారు చేశాడు. 1.5 సెంటీమీటర్ల ఎత్తు, 1.75 సెంటీమీటర్ల వెడల్పు, 2.75 సెంటీమీటర్ల పొడవుతో 108 స్తంభాలు, 20 గోపురాలు వచ్చే విధంగా ఆలయ నమూనాను రూపుదిద్ది అందరినీ అబ్బురపరిచాడు.

- అమ్రాబాద్



ఆ రథం తయారీ మధురానుభూతి

ముంబై, జనవరి 19: బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అడ్వాణీ 1990లో చేపట్టిన రథయాత్రకు రథాన్ని తయారు చేయడం.. తనకు ఇప్పటికీ నూతనోత్సాహాన్ని ఇస్తుందని ముంబైకి చెందిన ప్రకాశ్ నలవాడె అన్నారు. అడ్వాణీ రథయాత్రకు రథాన్ని సిద్ధం చేసింది ఈయనే. ఈ నెల 22న అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠ నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "రథయాత్రకు కొన్ని రోజుల ముందు బీజేపీ నేత ప్రమోద్ మహాజన్ నన్ను సంప్రదించారు. ఆర్ట్ డైరెక్టర్ శాంతి దేవ్ ఈ రథాన్ని డిజైన్ చేశారు. ఆ ప్రకారం నేను దాన్ని రూపొందించాను. దీన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నాను" అని ప్రకాశ్ చెప్పారు.

ఆస్ట్రేలియాలో 721 అడుగుల


రామాలయం

సన్నాహాలు చేస్తున్న 'ఇస్వాకు' సంస్థ

న్యూఢిల్లీ, జనవరి 19: ఆస్ట్రేలియాలోని పెర్త్‌లో ప్రపంచంలోనే అతిపెద్దదైన రామాలయం నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. 150 ఎకరాల స్థలంలో 721 అడుగుల ఎత్తు ఉన్న మందిరాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇందుకు సుమారు రూ.600 కోట్లు వ్యయం కానున్నట్టు అంచనా వేశారు. ద ఇంటర్నేషనల్ శ్రీరాం వేదిక్ అండ్ కల్చరల్ యూనియన్ (ఐఎస్‌వీఏసీయూ-ఇస్వాకు) సంస్థ ఆధ్వర్యంలో ఈ నిర్మాణం జరగనుంది. సంప్రదాయ మందిరంతో పాటు, అంతకు మించి పలు సౌకర్యాలను కల్పించనున్నట్టు ఆ సంస్థ ఉప అధిపతి డాక్టర్ హరేంద్ర రాణా తెలిపారు.దీప ద్వారం, చిత్రకూట్ వాటిక, పంచవటి వాటిక పేరుతో ఉద్యానవనాలు, రామ్ నివాస్ హోటల్, సీతా రసోయి రెస్టారెంట్, రామాయణ సదన్ గ్రంథాలయం, తులసీ దాస్ హాల్ వంటి సౌకర్యాలు ఉంటాయి. యోగా కేంద్రం, ధ్యాన మందిరం, వేద అధ్యయనం, పరిశోధన కేంద్రం, మ్యూజియం కూడా ఉంటాయి. పర్యావరణానికి ప్రాధాన్యం ఇస్తూ సోలార్ ప్లాంటుతో పాటు కర్బన రహిత వాతావరణాన్ని నెలకొల్పనున్నారు.

'అయోధ్య' కోసం అయుథ్యా

రామమందిర ప్రతిష్ఠ మహోత్సవం తిలకించేందుకు థాయ్‌లాండ్‌లో ఏర్పాట్లు



అయోధ్య, జనవరి 19: అయోధ్య అయుథ్యా.. ఈ రెండు పట్టణాలకు పేరులోనే కాదు, మతపరమైన విశ్వాసాల్లోనూ సారూప్యత ఉంది. అయోధ్య.. మన దేశంలోని శ్రీరాముడి జన్మభూమి కాగా, అయుథ్యా.. భౌగోళికంగా ఇక్కడికి 3,500 కిలో మీటర్ల దూరంలో ఉన్న థాయ్‌లాండ్‌లోని పురాతనమైన పట్టణం. ఒక్కమాటలో చెప్పాలంటే థాయ్‌లాండ్‌కు ఈ పట్టణం అయోధ్య లాంటిది. మన దేశంలో మాదిరే అయుథ్యాలోనూ ప్రజలు శ్రీరాముడిని ఆరాధిస్తారు. మరో రెండు రోజుల్లో అయోధ్యలో జరిగే రామమందిర ప్రతిష్ఠ మహోత్సవాన్ని తిలకించేందుకు అయుథ్యాలోని రామభక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే అయుథ్యా నుంచి తీసుకొచ్చిన మట్టిని, థాయ్‌లాండ్‌లోని మూడు నదుల నుంచి తీసుకొచ్చిన జలాలను అయోధ్య రామాలయ ట్రస్ట్ స్వీకరించింది. 22వ తేదీన రామమందిర ప్రతిష్ఠ ప్రత్యక్ష కార్యక్రమాలను టీవీల్లో తిలకించేందుకు అయుథ్యాలో ఏర్పాట్లు చేస్తున్నారు. అయుథ్యాలోని హిందూ ఆలయాలతో పాటు థాయ్‌లాండ్‌లోని ఇతర నగరాల్లో భారీ స్ర్కీన్లను ఏర్పాటు చేసినట్టు బ్యాంకాక్‌కు చెందిన వీహెచ్‌పీ సభ్యులు ఒకరు చెప్పారు. ఆ రోజు ఆలయాల్లో దీపాలు వెలిగించి రామభజనలు చేస్తారని, ప్రసాదాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఆ పేరు ఎలా వచ్చిందంటే..

శ్రీరాముడి జన్మస్థలం అయోధ్య పేరు మీదుగానే థాయ్‌లాండ్‌లోని ఈ పట్టణానికి అయుథ్యా అని పేరు పెట్టినట్టు ప్రపంచ హిందూ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు స్వామి విజ్ఞానంద్ చెప్పారు. 'ఆ ప్రాంత సంస్కృతిపై రామాయణ ప్రభావం ప్రతిబింబించేలా అయుథ్యా మొదటి రాజు రామాతిబోది పట్టణానికి ఈ పేరు పెట్టారు. చక్రీ వంశానికి చెందినవారితో సహా తదుపరి రాజులు శ్రీరాముడి పేరును స్వీకరించారు. నాటి నుంచి అక్కడ శ్రీరాముడిని ఆరాధిస్తున్నారు' అని స్వామి విజ్ఞానంద్ తెలిపారు. 1350లో అయుథ్యా పట్టణాన్ని నిర్మించారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌కు ఉత్తరాదిన 70 కి.మీ. దూరంలో, చావో ప్రాయ నది ఒడ్డున ఉంటుంది. సుసంపన్న, చారిత్రక పట్టణంగా పేరు పొందిన అయుథ్యాకు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చోటు దక్కింది.

తరలిరానున్న భిన్న రంగాల దిగ్గజాలు

అయోధ్య, జనవరి 19: రామాలయ ప్రతిష్ఠకు దేశంలోని పారిశ్రామిక దిగ్గజాలకు, సినీ ప్రముఖులకు, రాజకీయ నేతలకు, ఉన్నతాధికారులకు, దౌత్యాధికారులకు... మొత్తం సుమారుగా 8వేల మందికి ఆహ్వానాలు అందాయి. వారిలో అత్యంత ప్రముఖులు సుమారు 100మంది దాకా ఉన్నారు. దేవాలయ ప్రతిష్ఠకు ప్రముఖ నటుడు అమితాబచ్చన్ ప్రత్యేక విమానంలో తరలిరానున్నారు. ఆహ్వానం అందుకున్న సినీ ప్రముఖుల్లో అజయ్ దేవగన్, అక్షయ్ కుమార్, చిరంజీవి, అల్లు అర్జున్, మోహన్ లాల్, అనుపమ్ ఖేర్ తదితరులు ఉన్నారు. రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ, ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్‌పర్సన్ కుమార మంగళం బిర్లా, పిరమల్ గ్రూప్ ఛైర్‌పర్సన్ అజయ్ పిరమల్, ఆనంద్ మహీంద్ర, డాక్టర్ రెడ్డీస్ ఫార్మా కే సతీశ్ రెడ్డి, ఎల్ అండ్ టీ సీఈఓ ఎస్ ఎన్ సుబ్రహ్మణియన్, ఆయన భార్య, దివీస్ లేబొరెటరీస్ మురళి దివి, ఇన్ఫోసిస్ స్థాపకులు ఎన్ ఆర్ నారాయణ మూర్తి తదితరులు ఉన్నారు. రాజకీయ ప్రముఖుల్లో మాజీ లోక్ సభ స్పీకర్ మీరా కుమార్, ప్లానింగ్ కమిషన్ మాజీ డిప్యూటీ ఛైర్మన్ మాంటెక్ సింగ్ అహ్లూవాలియా తదితరులున్నారు. ఇండియా జీ20 షెర్పా అమితాబ్ కాంత్, మాజీ అటార్నీ జనరల్స్ కే కే వేణుగోపాల్, ముకుల్ రోహత్గీ, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ తదితర పేర్లు జాబితాలో ఉన్నాయి.

'అయోధ్యపై తీర్పు' జడ్జిలకు ఆహ్వానం

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌తో సహా మరో ఐదుగురు జడ్జిలకు రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానం అందింది. అయోధ్యలోని వివాదాస్పద స్థలంలో ఆలయ నిర్మాణానికి మార్గం సుగమం చేసేలా తీర్పునిచ్చిన రాజ్యాంగ ధర్మాసనంలోని ఐదురుగురు జడ్జిలూ ఆహ్వానం అందుకున్న వారిలో ఉన్నారు. తీర్పును ఇచ్చిన వారిలో జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ బోబ్డె, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ ఉన్నారు.



భారత్ అభివృద్ధికి

సహకరించండి

గ్లోబల్ ఇన్వెస్టర్లకు ప్రధాని పిలుపు

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభం

బెంగళూరు, చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా మెరుగైన వృద్ధి సాధించాలని అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. దేశంలో అన్ని రంగాలకూ అనువైన వాతావరణం ఉందని స్పష్టంచేశారు. బెంగళూరులో శుక్రవారం ఆయన బోయింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఇండియా ఇంజనీరింగ్ టెక్నాలజీ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అమెరికా వెలుపల తొలిసారి బోయింగ్ అతిపెద్ద ఏరోస్పేస్ ఇంజనీరింగ్ సదుపాయాన్ని బెంగళూరులో ఏర్పాటు చేసింది. మహిళా సాధికారతే ధ్యేయంగా ఈ కార్యక్రమానికి 'బోయింగ్ సుకన్య' అని పేరు పెట్టారు. కాగా, యువశక్తి ద్వారానే నవ్యభారతం సాధ్యమవుతుందని, ఆ దిశగా యువకుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేలా దేశమంతటా 'ఖేలో ఇండియా' పోటీలను అట్టహాసంగా నిర్వహిస్తున్నామని మోదీ పేర్కొన్నారు. చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను మోదీ లాంఛనంగా ప్రారంభించారు.

బిల్కిస్ బానో కేసు ముద్దాయిలకు

సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ

21లోగా జైలు అధికారుల ముందు లొంగిపోవాలని ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 19: గుజరాత్ అల్లర్లలో సంచలనం కలిగించిన బిల్కిస్ బానో కేసులోని ముద్దాయిలకు శుక్రవారం సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. జైలు అధికారుల ముందు లొంగిపోయేందుకు గడువును పెంచాలని ఐదుగురు ముద్దాయిలు చేసిన విజ్ఞప్తిని తిరస్కరించింది. ఇంతకుముందటి ఆదేశాల మేరకు వారు ఈ నెల 21లోగా జైలు అధికారుల ముందు లొంగిపోవాలని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. బిల్కిస్‌బానోపై సామూహిక అత్యాచారం చేయడంతోపాటు, ఆమె కుటుంబంలోని ఏడుగుర్ని హత్య చేసినందుకు 11మంది ముద్దాయిలకు కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. కానీ 14 ఏళ్ల శిక్ష తర్వాత గుజరాత్ ప్రభుత్వం వారిని విడుదల చేసింది. శిక్ష తగ్గింపును సవాలు చేస్తూ బాధితురాలు సుప్రీంకోర్టు నుఆశ్రయించగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఈ నెల 8న కొట్టివేసింది. ఈనెల 21లోగా జైలు అధికారుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది.

లాలూ, తేజస్వీలకు ఈడీ మళ్లీ సమన్లు

న్యూఢిల్లీ, జనవరి19: తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి ప్రతిగా రైల్వే ఉద్యోగాలు ఇచ్చారన్న ఆరోపణలపై విచారణ నిమిత్తం హాజరు కావాలంటూ ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్, ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్‌లకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మళ్లీ సమన్లు పంపించింది. పట్నాలోని బ్యాంకు రోడ్‌లో ఉన్న తమ కార్యాలయానికి ఈ నెల29న హాజరు కావాలని లాలూను, 30న రావాలని తేజస్వీ యాదవ్‌ను ఆదేశించింది. గతంలోనూ వారికి సమన్లు ఇచ్చినా విచారణకు వెళ్లలేదు.

ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేసిన మహువా

న్యూఢిల్లీ, జనవరి 19: లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మహువా మొయిత్రా తనకు కేటాయించిన ప్రభుత్వ బంగ్లాను శుక్రవారం ఖాళీ చేశారు. బంగ్లాను ఖాళీ చేయాలని అధికారులు ఇచ్చిన నోటీసును నిలుపుదల చేయాలంటూ ఆమె చేసిన వినతిని గురువారం ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. దాంతో మరుసటి రోజునే ఆమె ఖాళీ చేశారు. బంగ్లాను ఖాళీ చేయించడానికి డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ అధికారులు ఉదయమే మనుషుల్ని పంపించింది. ఆ భవనం చుట్టూ బారికేడ్లు కూడా ఏర్పాటు చేసింది. కానీ అంతకుముందే ఆమె ఖాళీ చేశారు. లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు బహుమతులు తీసుకున్నారన్న ఆరోపణలపై ఆమె ఎంపీ పదవిని కోల్పోవడంతో బంగ్లాను ఖాళీ చేయాల్సి వచ్చింది.

అడవి బిడ్డలు అడవికే పరిమితమా?

వారి భూముల్ని బీజేపీ లాక్కుంటోంది: రాహుల్



జోడో న్యాయ్ యాత్రలో జానపద కళాకారులతో రాహుల్

మజులి, జనవరి 19: గిరిజనులకు విద్య, ఇతర అవకాశాలను దూరం చేసి అడవులకే పరిమితం చేయాలని బీజేపీ చూస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అసోం రాష్ట్రంలో భారత్ జోడో న్యాయ్‌యాత్ర రెండో రోజు గిరిజన ప్రాంతం మజులిలో శుక్రవారం సాగింది. ఇక్కడ జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... వనరుల మీద ఆదివాసీల హక్కులను కాంగ్రెస్ గుర్తిస్తుందన్నారు. "మేం మిమ్మల్ని ఆదివాసీలని పిలుస్తున్నాం... అంటే తొలి నివాసులని అర్థం... బీజేపీ మిమ్మల్ని వనవాసి అంటోంది... అంటే అడవుల్లో నివసించేవారని అర్థం.." అని వివరించారు. అసోం రాష్ట్ర ప్రభుత్వానికి మీ పిల్లలు పాఠశాలలు, విశ్వవిద్యాలయాలకు వెళ్లి చదువుకోవడం, ఇంగ్లీషు నేర్చుకోవడం, వ్యాపారాలు చేయడం ఇష్టం లేదని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా గిరిజనుల భూములను బీజేపీ ప్రభుత్వాలు లాక్కుంటున్నాయని ఆరోపించారు. మణిపూర్ రాష్ట్రాన్ని బీజేపీ మంటల్లో పెట్టిందన్నారు. నెలల తరబడి ఆ రాష్ట్రంలో ప్రజల మధ్య యుద్ధం సాగుతోందన్నారు. ఒకరినొకరు చంపుకొంటున్నారు... అయినా ఈ దేశ ప్రధాన మంత్రి ఒక్కసారి కూడా అక్కడికి వెళ్లలేదన్నారు. నాగాలాండ్‌లో తొమ్మిదేళ్ల క్రితం చేసుకున్న ఒప్పందం ప్రధాని నేటికీ నెరవేర్చలేదని ఆరోపించారు. ఇదిలా ఉండగా, అసోంలో భారత్ జోడో న్యాయ్‌యాత్రకు ఎక్కడా లేని అంతరాయాలు కల్పిస్తున్నారని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ మండిపడ్డారు. మొదటి యాత్ర బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సాగినప్పుడు ఇటువంటి పరిస్థితి ఎదురు కాలేదన్నారు. అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ కాంగ్రెస్‌కు అంతగా ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు.

జమిలి ఎన్నికలు అప్రజాస్వామికం

కోవింద్ కమిటీని రద్దు చేయాలి: కాంగ్రెస్

న్యూఢిల్లీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి జమిలి ఎన్నికలు జరపాలన్న ప్రతిపాదనే అప్రజాస్వామికమని కాంగ్రెస్ ప్రకటించింది. ఒక దేశం- ఒకే ఎన్నికల వ్యవస్థ పేరుతో బీజేపీ జమిలి ఎన్నికలను ప్రవేశపెట్టాలనుకోవడం సమాఖ్య స్ఫూర్తికి, రాజ్యాంగ మౌలిక నిర్మాణానికీ వ్యతిరేకమని స్పష్టం చేసింది. జమిలి ఎన్నికలను అమలు చేసే విషయంపై అధ్యయనం చేసేందుకు మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీని రద్దు చేయాలని డిమాండు చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే.. కోవింద్ కమిటీ కార్యదర్శి నితేన్ చంద్రకు లేఖ రాశారు. రాజ్యాంగాన్ని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి వ్యక్తిత్వాన్నీ, ఆయన కార్యాలయాన్ని దుర్వినియోగపరుస్తోందని ఖర్గే ఆరోపించారు. అందుకు అనుమతించరాదని కోవింద్‌ను కోరారు. ప్రజల తీర్పును గౌరవించేందుకు ప్రభుత్వం, పార్లమెంటు, ఎన్నికల కమిషన్ కలిసికట్టుగా పని చేయాల్సి ఉందని తెలిపారు. దానికి బదులుగా జమిలి ఎన్నికల వంటి అప్రజాస్వామిక ఆలోచనలపై మాట్లాడుతూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

12 వేల ఏళ్ల కిందటే

లద్దాక్‌కు వలసలు

అత్యంత ప్రాచీన తెగ బ్రోక్‌పా

సీసీఎంబీ, బీర్బల్ సహానీ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త పరిశోధనలో వెల్లడి

హైదరాబాద్, జనవరి19: కొత్త రాతి యుగం తొలినాళ్లకే అంటే 12వేల ఏళ్ల క్రితమే లద్దాక్‌కు ప్రజలు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి స్థిరపడ్డారని తాజా పరిశోధనలో వెల్లడైంది. ఇక్కడ నివసిస్తున్న కొన్ని తెగల ప్రజల జన్యువులు తూర్పు ఆసియా, దక్షిణాసియా, టిబెట్, బర్మా ప్రాంతాల ప్రజల జన్యువులతో సరిపోలుతున్నాయని తెలిసింది. లద్దాక్ ప్రజల జన్యు మూలాలపై, జన్యు వైవిధ్యంపై సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రవేత్త డాక్టర్ కుమారసామి తంగరాజ్, బీర్బల్ సహానీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలియో సైన్సెస్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ నీరజ్ రాయ్ సారథ్యంలోని పరిశోధకుల బృందం తొలిసారిగా సమగ్ర మైటోకాండ్రియల్ డీఎన్ఏ అధ్యయనం జరిపింది. దీనిపై శుక్రవారం ప్రకటన విడుదలైంది. బ్రోక్‌పా, చాంగ్‌పా, మోన్‌పా తెగలకు చెందిన 108 మంది జన్యువులను ఈ బృందం విశ్లేషించింది. ఫలితాలను పురాతత్వ, చారిత్రక ఆధారాలతో నూ పోల్చారు. తద్వారా బ్రోక్‌పా, చాంగ్‌పా, మోన్‌పా ప్రజల తల్లి తరఫు జన్యువులు తూర్పు ఆసియా, దక్షిణ ఆసియా, టిబెట్ ప్రాంత ప్రజల జన్యువులతో సరిపోలాయని తంగరాజ్ తెలిపారు. బ్రోక్‌పా తెగ ప్రజలు లద్దాక్‌లో అత్యంత ప్రాచీనులని, 12వేల ఏళ్ల కిందటి కొత్త రాతి యుగంకాలంనాటి జన్యు మూలాలు వారిలోఉన్నట్టు నీరజ్‌రాయ్ తెలిపారు. హిమాలయాలు ముఖ్యంగా సిల్కుమార్గం ద్వారా ప్రజల రాకపోకలు జరిగాయన్న సిద్ధాంతాన్ని తమ పరిశోధన రుజువు చేస్తుందని సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ నందికూరి తెలిపారు.

చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన చంద్రయాన్-3.. విద్రాణ స్థితిలోనూ సేవ లందిస్తోంది. విక్రమ్ ల్యాండర్‌లోని లేజర్ రెట్రోరిఫ్లెక్టర్ అరే (ఎల్ఆర్ఏ) పరికరం జాబిల్లి ఉపరితలంపై లోకేషన్ మార్కర్‌గా పనిచేస్తోందని ఇస్రో తెలిపింది. గతేడాది డిసెంబరు 12న నాసాకు చెందిన లునార్ రికనైసెన్స్ ఆర్బిటర్ సంకేతాలను ఈ ఎల్ఆర్ఏ గుర్తించినట్టు పేర్కొంది. - బెంగళూరు

బీజేపీ 'వర్గీకరణాస్త్రం'!

లోక్‌సభ ఎన్నికల్లో మాదిగల ఓటు బ్యాంకు కలిసొస్తుందని కమలనాథుల లెక్కలు

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సంబంధించి కేంద్రం కమిటీ ఏర్పాటు చేసిన నేపథ్యంలో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దళితుల ఓటు బ్యాంకు తమకు అండగా ఉండబోతోందని కమలనాథులు ఆశిస్తున్నారు. కమిటీ ఏర్పాటు చేసి ప్రధాని నరేంద్ర మోదీ తన మాటను నిలబెట్టుకున్నారని, ఇది పార్టీపై మాదిగల విశ్వాసాన్ని మరింత పెంచుతుందని భావిస్తున్నారు. 'కమిటీ ఏర్పాటు వల్ల న్యాయపరమైన ప్రక్రియ వేగవంతమవ్వడంతో పాటు వర్గీకరణ బిల్లు రూపకల్పనకు ఉపయోగపడుతుంది. పార్లమెంటు సమావేశాల్లోనూ ఈ అంశంపై చర్చించే అవకాశముంది' అని బీజేపీ ఓ ముఖ్య నేత చెప్పారు. 'ఎస్సీ వర్గీకరణ జరిగితే చిట్టచివరి దళితుడికి న్యాయం లభిస్తుంది. మండల్ కమిషన్‌తో అప్పుడు మా ప్రత్యర్థులు బీసీ ఓటుబ్యాంకు పెంచుకునే ప్రయత్నం చేశారు.. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణపై కమిటీ ఏర్పాటుతో మాదిగల ఓటు బ్యాంకు మాకు గణనీయంగా పెరుగుతుంది' అని మరో నేత అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్స్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు నిర్వహించిన భారీ బహిరంగ సభకు ప్రధాని మోదీ స్వయంగా హాజరైన సంగతి తెలిసిందే. ఎస్సీ వర్గీకరణకు కేంద్రం కట్టుబడి ఉందని హామీనిస్తూ, ఇందుకు అనుగుణంగా కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అయితే, ఈ ప్రకటనతో అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన మేర పార్టీకి లబ్ధి చేకూరలేదని బీజేపీ నేతలు అంతర్గతంగా అంగీకరిస్తున్నారు. ఎస్సీ రిజర్వుడ్ స్థానాలను కూడా గెలుచుకోలేకపోయామని ఓ నేత అభిప్రాయపడ్డారు. 'గత ఎన్నికలతో పోలిస్తే తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు బ్యాంకు 7 శాతం నుంచి 14 శాతానికి పెరిగినా.. 8 మంది ఎమ్మెల్యేలు గెలిచినా మాదిగల ఓటు బ్యాంకు ఆశించిన మేర కలసి రాలేదు' అని వివరించారు. అయితే ఏళ్లుగా నలుగుతున్నా ఎస్సీ వర్గీకరణ అంశంపై కమిటీ వేయడం ద్వారా కేంద్రం నిర్ణయం స్పష్టమైందని.. న్యాయపరమైన చిక్కులు కూడా తొలుగుతాయని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఇది తమకు కచ్చితంగా ఉపకరిస్తుందని లెక్కలేసుకుంటున్నారు.



మోదీ గ్యారెంటీకి అనుగుణంగా కమిటీ ఏర్పాటు

ప్రధాని మోదీ గ్యారెంటీకి అనుగుణంగా ఎస్సీ వర్గీకరణపై కమిటీ ఏర్పాటైందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. ఓట్లు, సీట్ల కోసం బీజేపీ చూడబోదని మరోసారి స్పష్టమైందని వెల్లడించారు. వర్గీకరణ అంశం 3 దశాబ్దాలుగా కొనసాగుతోందని చెప్పారు. గత ఎన్నికల్లో ఎస్సీలు పార్టీని ఎంతవరకు ఆదరించారన్న అంశం ఎలా ఉన్నా, మాటకు కట్టుబడి ప్రధాని మోదీ తన నిర్ణయాన్ని అమలు చేసి చూపించారన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

వెనుకబడిన వర్గాలకు.. రిజర్వేషన్ ప్రయోజనాల్లో న్యాయమైన వాటా లభించేలా ఈ కమిటీ చూస్తుంది' అని ఆ వర్గాలు వెల్లడించాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశాల మేరకు కమిటీ ఏర్పాటైందని తెలిపాయి. ఎస్సీ కులాల వర్గీకరణ జరపాలంటూ కేంద్రానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇప్పటికే విజ్ఞప్తులు అందాయి. పలు న్యాయస్థానాలు విచారణ కూడా జరిపాయి. ప్రస్తుతం ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట ఎస్సీ వర్గీకరణ అంశం ఉంది. గత ఏడాది నవంబరులో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఎస్సీ ఉపకులాల విశ్వరూప మహాసభకు ప్రధాని మోదీ స్వయంగా హాజరై ఎస్సీ వర్గీకరణకు కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటైంది.

'యాదాద్రి పవర్'పై విజిలెన్స్ రహస్య విచారణ!

» భూసేకరణలో అవకతవకలకు పాల్పడ్డవారిపైనా..?



మిర్యాలగూడ/దామరచర్ల, జనవరి 19: యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ థర్మల్ విద్యుత్కేంద్రం నిర్మాణ పనుల్లో అవకతవకలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో యాదాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం నిర్మాణానికి 2015 జూలై 8న అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. మొత్తం ఐదు యూనిట్లకు గాను నాలుగేళ్లలో (2019 నాటికి) రెండు, మరో ఏడాదిలో (2020) మూడు యూనిట్లు నిర్మించాలని ప్రతిపాదించారు. పర్యావరణ అనుమతులు, ప్రజాభిప్రాయ సేకరణ, భూసేకరణ పూర్తి చేసుకుని సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో వైటీపీఎస్ నిర్మాణ పనులను 2017 అక్టోబరులో ప్రారంభించారు. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5 యూనిట్లతో 4 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంగా.. రూ.25,099.42 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభమయ్యాయి. నిర్మాణ పనులను జెన్‌కో ప్రారంభించి, బీహెచ్ఈఎల్‌కు అప్పగించింది. తాజాగా నిర్మాణ వ్యయం సుమారు రూ.34 వేల కోట్లకు చేరుకుంది. నిర్మాణ పనుల్లో జాప్యానికి గత ప్రభుత్వ పెద్దల ఒత్తిడే కారణమన్న ఆరోపణల నేపథ్యంలో.. విజిలెన్స్ అధికారులు విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. బ్యాలెన్స్ ఆఫ్ ప్లాంట్ (బీవోపీ) పనులను టెండర్లు లేకుండానే స్థానిక నేతలకు కట్టబెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో అధికారులు జెన్‌కో కార్యాలయం నుంచి ఫైళ్లను స్వాధీనం చేసుకొని, రహస్యంగా విచారణ కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక విద్యుత్కేంద్రం నిర్మాణానికి జరిపిన భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల్లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్న అధికారులు, నేతలపై కూడా విజిలెన్స్ దృష్టి సారించినట్లు సమాచారం.

ఎటువంటి విచారణా లేదు: సమ్మయ్య, జెన్‌కో సీఈ

థర్మల్ కేంద్రంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు అవాస్తవం. విద్యుత్కేంద్రం లావాదేవీలు, కాంట్రాక్టులకు బిల్లుల ప్రక్రియ పూర్తిగా జెన్‌కో కార్యాలయం నుంచే జరుగుతుంది. ప్లాంట్‌లో తనిఖీలు జరగలేదు.



కోఠిలోని డీహెచ్ కార్యాలయం వద్ద బైఠాయించిన స్టాఫ్ నర్సులు

సొంత జోన్లకు పంపాల్సిందే

» జీవో 317తో తీవ్రంగా నష్టపోయాం: నర్సులు

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గత సర్కారు తీసుకొచ్చిన జీవో 317తో తమకు తీవ్రంగా అన్యాయం జరిగిందంటూ స్టాఫ్ నర్సులు ఆందోళన బాట పట్టారు. కోఠిలోని ప్రజారోగ్య సంచాలకుల (డీహెచ్)కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. తమకు న్యాయం చేసే వరకు ఆందోళన విరమించేది లేదంటూ అక్కడే బైఠాయించారు. డీహెచ్ కార్యాలయ సిబ్బంది సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు.. స్టాఫ్ నర్సులకు నచ్చజెప్పారు. డీహెచ్ రవీంద్రనాయక్‌తో మాట్లాడించి వారి ఆందోళనను తాత్కాలికంగా విరమింపజేశారు. జీవో 317తో జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేశారు. సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం సిబ్బందికి వినతి పత్రాన్ని ఇచ్చి వచ్చారు. వాస్తవానికి వైద్య, ఆరోగ్య శాఖలో కొత్తగా 7,093 స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేస్తున్నారు. మెడికల్ బోర్డు ఇప్పటికే ఆ ప్రక్రియను పూర్తిచేసింది. మరో వారంలోపే సెలక్షన్ జాబితాను విడుదల చేయనుంది. వారంతా వచ్చి పోస్టింగ్స్ తీసుకుంటే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బాధిత స్టాఫ్‌నర్సులు చెబుతున్నారు. తమ జోన్ పరిధిలోని వేకెన్సీలన్నీ వారితో నిండిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందుగా తమను సొంత జోన్లకు పంపాలని డిమాండ్ చేస్తున్నారు. పలువురు మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో టీవీవీపీ పరిధిలో జీవో 317 అమలును తాత్కాలికంగా నిలిపివేయాలని మంత్రి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

'57 ఉపకులాలను గ్రూపు-ఏలో చేర్చాలి'

పంజాగుట్ట, జనవరి19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుపై కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా నేతృత్వంలో ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ తెలుగు రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి దళితుల్లో ఉన్న 59 కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను సమీక్షించి అన్ని కులాలకు సామాజిక న్యాయం చేకూరే విధంగా వచ్చే పార్లమెంట్ ఎన్నికలలోపు ఎస్సీ వర్గీకరణ అమలు చేయడానికి కృషి చేయాలన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నివురుగప్పిన నిప్పు

కొద్ది విరామం తరువాత మణిపూర్‌లో తిరిగి కొంతకాలంగా హింస కొన సాగుతోంది. నలభైఎనిమిదిగంటల్లో పదిమంది మరణించడంతో ప్రధాని ఇప్పటికైనా ఆ రాష్ట్రంమీద దృష్టిపెడతారా? అని విపక్షాలు అడుగుతున్నాయి. అధికారికంగా రెండువందలకుపైగా మరణాలు నమోదై, డెబ్బయ్ ఐదువేల మంది నిరాశ్రయులైన ఈ రాష్ట్రాన్ని రాహుల్ గాంధీ తన భారత్ జోడో న్యాయయాత్ర ఆరంభానికి ఎంచుకున్నారు. మణిపూర్ మంటలు చల్లారాలంటే, ప్రధాని నోరువిప్పాలని, ఆ రాష్ట్రాన్ని సందర్శించి ప్రజల మధ్య సయోధ్య కుదర్చాలని, సామరస్యాన్ని నెలకొల్పాలని కాంగ్రెస్ ఇప్పుడే కాదు, ఎప్పటినుంచో అంటోంది. రాహుల్ న్యాయ యాత్ర అక్కడి ప్రజలకు తమ భవిష్యత్తుపట్ల భరోసాని ఇస్తుందని ఆ పార్టీ చెప్పుకోవడం సహజం. తిరిగి రాష్ట్రంలో అగ్గిరాజుకుంటున్న ఈ తరుణంలోనైనా మోదీ తన ఊగిసలాటను పక్కనబెట్టి ఒక్కసారి కాలూనితే బాగుంటుందని చాలామంది నమ్మకం.

గురువారం మణిపూర్‌లో రెండువేర్వేరు ఘటనల్లో ఐదుగురు మీతీలు మరణించారు. ముందురోజు భారత్–మయన్మార్ సరిహద్దుపట్టణం మోరేలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు సైనిక కమాండోలు కన్నుమూశారు. మూడు పోలీసు పోస్టులమీద కుకీ మిలిటెంట్లు దాడిచేశారని, మయన్మార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న 'పీపుల్స్ డిఫెన్స్ ఫోర్స్' తిరుగుబాటుదారులు వీరితో చేతులు కలిపివుండవచ్చునని ఈశాన్య రాష్ట్ర భద్రతాసలహాదారు కుల్దీప్ సింగ్ అనుమానం. ఈ రెండు వరుస ఘటనలతో పాటుగా పోలీసుస్టేషన్ల నుంచి ఆయుధాలను ఎత్తుకుపోయే ప్రయత్నాలు కూడా కొన్నిచోట్ల జరిగాయి. పోలీసులు అడ్డుపడటం, వారిమీద దాడులు జరగడం అటుంచితే, తమకు భద్రత కల్పించాలంటూ స్థానిక ప్రజలు వీధుల్లోకి రావడం, వారిని వెనక్కునెట్టివేసే ప్రయత్నంలో పోలీసులు గాయపడటం వంటివి కూడా జరుగుతున్నాయి. పోలీసులుమీదా, స్థానికులమీదా వరుసగా జరుగుతున్న దాడులు ప్రజలను భయపెడుతున్నాయి. వివిధ యువజన సంఘాలు నిరసన ర్యాలీలు నిర్వహించడం, ముఖ్యమంత్రిని కలిసే తమ ప్రయత్నాన్ని అడ్డుకున్నందుకు మహిళలు బైఠాయింపులు జరపడం వంటివి పరిస్థితి తీవ్రతను తెలియచెబుతున్నాయి. అన్ని భద్రతావిభాగాలతో కూడిన యూనిఫైడ్ కమాండ్ అధిపతిగా ఉన్న కుల్దీప్‌సింగ్‌ను తప్పించి, స్వయంగా ముఖ్యమంత్రే దానిని నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తుంటే, పరిస్థితులను నియంత్రించాలంటే కొన్ని వైమానిక హెలికాప్టర్లు మాకు అందుబాటులో ఉంచాలని ఆయన కేంద్రప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మణిపూర్‌లో ప్రస్తుత పరిస్థితులకు కారణాలు ఏమైనప్పటికీ, ఆ రాష్ట్రం ఇంకా చల్లారలేదన్నది నిజం. వివిధ తెగల మధ్య ఉన్న ఆ పాటి సయోధ్య కూడా పూర్తిగా అడుగంటిపోయి, నివురుగప్పిన నిప్పులాగా ఉన్న వాతావరణాన్ని మిలిటెంట్లు తమకు అనుకూలంగా వాడుకోవడానికి ప్రయత్నించడం సహజం. గతవారం కుకీ ఉగ్రవాదులు నలుగురు మీతీలను అపహరించి చంపివేశారు. పక్షంరోజుల క్రితం మీతీ తీవ్రవాద సంస్థ 'పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ' ఐదుగురు మీతీ ముస్లిం పంగాల్స్‌ను చంపివేసింది. నాగాల మాదిరిగానే ఈ తెగలమధ్య వైరంలో ముస్లిం మీతీలు ఏ పక్షానికి కొమ్ముకాయకుండా తటస్థంగా ఉన్న విషయం తెలిసిందే. తెగలమధ్య వైరంతో చీలిపోయివున్న మణిపూర్‌లో తీవ్రవాదం బలపడుతూండటం ప్రమాదకరం. అటు మీతీలకు, ఇటు కుకీ–జోమీ తెగలకు చెందిన వివిధ తీవ్రవాద గ్రూపులు తమ ప్రజల మానసికస్థితినీ, బలహీనతలను సొమ్ముచేసుకుంటూ, రక్షకులుగా అవతారమెత్తేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఉద్రిక్తతలు కొనసాగేట్టు చేస్తున్నాయి. మీతీలపట్ల అపరిమిత ప్రేమాభిమానాలున్న ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ మీతీ తీవ్రవాద సంస్థల విషయంలో చూసీచూడనట్టు పోతున్నారని మిగతావారి అనుమానం.

అనేక ఆంక్షలు, నియంత్రణల మధ్య, స్థలకాలాదుల్లో కొన్ని మార్పుచేర్పులతో ఆరంభమైన రాహుల్ న్యాయయాత్ర ఈ ఈశాన్య రాష్ట్రం మీదకు తిరిగి దేశప్రజల దృష్టిని మళ్ళించింది. కొంతకాలం పాటు తీవ్రమైన చర్చోపచర్చలు జరిగి, ఆ తరువాత పాలకుల మాదిరిగానే మీడియాకు కూడా పట్టకుండా మిగిలిపోయిన మణిపూర్‌లో పరిస్థితులు పెద్దగా మారలేదని, తిరిగి రాజుకొనేందుకు అది సిద్ధంగా ఉన్నదని వరుస ఘటనలు హెచ్చరిస్తున్నాయి. రాహుల్ వచ్చివెళ్ళినందుకు కాకున్నా, ప్రధాని మోదీ స్వయంగా రాష్ట్రాన్ని సందర్శించి, ఈ ఎనిమిదినెలల కాలంలో తాము అక్కడ సాధించిందేమిటో స్వయంగా తెలుసుకొని, నాలుగు మంచిమాటలతో ప్రజలకు కాస్తంత ఉప-

కుబేరులే తప్ప, పేదలు పట్టరు!

తెలుగు నాటక రాజం 'కన్యాశుల్కం'లో నాయక 'మధురవాణి' తనను ముద్దెట్టుకున్నదంటూ కొండుభట్లు అనే ఒక అప్రధాన పాత్ర వీధుల్లో ఆనందోత్సాహాలతో గెంతులు వేస్తుంది. సంపద్వంతమవుతున్న ఇండియా విషయమై మీడియా అత్యుత్సాహాలూ అదే విధంగా ఉన్నాయని అనవచ్చు. నిజమే, వార్షికాదాయం 10,000 డాలర్లు (రూ.8,40,000) ఉన్న వ్యక్తుల సంఖ్య పెరుగుతోంది. సిఎజిఆర్ (కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్) ఇతోధికంగా పెరుగుతూ సంపద్వంత వ్యక్తుల సంఖ్య పెరుగుతుందని మీడియా ఘోషిస్తోంది. వినియోగం భారీ స్థాయిలో పెరిగిపోయేందుకు సంపద్వంత ఇండియా విశేషంగా దోహదం చేస్తుందని. ఈ సంవత్సరాంతానికి భారత ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ (ఐదు లక్షల కోట్ల) డాలర్ల విలువైనదిగా చేసేందుకు సంపన్న ఇండియా కృతనిశ్చయంతో ఉన్నదని మీడియా పదే పదే చెబుతోంది. అయితే ఈ 5 ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్య పరిపూర్తి గడువు ఇంకా అనిర్ధారితంగా ఉన్నది (ఎందుకంటే అది నిరంతరమూ మారుతూ ఉన్నది).

ఇండియా సంపద్వంత మవుతుండడం పట్ల నేను చాలా సంతోషంగా ఉన్నాను. అయితే అందుకొక షరతు ఉన్నది. గోల్డ్‌మన్ సాక్స్ అనే విఖ్యాత పెట్టుబడి బ్యాంకు అంచనా ప్రకారం 2026 సంవత్సరం నాటికి సంపన్న భారతీయుల సంఖ్య 100 మిలియన్ (పది కోట్లు)గా ఉంటుంది. అంటే దేశ జనాభాలో ఇంచుమించు 7 శాతం మంది సంపన్నులుగా ఉంటారు. అయితే గోల్డ్‌మాన్ సాక్స్ కేవలం సంపన్న భారతీయులు గురించి మాత్రమే ఎందుకు మట్లాడుతోంది? మిగతా 93 శాతం మంది భారత ప్రజల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదు? ఎందుకంటే ఆ సంస్థ సంపన్నుల బ్యాంక్. సంపద్వంత ఇండియా ఒక ప్రత్యేక దేశమైతే అది ఇక మధ్యస్థాయి ఆదాయం గల దేశంగాను, ప్రపంచంలో 15వ అతి పెద్ద సంపన్న దేశంగాను (కొన్ని గౌరవప్రదమైన మినహాయింపులతో) ఉండి ఉండవచ్చు. ఆర్జిస్తున్న భారీ ఆదాయాన్ని ఆదాచేసుకుని మదుపు చేసే వారు విచ్చలవిడిగా ఖర్చు చేసేవారు మాత్రమే తమ ఆదాయం, సంపద, ఇంకా ప్రతి విషయం గురించి పెద్దగా మాట్లాడుతున్నారు. సంపద్వంత ఇండియా ఏదైనా కొన్నప్పుడు, వినియోగం చేసినప్పుడు — సకల భారతీయులూ కొనుగోళ్ళు చేస్తున్నారని, అమిత వినియోగం చేస్తున్నారనే భ్రాంతిని కలిగిస్తోంది! మరింత స్పష్టంగా చెప్పాలంటే సంపద్వంత ఇండియా సమస్త భారతదేశానికీ ప్రతినిధి అయింది! మిగతా 93 శాతం మంది అల్పాదాయాలతో సంతృప్తికరమైన జీవితాన్ని గడపడానికి ప్రయత్నిస్తున్నవారు లేక లభిస్తున్న ఆదాయంతో సంతోషదాయకంగా జీవించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న వారేనని చెప్పి తీరాలి.



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

మూడు గణాంకాలను మరింత వివరంగా చూద్దాం. సంపద్వంత ఇండియా వార్షికాదాయం రూ.8,40,000; మధ్యస్థాయి ఆదాయం రూ.3,87,000, తలసరి ఎనఎనఐ – రూ.1,70,000. సంపద్వంత ఇండియా చాలా చాలా చిన్నది అని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తలసరి జాతీయ ఆదాయం (ఎనఎనఐ) అర్థరహితమైనది. సంపద్వంత ఇండియా ఆదాయసగటును పై స్థాయికి లాగుతుంది. కనుక బాగా ఉపయుక్తమైన గణాంకం మధ్యస్థాయి ఆదాయం మాత్రమే. భారత ప్రజల్లో సగం మంది (71 కోట్లు) వార్షికాదాయం రూ.3,87,000 లేక అంతకంటే తక్కువ. లేదా నెలసరిన చూస్తే రూ.32,000 లేదా అంతకంటే తక్కువ. ఆర్థిక నిచ్చెనపై మీరు ఎంత క్రింది స్థాయిలో ఉంటారో మీ ఆదాయం అంత తక్కువగా ఉంటుంది. దేశ జనాభాలో ఆర్థికంగా కింది స్థాయిలో ఉన్న పదిశాతం మంది లేదా 20శాతం మంది నెలా నెలా ఆర్జిస్తున్నదెంత? నా ఉదార అంచనా ప్రకారం క్రింది స్థాయి 10శాతం మంది నెలసరి ఆదాయం రూ.6000 కాగా కింది స్థాయిలో ఉన్న 11 నుంచి 20 శాతం మంది నెలసరి ఆదాయం రూ.12,000.



దేశ సంపదలో 60 శాతం మేరకు, జాతీయ ఆదాయంలో 57 శాతం వాటా కలిగివున్న 7 కోట్ల మంది సంపన్న భారతీయుల భాగ్య వైభవం ఆర్థిక శ్రేణీక్రమంలో అట్టడుగు స్థాయిలో 20 శాతం మంది స్థితిగతుల పట్ల పాలకుల్లో ఉపేక్షా భావాన్ని కలిగిస్తోంది! మతాన్ని తీవ్ర జాతీయవాదంతో ఎలా మిళితం చేయాలో పాలక పార్టీకి బాగా తెలుసు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ సంపన్న భారతీయుల ప్రభుత్వమే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆర్థిక సమత్వం, సామాజిక న్యాయం భావనలు, ఆదర్శాలకు మన దేశం చాలా దూరంగా, దూరంగా వెళ్లిపోతోంది.

ఇంత తక్కువ ఆదాయంతో వారు ఎలా జీవిస్తున్నారనే విషయమై మనం తప్పక కలవరపడవలసి ఉన్నది. ఎటువంటి ఆహారాన్ని వారు తీసుకుంటున్నారు, ఎటువంటి దుస్తులు ధరిస్తున్నారు, ఆరోగ్య భద్రత సేవలు ఎలా పొందుతున్నారు అనే అంశాలు తప్పక ఆందోళన కలిగిస్తాయి. ఇలాంటివారు దేశ జనాభాలో 16 శాతం మేరకు ఉంటారు. కానీ నీతి ఆయోగ్ అంచనా ప్రకారం దేశ జనాభాలో దారిద్ర్యరేఖకు దిగువన నివశిస్తున్నవారు 11.28 శాతం మంది లేదా 16.8 శాతంగా ఉన్నారు. శతాధిక కోట్ల భారతీయులలో 7 కోట్ల మంది సంపద్వంతులుగా ఉండడం చాలా ఆనందప్రదమైన విషయం. సంతోషంగా వేడుక చేసుకోవల్సిన విషయం, సందేహం లేదు. అయితే ఇంతకు మూడురెట్లు అధికంగా ఉన్న పేదల దయనీయ బతుకుల గురించి కూడా మనం తప్పక ఆలోచించాలి. 22.8 కోట్ల మంది భారతీయులు పేదరికంలో మగ్గుతున్నారు. ఈ పేదలు ఎవరో గుర్తించడం అంతకష్టమేమీ కాదు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనుల కోసం పేరు నమోదు చేయించుకున్నవారు 15.4 కోట్ల మంది. వీరికి ఏటా కనీసం 100 రోజులపాటు ఉపాధి సమకూర్చడానికి ప్రభుత్వం హామీపడింది. గత ఐదు సంవత్సరాలుగా ఏటా సగటున 48 నుంచి 51 రోజులపాటు పనులు సమకూరుస్తున్నారు. ఈ లబ్ధిదారులలో అత్యధికులకు ఎల్‌పీజీ కనెక్షన్ సదుపాయం కూడా సమకూర్చారు. అయితే ఈ కుటుంబాలు సంవత్సరానికి కేవలం 3.7 సిలిండర్లను మాత్రమే వినియోగించుకోగల ఆర్థిక స్థితిలో ఉన్నాయి.

ఒకటి లేదా రెండు ఎకరాల వ్యవసాయ భూమి కలిగివుండి సొంత సేద్యం చేసుకుంటున్న కుటుంబాలు 10.47 కోట్ల దాకా ఉన్నాయి (ఈ సంఖ్య నవంబర్ 15, 2023 నాటికి 8.12 కోట్లకు తగ్గిపోయింది. ఈ కుటుంబాలకు ఏడాదికి కిసాన్ సమ్మాన్ కింద రూ.6000 ఆదాయం లభిస్తుంది; వ్యవసాయ కూలీలుగా ఉన్న దినసరి వేతన కార్మికులు పేదవారుగాక మరేమవుతారు? పేవ్‌మెంట్స్, వంతెనల కింద బతుకులు ఈడుస్తున్న అభాగ్యులు; ఒంటరి మహిళలలో అత్యధికులు వృద్ధాప్య పెన్షన్లు పొందుతున్నవారే, మురికికాల్వలు మునిసిపల్ మూత్రశాలలను శుభ్రం చేయడం, చచ్చిన జంతువుల చర్మాలను వొలవడం మొదలైన అపరిశుభ్ర, పనులు జీవనాధారంగా ఉన్నవారు పేదలే అనడంలో సందేహం లేదు. మధ్యస్థాయి ఆదాయం కంటే తక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తున్నవారిలో 21 నుంచి 50శాతం మంది ఆర్థిక శ్రేణి క్రమంలో దిగువన ఉన్న 20శాతం మంది కంటే మెరుగ్గా నివశిస్తున్నారు. ఆకలి దప్పులు అనేవి వీరికి తెలియనప్పటికీ వీరి జీవన స్థితిగతులు నిత్యం అనిశ్చితంగానే ఉంటాయి. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల సిబ్బంది మినహా ఇతర రంగాలలోని ఉద్యోగులు, కార్మికులు తమ జీవనాధారాన్ని కోల్పోవలసివస్తుందనే భయంతో జీవిస్తున్నవారే. 2023లో టెక్ కంపెనీలు 2,60,000 మేరకు ఉద్యోగులను తగ్గించుకున్నాయి. నిపుణ సిబ్బంది వేల సంఖ్యలో వీధినపడ్డారు. 100 అంకుర సంస్థలు 24 వేల ఉద్యోగాలను రద్దు చేశాయి. ప్రైవేట్ ఉద్యోగులలో అత్యధికులకు ఉద్యోగభద్రత లేదు. అలాగే వారు పొందే సామాజిక భద్రతా సదుపాయాలు కూడా ఏమీ లేవు. ప్రభుత్వ ఈ–శ్రమ్ పోర్టల్‌పై నమోదైన 2.8 కోట్ల మంది గృహపరిచారకులు చట్టబద్ధమైన కనీస వేతనాలు పొందడమే లేదు. ఇటువంటి అభాగ్యుల సంఖ్య వాస్తవనికి ఇంకా అధికంగా ఉంటుంది.

పంచ నక్షత్రాల హోటళ్లు, రిసార్ట్‌లు, తళుకు బెళుకుల మిరుమిట్లుగొలిపే మాల్స్, లగ్జరీ బ్రాండ్ స్టోర్స్, మల్టిప్లెక్స్ సినిమా హాల్స్, విలాసకరమైన విహార కేంద్రాలలో వివాహాలు, 4 నుంచి 9 కోట్ల రూపాయల విలువ చేసే కార్లు (ఒక కంపెనీ ఇటువంటి కార్లను గత ఏడాది నూటికి పైగా విక్రయించింది) మొదలైన విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నవారు సంపద్వంత ఇండియాలో చాలా మంది ఉన్నారు. ఈ సంపన్న భారతీయులు ఇంత వైభవోపేత జీవనశైలిని ఎలా కలిగి ఉన్నారు? దేశ సంపదలో 60 శాతం మేరకు వీరి స్వాధీనంలోనే ఉన్నది. అంతేకాదు జాతీయ ఆదాయంలో వీరి వాటా 57 శాతంగా ఉన్నది. మిరుమిట్లుగొలుపుతున్న ఈ సంపన్నత ఆర్థికశ్రేణీ క్రమంలో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మంది స్థితిగతుల పట్ల పాలకుల్లో ఉపేక్షా భావాన్ని కలిగిస్తోంది. పేదల సంక్షేమం పట్ల బీజేపీ ప్రభుత్వ ఈ గర్హనీయ వైఖరికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మద్దతు ఉన్నది. అది ఒక ఉక్కు చట్రంలాంటి మద్దతు. కార్పొరేట్ కంపెనీలు, ఎన్నికల బాండ్ల పుణ్యమా అని పాలక పార్టీ కోశాగారంలో నిధులు సమృద్ధంగా ఉన్నాయి. మతాన్ని తీవ్ర జాతీయవాదంతో ఎలా మిళితం చేయాలో ఆ పార్టీకి బాగా తెలుసు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ కచ్చితంగా సంపన్న భారతీయుల ప్రభుత్వమే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆర్థిక సమత్వం, సామాజిక న్యాయం భావనలు, ఆదర్శాలకు మన దేశం చాలా దూరంగా, దూరంగా వెళ్లిపోతోంది. ప్రతిపక్షాలు మీడియా ఈ కఠోర వాస్తవాల పట్ల జాగరూకతతో లేకపోవచ్చుగానీ 93 శాతం మంది పేద ప్రజలు, మధ్యతరగతి వర్గాల వారు పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తున్నారు. తమ మనసులలోని మాటను వెల్లడించేందుకు వేచివున్నారు.

లెనిన్: 'ప్రపంచ కావ్యానికి ప్రతిపదార్థం'

లెనిన్‌గా సుప్రసిద్ధుడైన వ్లదీమిర్ ఇల్యీచ్ ఉల్యానొవ్ భౌతికంగా మరణించి ఈ 21కి వంద సంవత్సరాలు నిండుతాయి. యాభై నాలుగు సంవత్సరాలు నిండకుండానే మరణించినా, అందులో ముప్పైఅయిదేళ్లకు మించని ప్రజా జీవితంలో చేసిన పనులు, సాధించిన విజయాలు, ప్రపంచానికి చూపిన ఆదర్శాలు ఆయనకు అనితర సాధ్యమైన మరణానంతర జీవితాన్ని ఇచ్చాయి. ఒక మనిషిని మరొక మనిషీ, ఒక జాతిని మరొక జాతీ పీడించడానికి వీలులేని ఒక సమతా సుందర స్వప్నాన్ని మానవజాతి వందల ఏళ్లుగా, వేల ఏళ్లుగా కంటున్నదేమో గాని, మానవ చరిత్రలో ఆ స్వప్నాన్ని సాకారం చేసిన ఘనత లెనిన్‌దే. చుట్టుముట్టిన భయానక అవరోధాల మధ్య, ప్రతీపశక్తుల సవాళ్లను ఎదుర్కొంటూ ఆ స్వప్నం నిలదొక్కుకోవడానికి మార్గం సుగమం చేసిన శక్తి లెనిన్‌దే.


లెనిన్ జీవితమంతా, వ్యక్తిగత స్థాయిలోనూ, నిర్వహించిన ఉద్యమాల స్థాయిలోనూ, మొత్తంగా ఎదుర్కొన్న వ్యవస్థ స్థాయిలోనూ కంటకావృత మార్గంలోనే నడిచింది. కష్టం మీద కష్టం కష్టం తోసుకొచ్చాయి. ఆ కష్టభరిత జీవితంలోనే ఆయన విజయ సాఫల్యం వైపు పురోగమించాడు. ప్రకృతినీ, రాజ్యాన్నీ, లోపలి ప్రత్యర్థులనూ, బైటి ప్రత్యర్థులనూ అధిగమిస్తూ, ఓడిస్తూ, గేలి చేస్తూ విజయం మీద విజయం మీద విజయం సాధించాడు. బహుశా ఆ ఒత్తిడే ఆయన జీవితాన్ని అర్ధాంతరంగా 54 ఏళ్లకే ముగించి ఉంటుంది. కాని ఆ స్వల్ప జీవిత కాలంలోనే ఆయన చేసిన అధ్యయనం, రాసిన రచనలు, ఉపన్యాసంలో, రచనలో ఎదుటివారిని మెప్పించే వాదనా పటిమ, నాయకత్వం వహించిన ఉద్యమాలు, అనుభవించిన నిర్బంధాలూ ప్రవాసాలూ, తప్పించుకున్న హత్యా ప్రయత్నాలూ, స్థాపించిన మొట్టమొదటి కార్మిక కర్షక రాజ్యం, నిర్వహించిన కార్మికవర్గ సోషలిస్టు సమాజ నిర్మాణం, సమయ సందర్భాలకు తగినట్టు వ్యూహాలను మార్చిన చాతుర్యం, తన స్థల కాలాలకు మాత్రమే కాదు, ప్రపంచమంతటికీ, సర్వకాలాలకూ ప్రాసంగికమైన ఆలోచనాచరణలు — లెనిన్ జీవితం ఒక ప్రయోగం. ఒక ఆదర్శం. రష్యన్ సామాజిక చరిత్ర లెనిన్ అనే అసాధారణ వ్యక్తిని తయారు చేస్తే, ఆ వ్యక్తి ప్రపంచ చరిత్రనే మార్చే కొత్త దారి ఏర్పరిచాడు.

> రష్యన్ సామాజిక చరిత్ర లెనిన్ అనే అసాధారణ వ్యక్తిని తయారు చేస్తే, ఆ వ్యక్తి ప్రపంచ చరిత్రనే మార్చే కొత్త దారి ఏర్పరిచాడు.

'ప్రపంచమనే పద్మంలో/ పరీమళం లెనిన్/ ప్రపంచమనే కావ్యానికి/ ప్రతి పదార్థం లెనిన్/ బ్రదుకనే చిక్కు సమస్యకు/ పరిష్కారం లెనిన్' అని శత జయంతి సందర్భంగా శ్రీశ్రీ రాసిన కవితాపాదాలు అక్షర సత్యాలు.

1870 ఏప్రిల్ 22న వోల్గా నదీ తీరంలోని సింబీర్స్క్ నగరంలో ఇల్యా నికొలాయేవిచ్, మరీయా అలెక్సాంద్రోవ్నాల ఆరుగురు సంతానంలో మూడవవాడు వ్లదీమిర్. ప్రగతిశీల భావాలున్న తండ్రి ప్రభుత్వ పాఠశాలల తనిఖీ అధికారిగా పనిచేస్తూ, వ్లదీమిర్‌కు పదహారేళ్లు ఉన్నప్పుడు మరణించాడు. తండ్రి మరణం నాటికి సేంట్ పీటర్స్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న ఆరేళ్లు పెద్దదైన అక్క, నాలుగేళ్లు పెద్దవాడైన అన్న మూడో జార్‌కు వ్యతిరేకంగా సమీకృతమైన విప్లవ విద్యార్థి బృందంలో చేరారు. ఒక ఏడాది తర్వాత ఆ బృందం జార్ చక్రవర్తిని హత్య చేయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. అన్న అలెక్సాంద్ర్‌కు ప్రభుత్వం మరణశిక్ష విధించి ఉరి తీసింది. అక్క అన్నాను కూడా అరెస్టు చేశారు. దానితో సింబీర్స్క్‌లో పరిచయస్తులలో ఒకరిద్దరు మినహా అందరూ వెలివేసినట్టు చూడడంతో ఉండలేని స్థితి వచ్చి కుటుంబం కజాన్‌కు మారింది. అప్పుడున్న స్థితిలో వ్లదీమిర్‌కు ఎలాగూ సేంట్ పీటర్స్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో సీటు రాదు గనుక కజాన్ విశ్వవిద్యాలయంలో చేరాడు. కాని అక్కడా విద్యార్థి రాజకీయాలలో పాల్గొంటున్నాడని, విశ్వవిద్యాలయం నుంచి తొలగించి, కొకుష్కినో అనే గ్రామంలో నిరంతర పోలీసు నిఘా కింద ఉండాలని శాసించారు. అలా పదిహేడో ఏట మొదలైన నిర్బంధాలు, నిషేధాలు, ప్రవాసాలు తర్వాత ముప్పైఏళ్లు సాగుతూనే ఉన్నాయి.

> లెనిన్ మరణించిన వెంటనే రాసిన దీర్ఘ కావ్యంలో కవి వ్లదిమీర్ మయకోవస్కీ అన్నట్టు, 'లెనిన్ నేడు లేడూ? చూడు, జనంలో ఉన్నాడు' అని అనుకోకుండా ఈ వంద సంవత్సరాలు గడవలేదు.



రేపు శతవర్ధంతి

రాజకీయ కారణాల వల్ల సీటు ఇవ్వని విశ్వవిద్యాలయంలోనే ప్రైవేటు విద్యార్థిగా నాలుగు సంవత్సరాల న్యాయశాస్త్ర విద్యను ఏడాదిన్నరలో పూర్తిచేసి న్యాయవాది అయ్యాడు. సమారా నగరంలో న్యాయవాదిగా పని చేస్తూ స్థానిక రైతుల తరఫున, ప్రజల తరఫున వాదించాడు. ఆ సమయంలోనే విపరీతంగా అధ్యయనం సాగిస్తూ మార్క్సిజంలో ప్రవేశించాడు. తన ఆలోచనలను కార్యాచరణగా మార్చడానికి అప్పటి రాజధాని సేంట్ పీటర్స్‌బర్గ్ చేరుకుని, కార్మికుల అధ్యయన బృందాలు ప్రారంభించాడు. అప్పుడే రచన కూడా ప్రారంభించాడు. ఇరవై మూడవ ఏట రైతాంగ జీవితంలో కొత్త ఆర్థిక పరిణామాలు' వంటి వ్యాసాలతో ప్రారంభించిన రచనాకృషి, మరణానికి ముందు యాభై మూడో ఏట తీవ్రమైన అనారోగ్యంలో డిక్టేట్ చేసిన రచనల వరకూ అసంఖ్యాకమైన వ్యాసాలు, పుస్తకాలు, కరపత్రాలు, వాదవివాదాలు, సైద్ధాంతిక రచనలు, ఉపన్యాసాలు, నివేదికలు, ప్రభుత్వ ఆదేశాలుగా విస్తరించింది. ఒక్కొక్కటి దాదాపు 650 పేజీలున్న 54 సంపుటాల (ఇంగ్లిష్‌లో 45 సంపుటాలు) రచనలు — అంటే ముప్పై సంవత్సరాల్లో ముప్పై ఆరువేల పేజీలు — రచన చేశాడు.

సేంట్ పీటర్స్‌బర్గ్‌లో సాగించిన అధ్యయన, బోధన, రచన, సమీకరణ రాజకీయ కృషి వల్ల మళ్లీ ఒకసారి ఆయన మీద ప్రభుత్వం విరుచుకుపడింది. అక్కడ అయిదారేళ్ల కృషి కూడా పూర్తి కాకముందే, 1895లో, వందలాది మంది కార్మికులతో పాటు లెనిన్‌ను అరెస్టు చేశారు. ఏడాదిన్నర పాటు జైలులో ఉంచి, తర్వాత మూడు సంవత్సరాలు సైబీరియా ప్రవాసశిక్ష విధించి అక్కడికి పంపారు. ఆ ప్రవాసంలోనూ అధ్యయనం, రచన, రహస్య నిర్మాణం ఆపలేదు. అక్కడే, 'రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి' వంటి కీలక రచనలు చేశాడు. అక్కడే ప్రవాసశిక్షకు గురై ఉన్న సహకార్యకర్త నాడెజ్డా క్రుపస్కయాను పెళ్లి చేసుకున్నాడు. 1900లో అక్కడి నుంచి విడుదలై, ప్రభుత్వ ఆంక్షల మేరకు ప్స్కోవ్ నగరంలో ఉంటూ పార్టీ కోసం ఇస్క్రా (నిప్పురవ్వ) పత్రిక ప్రారంభించాడు. 'నిప్పురవ్వ దావానలమవుతుంది' అని అంతకు ముందరి శతాబ్దపు రైతాంగ పోరాట కవి ఒడోయెవ్స్కీ రాసిన మాటే లెనిన్‌కు ప్రేరణ, ఆ మాటను ఆయన నిజం చేశాడు కూడా.

ప్రవాసంలో జర్మనీ, ఇంగ్లండ్, బెల్జియం, స్విట్జర్లాండ్, ఫిన్లాండ్, స్వీడన్, ఫ్రాన్స్ వంటి దేశాలు తిరుగుతూ, రష్యన్ విప్లవానికి మనుషులను కూడగడుతూ, 1903లో బ్రస్సెల్స్‌లో పార్టీ రెండో మహాసభ జరిపాడు. మహాసభలు జరుగుతుండగానే రష్యన్ గూఢచారుల కన్నుపడి, హఠాత్తుగా సభలను లండన్‌కు మార్చి దిగ్విజయంగా కొనసాగించాడు. ఆ సభలలోనే పార్టీ బోల్షివిక్కులు (అధిక సంఖ్యాకులు), అల్పసంఖ్యాకులు (మెన్షివిక్కులు) అని రెండుగా చీలిపోయింది. రెండు సంవత్సరాల తర్వాత సేంట్ పీటర్స్‌బర్గ్‌లో రక్తసిక్త ఆదివారం పేరుతో కుఖ్యాతి పొందిన మహా మారణకాండతో రష్యన్ ప్రజానీకంలో, కార్మికవర్గంలో జార్ చక్రవర్తి పాలన పట్ల భ్రమలు తొలగడం, బోల్షివిక్కుల పట్ల ఆదరణ పెరిగాయి.

ఈ మధ్యలో 1905 విప్లవ వైఫల్యం, 1907 స్తోలిపిన్ భయంకర నిర్బంధ కాలం, మొదటి ప్రపంచ యుద్ధం, 1917 ఫిబ్రవరి విప్లవం వంటి అనేక పరిణామాలు సంభవించాయి. 1917 ఫిబ్రవరిలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం మీద తిరుగుబాటుగా ప్రజలు, కార్మికవర్గం ఏ మార్గం చేపట్టవలసి ఉన్నదో ఏప్రిల్‌లో లెనిన్ క్రాంతదర్శిగా, ద్రష్టగా అక్టోబర్ విప్లవ సన్నాహాలు చేశాడు. సమయం ఆసన్నమైనప్పుడు తాత్సారానికి తావులేదని, 'మనం ఏ మాత్రం ఆలస్యం చేసినా మన మరణ శాసనంపై మనమే సంతకం చేసుకున్నవారమవుతాం' అన్నాడు. నిజానికి లెనిన్ జీవిత సారాంశమంతా ఇదే. పరిస్థితులకు తలొగ్గడం కాకుండా, ఆ పరిస్థితులను చేతుల్లోకి తీసుకుని, మార్గనిర్దేశనం చేసి, నాయకత్వం వహించడమే.

విప్లవానంతరం ఒక కొత్త రాజ్యం, ప్రపంచంలో మొట్టమొదటి కార్మిక కర్షక రాజ్యం నిర్మాణం ప్రారంభమయింది. నూతన జీవిత విధానం మొదలయింది. అంతకు ముందు ఇరవై సంవత్సరాలు పడిన శ్రమ ఒక ఎత్తు. ఇప్పుడు చేపట్టవలసిన కర్తవ్యాలు మరొక ఎత్తు. కాని ఆ కర్తవ్యాల నిర్వహణ కోసం చరిత్ర లెనిన్‌కు ఐదు సంవత్సరాల సమయం మాత్రమే ఇచ్చింది.

ఆ ఐదు సంవత్సరాలలో లెనిన్ తలపెట్టినవీ, చేసినవీ, చేయించినవీ, విజయం సాధించినవీ చూస్తే అబ్బురపాటు కలుగుతుంది. మొట్టమొదటి రోజునే భూమి శాసనం వెలువడి, భూస్వాముల, చర్చిల, మఠాల, సంపన్నుల భూమినంతా స్వాధీనం చేసుకుని దున్నేవారికి పంచే కార్యక్రమం మొదలయింది. అప్పటికే పాత రష్యన్ రాజ్యం రుద్దిన యుద్ధం నుంచి బైటపడడం, పాత పాలకుల కుట్రలనూ, వారు ప్రారంభించిన అంతర్యుద్ధాన్నీ ఓడించడం, శాంతి కోరుకుంటున్న సోవియట్ ప్రజల మీదికి దండెత్తిన జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా సహా పద్నాలుగు శత్రు దేశాల చక్రబంధాన్ని ఛేదించడం లెనిన్ తక్షణ సవాళ్లు అయ్యాయి. ఆ చక్రబంధాన్ని ఓడించగానే దేశంలో కరువు, టైఫస్, ఫ్లూ వ్యాధులు చెలరేగాయి. ఈ మధ్యలోనే లెనిన్ మీద కనీసం మూడు హత్యా ప్రయత్నాలు జరిగాయి.

> ఒక మనిషిని మరొక మనిషీ, ఒక జాతిని మరొక జాతీ పీడించడానికి వీలులేని ఒక సమతా సుందర స్వప్నాన్ని మానవజాతి వందల ఏళ్లుగా, వేల ఏళ్లుగా కంటున్నదేమో గాని, మానవ చరిత్రలో ఆ స్వప్నాన్ని సాకారం చేసిన ఘనత లెనిన్‌దే. చుట్టుముట్టిన భయానక అవరోధాల మధ్య ప్రతీపశక్తుల సవాళ్లను ఎదుర్కొంటూ ఆ స్వప్నం నిలదొక్కుకోవడానికి మార్గం సుగమం చేసిన శక్తీ లెనిన్‌దే.

ఈ భయంకర అవరోధాల మధ్య కొత్త రాజ్యాన్ని, కొత్త సమాజాన్ని, కొత్త మనిషిని నిర్మించడానికి లెనిన్ యుద్ధ కమ్యూనిజం, నూతన ఆర్థిక విధానాలు, సుబ్బోత్నిక్ స్వచ్ఛంద సేవ వంటి కొత్త కార్యక్రమాలు ప్రతిపాదించాడు. స్త్రీల విముక్తి, చిన్నారి పిల్లల ఆహ్లాదం, విద్య, వైద్యం, ఆరోగ్యం సోవియట్ రాజ్యపు ప్రధాన కర్తవ్యాలుగా ఎంచుకున్నాడు. దేశాన్ని అభివృద్ధి చేయడానికి విద్యుదీకరణ, పారిశ్రామికీకరణ మొట్టమొదటి అవసరాలని ప్రకటించాడు. యువజన సంఘాన్ని సమావేశపరిచినప్పుడు, యుద్ధరంగానికి వెళ్లమంటాడేమో అనుకుంటే అధ్యయనం ప్రస్తుత కర్తవ్యం అని పిలుపు ఇచ్చాడు. శ్రామికవర్గ అంతర్జాతీయతను పెంపొందించడానికి ప్రపంచ దేశాల శ్రామిక పార్టీల ఐక్యతా కృషి ప్రారంభించాడు. జారిస్టు రష్యాలో మహా రష్యన్ జాత్యహంకారం కింద జాతుల బందిఖానాలో అణగారిపోయిన జాతులకు స్వయంనిర్ణయాధికారం ఇచ్చి, స్వచ్ఛంద ఐక్యతతో జాతుల నందనవనంగా మార్చే కృషి ప్రారంభించాడు.

1923 మార్చిలో లెనిన్‌కు మొదటిసారి బ్రెయిన్ స్ట్రోక్‌తో పక్షవాతం వచ్చింది. అప్పటి నుంచి ఎనిమిది నెలల పాటు అత్యున్నత స్థాయి చికిత్స, ఆహ్లాదకరమైన వాతావరణం వంటి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆరోగ్యం కుదుటపడలేదు. 1924 జనవరి 21న ఆ మహత్తర మేధావీ, కార్యకర్తా, నాయకుడూ, నవసమాజ నిర్మాతా అస్తమించాడు. లెనిన్ మరణించిన వెంటనే రాసిన దీర్ఘ కావ్యంలో కవి వ్లదీమిర్ మయకోవస్కీ అన్నట్టు, 'లెనిన్ నేడు లేడూ? చూడు, జనంలో ఉన్నాడు' అని అనుకోకుండా ఈ వంద సంవత్సరాలు గడవలేదు.

• ఎన్ వేణుగోపాల్

మతమే ప్రభుత్వంగా మారితే...!?

అవకాశాలు సమానంగా లేని సమాజంలో మనుషుల ఆకాంక్షలు, స్వప్నాలు, సంకల్పాలు ఆచరణలో వాస్తవ రూపం ధరిస్తాయన్న భరోసా లేదు. అక్కడే నిస్సహాయులైన మానవులకు బతుకు భయం ఏర్పడి అభద్రతని అధిగమించడానికి మతం, దేవుడు ఆశ్రయించవలసినవి అవుతున్నాయి. 'దిక్కు లేనివాళ్లకు దేవుడేదిక్కు' అన్న నానుడి మూలం అదే. అక్కడ మతమైనా దేవుడైనా వ్యక్తిగతమే. కానీ సంపదలను, అధికారాన్ని పోగేసుకోవాలన్న ఆశకు ఆచరణ వ్యూహంగా ఈనాడు మతాన్నీ దేవుడిని రాజకీయం చేయటం వేగవంతమైంది. మత ప్రాతిపదికన మూక సమీకరణ వ్యూహాత్మకంగా అమలౌతోంది. ఫలితంగా ఇదివరకే ముక్కలుగా విభజితమై ఉన్న ప్రజలు మత విద్వేష రాజకీయాలకు బలౌతున్నారు. కుల మత వర్గ నిరపేక్షంగా ప్రజలందరి ఉమ్మడి సంక్షేమానికి, జీవన భద్రతకు, సర్వ సమ్మిళిత అభివృద్ధికి పూచీ పడవలసిన పాలకులు తమ రాజ్యాంగ బాధ్యతల నుండి తప్పుకుంటున్నారు. అక్కడితో ఆగక భిన్న జాతుల, సంస్కృతుల సంగమంగా ఉన్న దేశాన్ని ఏకమత రాజ్యంగా మార్చే దిశగా పావులు కదుపుతున్నారు.



ప్రజల ప్రైవేటు జీవితంలో ఒక ఆధ్యాత్మిక అనుభవంగా ఉండాల్సిన మత విశ్వాసాన్ని రాజకీయీకరించడం ఇటీవలి దశాబ్దాలలో అనూహ్యంగా పెరిగింది. ఆ క్రమంలో ఇతర భిన్న మత విశ్వాసులపై, మతాతీతమైన భిన్న లౌకిక రాజకీయ విశ్వాసులపై నిర్బంధం, ఏక మతాధిపత్య నియంతృత్వం ఏకకాలంలో అమలవుతున్నాయి. ఒకానొక విశ్వాసానికే ఆధిపత్యం ఆపాదించి ఇతర విశ్వాసాలన్నింటినీ అధీనమైనవిగా అణిచివేస్తున్నారు. ఇది ఒక మతానికి మాత్రమే పరిమితమైన విషయంగా కాకుండా సర్వత్రా వ్యాపిస్తూ వస్తున్న విషంగా కూడా మన అనుభవంలోకి ఇప్పటికే వచ్చింది. ఇందుకు ప్రధాన కారణం మనదేశంలో ఆధునిక పూర్వ పునాది ఒక భౌతిక వాస్తవంగానే కాదు, భావజాల రూపంలోనూ నిరంతరం పునరుత్పత్తి అవుతూ ఉనికిలో ఉండడమే. ఫలితంగా ఒక బలమైన సామాజిక మానసికత తయారై అది విశాల ప్రజా శ్రేణులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. బహుళ సంస్కృతుల ప్రజా జీవన విధానాల పట్ల అసహనానికి కారణం అవుతున్నది. ఇది స్వేచ్ఛ, సమానత్వ లౌకిక భావనలకు హామీ ఇచ్చే రాజ్యాంగంలోని ఆధునికతా స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నది.

అధిక సంఖ్యాకుల మతం అందలం ఎక్కితే ఖచ్చితంగా అల్ప సంఖ్యాకుల మత విశ్వాసాలూ, వారి జీవన పరిస్థితులు ఒక అప్రకటిత నియంతృత్వ పహారా కింద అణచివేతకు గురౌతాయి. మతం భూమికగా ఒక విశృంఖలత్వం పేట్రేగిపోతూ వుంది. ప్రభుత్వం వేరు మతం వేరు. మతమే ప్రభుత్వంగా మారటం వల్ల మైనారిటీలు ఎంత హింసకు, అభద్రతకు గురవుతున్నారో మణిపూర్‌లో చూసాం. దీన్ని పౌరసమాజం గుర్తించాలి.

నూతన ఆవిష్కరణలకు అన్వేషణలకు మతం అవరోధంగా మారినందువల్ల ప్రపంచమంతటా మత ప్రమేయం లేని ఆధునిక ప్రజాస్వామిక రాజ్యాల ఆవిర్భావం కోసం పోరాటాలు జరిగినవి, విజయం సాధించినవి. తద్వారా నూతన నాగరికత వెలిసింది. మళ్లీ ఆ రెండిటినీ కలపటం అంటే మళ్లీ ప్రజల్ని పీల్చి పిప్పి చేసే దశకు తీసుకెళ్లడమే. ఏకమత రాజ్యంలో ఆ మత ప్రజలందరికీ సంక్షేమం లభిస్తుంది అనుకోవడం కేవలం భ్రమ మాత్రమే. ఆ మతంలోని అట్టడుగు ప్రజలు ఎప్పటిలాగే పీడనకు గురవుతారని గ్రహించాలి.

రాజులు గుడులు కట్టించారు, గుడులకు మాన్యాలు రాసిచ్చారు 'నా విష్ణుః పృథ్వీ పతిః' అన్నారు నిజమేకానీ ఒక్క దేవుడే అందరికీ దిక్కని చెప్పలేదు. దైవభక్తికి, రాజభక్తికి మధ్య గీతను పూర్తిగా రద్దు చేయలేదు. ఇదంతా ధర్మ విరుద్ధం అంటున్న పీఠాధిపతుల్నీ ధర్మశాస్త్రాచార్యులను ప్రాణప్రతిష్ఠ కార్యక్రమములో పాల్గొనబోమని అంటున్న రాజకీయ ప్రతినిధులను ధర్మ విరోధులని దేశద్రోహులని, నిందిస్తున్నారంటే ఉన్నత జీవన విధానంగా ప్రచారం చేస్తున్న మతంలో భిన్నత్వంలో ఏకత్వం లేనాట్టేనా? ముక్కోటి దేవతలను కొలిచే అనేక దేవతారాధన వున్న సమాజంలో ఆధ్యాత్మిక రాముడిని రాజకీయ రాముడిగా ప్రచారం చేయడం కచ్చితంగా ఆధునిక రాజ్యాంగ విలువలకు విరుద్ధమైన కార్పొరేట్ రాజకీయ ఫాసిజమేనని 'సమూహ' భావిస్తున్నది. మత ప్రాతిపదికన దేశ ప్రజల్ని కూడగట్టి దేవుణ్ణి, గుడినీ ఓట్ల ఆకర్షణకి సాధనంగా ఉపయోగించుకోవటాన్ని ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగ సంస్థలు కూడా అడ్డుకోని దుస్థితిని గర్హిస్తోంది.

బళ్ళు అవసరమైన చోట గుళ్ళు కట్టి, భక్తిని భయంగా మార్చి మూఢవిశ్వాసాలను పెంచి ప్రజలను అంధకారంలోకి నెడుతున్న కుట్రలను ఖండించాలి. ఉమ్మడిగా ఉద్యమించాలి. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీస్తున్న పాలక మత వాదం దేశాన్ని నియంతృత్వం వైపు, కాలం చెల్లిన మధ్య యుగాల తిరోగమన విలువల వైపు నడుపుతున్న ప్రస్తుత సందర్భంలో కవులు, రచయితలు, ప్రజాస్వామిక శక్తులు తమ స్వరం బలంగా వినిపించాలనీ దేశ పౌరులందరినీ బాధ్యతాయుతమైన, ప్రజాస్వామికమైన లౌకిక రాజకీయాల గురించి ఆలోచించాలనీ, అందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఉందనీ 'సమూహ' విజ్ఞప్తి చేస్తున్నది.

▪ 'సమూహ' సెక్యులర్ రైటర్స్ ఫోరమ్

'మహాలక్ష్మి'పై విమర్శలు సరికాదు

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (మహాలక్ష్మి) పథకంపై విమర్శలు చేయడం సరికాదు. ఈ పథకం కేవలం రవాణా వ్యవస్థను పటిష్ఠం చేయడమే కాదు, మహిళలకు ప్రయాణ సౌలభ్యాన్ని కలిగిస్తుంది. ఆర్థిక పురోగతి సాధన లక్ష్యంగా వివిధ పనులకు వెళ్లే వారికి, విద్యార్థులకు, మధ్యతరగతి మహిళలకు ఉపయోగపడుతుంది.

అంతర్జాతీయంగా ఉచిత బస్సు పథకాన్ని చాలా దేశాలలో ప్రారంభించారు. కెనడా వంటి దేశాలలో 2012లో కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి, 2020లో లక్సెంబర్గ్, అమెరికా, అ[illegible]యా లాంటి దేశాలలో ట్రాఫిక్ రద్దీ, పెట్రోల్, డీజిల్ వినియోగం, కాలుష్యాన్ని తగ్గించడం వంటి వివిధ కారణాల కోసం ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రవేశపెట్టారు. భారతదేశంలో మొట్టమొదటిగా ఢిల్లీలో 2019లో ప్రజా రవాణాలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారు. 2021లో తమిళనాడు, పంజాబ్‌లలో, 2023లో కర్ణాటకలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ పథకం పారిశ్రామిక అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుంది. మహిళలకు సాధికారత చేకూరుస్తుంది. చాలామంది మహిళలు బస్సుల్లో ప్రయాణించడం వల్ల రాత్రిపూట వారు అభద్రతకు గురికాకుండా ఉంటారు. అలాగే బస్టాపుల దగ్గర వేచి ఉన్నప్పుడు వేధింపుల భయం ఉండదు. ఉచిత బస్సు పథకం మహిళలు ఒంటరిగా ద్విచక్ర వాహనంపై ప్రయాణించడాన్ని కూడా నివారిస్తుంది, దీంతో వారు దొంగల బారినపడటం తప్పుతుంది.

ఈ పథకం మహిళలకు ప్రయాణ ఖర్చులపై డబ్బు ఆదా చేయడంలో సహాయపడుతుంది. తద్వారా ఆ సొమ్మును ఇతర ఉత్పాదక కార్యకలాపాలకు, గృహ అవసరాలకు ఉపయోగించుకోవచ్చు. అలాగే రుణాలను చెల్లించడానికి, పెట్టుబడి పెట్టడానికి ఉపయోగపడుతుంది. ఉచిత బస్సు ప్రయాణం... మహిళలు అధిక జీతాలతో కూడిన మెరుగైన ఉద్యోగాలను కనుగొనడంలో సహాయపడుతుంది. సన్నకారు వ్యాపారస్తులు సుదూర ప్రాంతాలకు వెళ్లి తమ వస్తువులను అమ్ముకొని లాభాన్ని ఆర్జించడంలో తోడ్పడుతుంది. భద్రత, జాగ్రత్తల కోసం విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాల రవాణా రుసుములను ఎక్కువ మొత్తంలో చెల్లిస్తున్నారు. ఇప్పుడు ఉచిత బస్సు పథకం ద్వారా విద్యార్థినులకయ్యే ఖర్చు ఆదా అవుతుంది. విద్యార్థినులు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో నాణ్యమైన విద్యను అభ్యసించడానికి ఈ పథకం తోడ్పడుతుంది. మంచి విద్యా సంస్థలలో దూరమైనా వెళ్లి చదువుకునే అవకాశం కలుగుతుంది. ఈ పథకం ద్వారా స్త్రీలు స్వేచ్ఛగా ప్రయాణించడానికి వీలు కలుగుతుంది, పైపెచ్చు ప్రయాణ ఖర్చుల కోసం కుటుంబసభ్యులపై ఆధారపడవలసిన అవసరం ఉండదు.

అయితే ఈ పథకం మహిళలకు ఉచితమైనప్పటికీ ప్రయాణ సౌలభ్యాలలో కొన్ని ఇబ్బందులు ఉంటాయి. రద్దీ సమయాల్లో, బస్సు ఓవర్ లోడ్ అయినప్పుడు, బస్సులు తరచుగా బస్టాప్ కంటే కొంచెం దూరంగా ఆపడం వంటి సమస్యలు తలెత్తొచ్చు. రద్దీ కారణంగా విద్యార్థులు, మహిళా ఉద్యోగులు సమయానికి చేరుకోవడానికి ప్రైవేట్ వాహనాలు ఆశ్రయించే అవకాశమూ ఉంది. వారు బస్సుల కోసం వేచివుండే సమయం కూడా పెరగవచ్చు. అందువల్ల మహిళల కోసం ప్రయాణాన్ని సులభతరం చేయడానికి రద్దీ సమయాల్లో నడిచే బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు ఎప్పటికప్పుడు వచ్చే సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి.

– వికాస్
ఉస్మానియా యూనివర్సిటీ

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.6 కనిష్ఠం 18.2

గేదె @ రూ. 2.51 లక్షలు

● నార్సింగ్ పశువుల జాతరలో రికార్డు స్థాయి ధర



నార్సింగ్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ వ్యవసాయ మార్కెట్‌లో పశు సంక్రాంతి జాతర కనులపండువగా సాగింది. ఎన్నడూ లేని విధంగా ఎనిమిది గేదెలు ఒక్కొక్కటి 2.51 లక్షలకు అమ్ముడుపోయాయి. గుజరాత్‌కు చెందిన జఫరాబడి గేదెలను నార్సింగ్‌కు చెందిన రైతు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి సోదరుల నుంచి వట్టినాగులపల్లికి చెందిన ప్రదీప్ 2.51 లక్షలకు కొనుగోలు చేశారు. ఈ గేదె రోజూ 25 లీటర్ల పాలు ఇస్తుంది. వీటితో పాటు హరియాణాకు చెందిన ముర్రెజాతి గేదెలు పది, గుజరాత్‌కు చెందిన గుజ్రాన్‌వాలా జాతి గేదెలు పది రూ. రెండు లక్ష చొప్పున అమ్ముడుపోయాయి. ధూలియా, గుజ్జర్, హరియాణా, షోలాపూర్, ముర్రె గేదెలకు డిమాండ్ నెలకొంది. పుంగనూర్ ఆవును, గుజరాత్‌కు చెందిన ఆవులు రూ. 70 వేల నుంచి లక్షన్నర వరకు అమ్ముడుపోయాయి.



లేజర్ షో





రారండోయ్ విమానాలు చూద్దాం..!

నేటి నుంచి సామాన్యులకు ఎంట్రీ ● సందడిగా రెండో రోజు షో ● డ్రమ్మర్ శివమణి ప్రదర్శనలు

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బేగంపేట విమానాశ్రయంలో జరుగుతున్న వింగ్స్ ఇండియా ప్రదర్శనను నేటి నుంచి సామాన్యులు కూడా వీక్షించవచ్చు. ఒక్కొక్కరికి ఎంట్రీ ఫీజు రూ. 885గా నిర్ణయించారు. కాగా, శుక్రవారం ప్రదర్శన సందడిగా సాగింది. విమానాలతో పాటు వినూత్న ఆవిష్కరణలకు వేదికగా నిలిచింది. మరోపక్క చాలా వరకూ ఎగ్జిబిటర్లు తిరుగు ప్రయాణమయ్యారు. పలు విమానాలు కూడా టేకాఫ్‌కు సిద్ధమయ్యాయి. నేడు నగరానికి చెందిన, దేశీయ సంస్థలు రూపొందించిన డ్రోన్లు, హెలికాప్టర్ల నమూనాలు కనువిందు చేయనున్నాయి. రెండు రోజులుగా ఆకట్టుకుంటున్న సారంగ్, జెఫ్రీస్ బృందాల ఎక్రోబాట్ విన్యాసాలు ఈ రోజు కూడా ప్రధాన ఆకర్షణ కానున్నాయి. గత ఎడిషన్స్‌కు భిన్నంగా ఈసారి ఏవియేషన్ షోలో డ్రమ్మర్ శివమణి ప్రదర్శన ప్రత్యేకంగా నిలవనుంది.



ఓ విహంగం రెక్కల వద్ద సందర్శకురాలు



షోలో సందడి



గగనతలంలో నిప్పులు చిమ్ముతూ విన్యాసాలు



అంబర్‌పేటలో అనుమతి లేని గోదాములో అధికారులు.. స్వాధీనం చేసుకున్న మందులు

లైసెన్స్‌లేని గోదాముపై దాడి

భారీగా మందులు స్వాధీనం

● అంబర్‌పేటలో రూ.20.52 లక్షల విలువ

● కాప్రాలో రూ.5 లక్షల విలువైన ఇన్సులిన్ ఇంజెక్షన్లు

హైదరాబాద్ సిటీ/ఏఎస్‌రావునగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలో అనుమతి లేని గోదాముపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు దాడి చేశారు. ఈ సందర్భంగా రూ.20.52 లక్షల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ సరఫరా చేసి డ్రగ్స్‌కు నిల్వలను కూడా స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపిన వివరాల

మిగతా 8వ పేజీలో..

ప్లాన్ ఫర్ పార్లమెంట్



లోక్‌సభ ఎన్నికల కోసం బీఆర్ఎస్ వ్యూహం

● నేడు సికింద్రాబాద్, హైదరాబాద్ నేతలతో కేటీఆర్ సమావేశం

● అసెంబ్లీ ఎన్నికల్లో అనుకూల ఫలితాలు

● ఆ ఊపు కొనసాగించేందుకు కసరత్తు

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల కోసం పార్టీ శ్రేణులను సిద్ధం చేసేందుకు బీఆర్ఎస్ కసరత్తు ప్రారంభించింది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా వరుస సమావేశాలు నిర్వహిస్తోన్న పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నేడు సికింద్రాబాద్, హైదరాబాద్ లోక్‌సభల పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, ఇతర నేతలతో సమావేశం కానున్నారు. తెలంగాణ భవన్‌లో జరగనున్న సమావేశంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు.. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో పార్టీ నేతల అభిప్రాయాలు తెలుసుకోవడంతో పాటు ఎలా ముందుకు సాగాలన్నది దిశానిర్దేశం చేసే అవకాశముంది.

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలతో పోలిస్తే నగరంలో బీఆర్ఎస్‌కు అనుకూల ఫలితాలు వచ్చాయి. గ్రేటర్‌లోని 24 స్థానాలకుగాను 16 నియోజకవర్గాలను పార్టీ దక్కించుకుంది. వీరిలో మెజారిటీ శాసనసభ్యులు భారీ మెజార్టీతో విజయం సాధించడం గమనార్హం. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో నాంపల్లి మినహా ఆరు స్థానాలను బీఆర్ఎస్ దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఇక్కడి నుంచి పార్టీ ఎంపీ అభ్యర్థి గెలిచే అవకాశముందని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. 2018 ముందస్తు ఎన్నికల్లోనూ ఆ ఆరు అసెంబ్లీలు బీఆర్ఎస్ దక్కించుకున్నా.. నాలుగు నెలల అనంతరం(2019లో) జరిగిన లోక్‌సభ

మిగతా 8వ పేజీలో..

పద్దు పరేషాన్..!

● ముగిసిన స్టాండింగ్ కమిటీ గడువు

● ఇంకా జరగని ఎన్నికలు

● కమిషనర్ వద్ద ఫైల్

● ప్రాథమిక చర్చా జరగని వైనం

● నేరుగా కౌన్సిల్‌లో చర్చిస్తారా..?

అయోమయంలో అధికారులు



జీహెచ్ఎంసీ *2024-25* ఆర్థిక పద్దుపై సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే కౌన్సిల్ ఆమోదం పొందాల్సిన ముసాయిదా బడ్జెట్‌పై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. స్టాండింగ్ కమిటీ గడువు ముగియడం.. కౌన్సిల్ ఏర్పాటు అంశంపై స్పష్టత లేకపోవడంతో మహా పద్దుకు పచ్చజెండా ఊపే పరిస్థితి లేకుండా పోయింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు.. సర్కారు ప్రాథమ్యాలు ఏమిటన్న దానిపై స్పష్టత లేకపోవడంతో ప్రతిపాదనల విషయంలో అధికారులు కొంత గందరగోళానికి గురవుతున్నట్టు తెలిసింది. ప్రాథమికంగా ప్రతిపాదనలు సిద్ధం చేశారని, కౌన్సిల్ ఆమోదం అనంతరం సర్కారుకు పంపుతామని ఆర్థిక విభాగం వర్గాలు చెబుతున్నాయి.

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం నవంబర్‌లో బడ్జెట్ ముసాయిదా ప్రతిపాదనలు స్టాండింగ్ కమిటీ ముందుంచాలి. మరుసటి సమావేశంలో కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. అనంతరం కౌన్సిల్‌లో చర్చించి ఆమోదిస్తారు. జనవరి 10వ తేదీ వరకు ఈ ప్రక్రియ పూర్తి చేసి.. అనంతరం పద్దును ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుంది. ఇందులోనే సర్కారు నుంచి ప్రాజెక్టుల వారీగా ఆశిస్తోన్న ఆర్థిక సాయం, గ్రాంట్ల వంటి వివరాలు పొందుపరుస్తారు. ఇప్పటికే ప్రభుత్వం విభాగాల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలు సేకరిస్తోంది. జీహెచ్ఎంసీకి సంబంధించి బడ్జెట్ ఆమోదం పొందని నేపథ్యంలో ప్రభుత్వానికి వేరుగా ప్రతిపాదనలు పంపుతారా..? అన్న దానిపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. అసెంబ్లీ ఎన్నికలు.. కోడ్ నేపథ్యంలో డిసెంబర్ వరకు బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించే అవకాశం లేకుండా పోయింది. నవంబర్‌లో స్టాండింగ్ కమిటీ గడువు ముగియగా ఇప్పటికీ కొత్త సభ్యుల ఎన్నిక జరగలేదు. దీంతో ముసాయిదా బడ్జెట్ ప్రతిపాదనలపై ప్రాథమిక స్థాయిలోనూ చర్చించలేదు. ఆగస్టులో కౌన్సిల్ సమావేశం నిర్వహించగా.. తదుపరి మీటింగ్ ఎప్పుడన్న దానిపైనా స్పష్టత లేదు. సాధారణ సమావేశంపై ఇంకా ఎలాంటి చర్చలు జరగలేదని, మేయర్, కమిషనర్ సూచనల ప్రకారం నిర్ణయం తీసుకుంటామని కార్యదర్శి కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

నేరుగా కౌన్సిల్‌లో..?

గడువు ముగిసి రెండు నెలలైనా స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక జరగలేదు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఫైల్‌ను కార్యదర్శి కార్యాలయం కమిషనర్‌కు పంపినట్టు సమాచారం. దీనిపై కమిషనర్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సభ్యుల ఎన్నిక జరిగే వరకు ముసాయిదా బడ్జెట్ పరిస్థితి ఏమిటి? నేరుగా కౌన్సిల్‌లో ప్రవేశపెడతారా..? అన్నది తేలాల్సి ఉంది. ఈ విషయంపై స్పష్టత రావాల్సి ఉందని ఓ అధికారి చెప్పారు. పలు కారణాలతో గతంలోనూ నిర్ణీత గడువు కంటే ఆలస్యంగా బడ్జెట్‌ను

మిగతా 8వ పేజీలో..

పోలీస్‌స్టేషన్‌లో పేలిన సిలిండర్లు 8

మహిళా సంరక్షణకు నిఘా రిజిస్టర్ 8

నేడు, రేపు ఓటరు క్యాంపెయిన్ 8

నలుగురు డ్రగ్స్ విక్రేతల అరెస్ట్ 8

బాలికను పొడిచి..

బాలుడి ఆత్మహత్య

● ప్రేమను అంగీకరించడం లేదని..

బర్కత్‌పుర/అంబర్‌పేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమను నిరాకరించిందని బాలికను పొడిచిన బాలుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్ అంబర్‌పేట వడ్డెరబస్తీకు ప్రైవేట్ ఉద్యోగి కుమారుడు (16) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పదో తరగతిలో తనతో కలిసి చదివిన బాలికను ప్రేమించాడు. ఆమె కూడా వేరే కళాశాలలో ఇంటర్ చదువుతోంది. తనను ప్రేమించాలంటూ బాలుడు ఆమె వెంట పడేవాడు. తనకు ఇష్టం లేదని చెప్పినా వెంట పడడం మానలేదు. ఎలాగైనా ఆమెతో మాట్లాడాలని గురువారం ఆమె ఇంటికి వెళ్లాడు. బాలిక మాట్లాడటానికి ఇష్టపడలేదు. కోపోద్రిక్తుడై అక్కడే ఉన్న కూరగాయల కత్తితో ఆమెను పొడిచాడు. అడ్డుకోబోయిన మరో బాలికను కూడా పొడిచి పారిపోయాడు. అనంతరం భయభ్రాంతులకు గురైన బాలుడు తాను చనిపోతున్నట్లు స్నేహితులకు మెసేజ్ పెట్టాడు. గురువారం అర్ధరాత్రి జామై ఉస్మానియా - విద్యానగర్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో అతడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బాలుడి చేతిలో గాయాలపాలైన బాలికలకు ప్రాణాపాయం లేదని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని సీఐ ఎల్లప్ప తెలిపారు.

అక్రమబద్ధీకరణపై ఆగ్రహం

● నానక్‌రాంగూడలో భూమిని పరిశీలించిన ఎమ్మెల్యే

● చర్యలు తీసుకోవాలని డిమాండ్

● 'ఆంధ్రజ్యోతి' కథనాలను ప్రదర్శించిన పలువురు

● క్రిమినల్ కేసులు పెట్టాలి : బీజేపీ కార్పొరేటర్



స్థలం వద్ద పత్రాలను చూపిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ భూములను 59 కింద అక్రమంగా క్రమబద్ధీకరణ చేయడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన వరుస కథనాలు చర్చనీయాంశంగా మారాయి. అక్రమార్కులు, అధికార వర్గాల్లో గుబులు రేపాయి. రాజకీయ వర్గాల్లోనూ హాట్ టాపిక్‌గా మారాయి.

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గోపనపల్లిలో రూ.400 కోట్ల విలువైన మూడెకరాల ప్రభుత్వ భూమిని మూడు విడతల్లో 21 మంది అక్రమంగా క్రమబద్ధీకరించుకున్నారు. దీనిపై 'ఫలితాలకు ముందు రోజే భూమేత' శీర్షికతో గత నెల 11న 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. ఆ తర్వాత నానక్‌రాంగూడలో రూ.750 కోట్ల విలువైన ఐదెకరాల ప్రభుత్వ భూమిని కేవలం 15 మంది అక్రమబద్ధీకరణ చేసుకున్న తీరుపై 'భూంఫట్ స్వాహా' అనే శీర్షికతో మరో కథనాన్ని ఆంధ్రజ్యోతి ప్రచురించింది. ఈ కథనాలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఇప్పటికే శేరిలింగంపల్లి తహశీల్దార్‌పై వేటు వేసి, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ నేతృత్వంలో 59 జీఓ కింద జరిగిన క్రమబద్ధీకరణలపై విచారణ జరుపుతోంది. 59 జీఓ ను దుర్వినియోగం చేసి వేల కోట్ల భూములను కొట్టేయ్యడం, ఆ వెంటనే ప్రముఖ నిర్మాణ సంస్థలకు విక్రయించడం వెనుక ఓ మాజీ మంత్రి, ఓ ఎమ్మెల్యే ప్రమేయముందని పెద్దఎత్తున ఆరోపణలు

మిగతా 8వ పేజీలో..



సికింద్రాబాద్ స్టేషన్‌లో కొనసాగుతున్న పనులు

వేగంగా 'సికింద్రాబాద్'

పునరభివృద్ధి పనులు


హైదరాబాద్/సికింద్రాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక హంగులతో, ప్రపంచ శ్రేణి సౌకర్యాలతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రూపుదిద్దుకుంటోంది. 36 నెలల నిర్ణీత వ్యవధిలో సుమారు రూ.720 కోట్లతో చేపట్టిన సికింద్రాబాద్ స్టేషన్ పునరభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఉత్తరాన ప్రస్తుత బుకింగ్ కార్యాలయం స్థానంలో ప్రయాణికుల సేవలకు అంతరాయం కలగకుండా తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేసి నిర్మాణ పనులు చేపట్టారు. అలాగే కొత్త ఆర్పీఎఫ్ భవనం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. దక్షిణం వైపు మిగిలిన పనులను సకాలంలో పూర్తి చేయడానికి, వాహనాల రాకపోకలకు తాత్కాలిక రహదారి ఏర్పాటుచేశారు. ఉత్తరం వైపున మల్టీ-లెవల్ కార్ పార్కింగ్(ఎం.ఎల్.సీ.పి) నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పునాది , కాలమ్స్‌తో పాటు గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్

మిగతా 8వ పేజీలో..









భవనం పైనుంచి పడి యువకుడి మృతి

నార్సింగ్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అల్కాపూర్ కాలనీలో ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మణికొండకు చెందిన కే.లోహిత్ రెడ్డి (23) ఇటీవలే బీటెక్ పూర్తి చేశాడు. జర్మనీలో ఉన్నత చదువు కోసం వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. శుక్రవారం మధ్యాహ్నం అల్కాపూర్‌లో నిరుపయోగంగా ఉన్న ఓ భవనం పైనుంచి కిందపడ్డాడు. స్థానికులు గమనించి రాయదుర్గంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే లోహిత్‌రెడ్డి మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. నార్సింగ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


లోహిత్‌రెడ్డి (ఫైల్)

మదర్సాలో విద్యార్థుల ఘర్షణ.. ఒకరి మృతి




నార్సింగ్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్ స్టేటస్ స్నేహితుల మధ్య గొడవకు కారణమైంది. ఈ ఘర్షణలో ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. అల్కాపూర్‌లోని మదర్సాలో గురువారం రాత్రి జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మదర్సాలో బీహార్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఉంటున్నారు. మహ్మద్ సిరాజ్‌తో పటు మరికొందరు ఫేస్‌బుక్‌లో హిందీ పాటల వీడియో క్లిప్ స్టేటస్‌గా పెట్టారు. మహ్మద్ రహీం అనే విద్యార్థి అది చూసి, వీడియో కొందరిని అగౌరవపరిచేదిగా ఉందని సిరాజ్‌తో గొడవకు దిగాడు. ఈ క్రమంలో ఇద్దరు ఘర్షణ పడ్డారు. సిరాజ్ దాడి చేయడంతో మహ్మద్ రహీమ్ (17) తీవ్రంగా గాయపడ్డాడు. అతడ్ని గోల్కొండ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. నార్సింగ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షాపింగ్‌కు వెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్ల

రాజేంద్రనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కుమార్తె 21 రోజుల ఫంక్షన్ కోసం దుస్తులు కొనేందుకు కుటుంబసభ్యులు షాపింగ్‌కు వెళ్లొచ్చే సరికి దొంగలు ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ దుర్గాదేవీ కాలనీలో గురువారం రాత్రి జరిగింది. కాలనీలోని ఎస్ఎస్ ఎన్‌క్లేవ్‌లో సివిల్ ఇంజనీర్ మహ్మద్ నసీర్ అహ్మద్ కుటుంబం నివాసముంటోంది. నసీర్ దంపతులకు ఇటీవల పాప పుట్టింది. 21 రోజుల ఫంక్షన్ కోసమని గురువారం కుటుంబసభ్యులు షాపింగ్‌కు అత్తాపూర్ వెళ్లారు. రాత్రి తిరిగి వచ్చేసరికి ఇంట్లో బీరువాలు తెరిచి ఉన్నాయి. అందులోని సామగ్రి కింద పడేసి ఉంది. పిల్లల పడక గది బీరువాలోని 32 తులాల బంగారం, రెండు తులాల వెండి, రూ. 1.4 లక్షలు దోచుకెళ్లారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా కేసులో నిందితుడికి జైలు

కూకట్‌పల్లి/జీడిమెట్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి కబ్జా, అమ్మకం, అధికారులపై దురుసు ప్రవర్త కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ కూకట్‌పల్లిలోని 15వ ఏఎంఎం రంగారెడ్డి జిల్లా కోర్టు శుక్రవారం తీర్పు విడుదల చేసింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌కు చెందిన ముందావర్ రమేష్ నాయక్(46) గాజులరామారంలో సర్వేనెంబర్ 329/1లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేయడంతోపాటు, వాటిని నోటరీతో అమ్ముతూ మోసం చేస్తున్నాడు. రెవెన్యూ అధికారులు వెళ్లి రెండు గదులు కూల్చగా, రమేష్‌నాయక్ వారితో దురుసుగా ప్రవర్తించాడు. ఈమేరకు తహసీల్దార్ 2019 మార్చి 11న జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి రుబీనా ఫాతిమా నిందితుడికి ఏడాది జైలు, రూ. 3 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.











అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం, కేఎల్‌యూ డీమ్డ్ విశ్వవిద్యాలయం, జేఆర్‌ఎం ఎక్స్‌పోర్ట్స్ సంస్థల ప్రతినిధులు

రెండు సంస్థలతో వ్యవసాయ వర్సిటీ ఒప్పందం

రాజేంద్రనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శుక్రవారం కోనేరు లక్ష్మయ్య డీమ్డ్ యూనివర్శిటీ, గుజరాత్‌కు చెందిన జేఆర్‌ఎం ఎక్స్‌పోర్ట్స్‌తో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వెంకటరమణ, కేఎల్‌యూ డీమ్డ్ యూనివర్శిటీ డాక్టర్ రామకృష్ణ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. పీజీ, పీహెచ్‌డీ కోర్సుల బోధన, పరిశోధన కోసం కలిసి పనిచేయనున్నాయి. విద్యార్థులు, ఫ్యాకల్టీ పరస్పర మార్పిడికి ఒప్పందం వీలు కల్పిస్తుంది. రెండు విశ్వవిద్యాలయాలు ఆరు అంశాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నాయి. గుజరాత్‌కు చెందిన జేఆర్‌ఎం ఎక్స్‌పోర్ట్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందం తెలంగాణ సోనా వరి అమ్మకానికి వీలు కల్పిస్తుంది. అవగాహన ఒప్పంద కార్యక్రమాల్లో విశ్వవిద్యాలయం అధికారులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి, డాక్టర్ సీమ, డాక్టర్ సుధారాణి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అనిత, డాక్టర్ జమునారాణి, గ్రంథ పాలకులు డాక్టర్ ఎస్‌పీ.రవికుమార్, ప్రజా సంబంధాల అధికారులు డాక్టర్ వన్నేజ్ సుధాకర్, మార్క్స్ బాబు, కేఎల్‌యూ ప్రతినిధులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ మధుకర్, జేఆర్‌ఎం ఎక్స్‌పోర్ట్స్ ప్రతినిధి దీపక్ హిలాని పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో మహా సత్సంగ్

చాంద్రాయణగుట్ట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హిందూధర్మం పట్ల అవగాహన కలిగి ఉండాలని విశ్వహిందూ పరిషత్ మాతృ శక్తి ఆధ్వర్యంలో 2021 ఆగస్టులో ప్రారంభమైన మహా సత్సంగ్ 150 వారాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం లాల్‌దర్వాజలోని శివాలయంలో మహా సత్సంగ్ నిర్వహించారు. సుమారు 50 మంది మహిళలు లలిత, విష్ణు సహస్రనామాలు, హనుమాన్ చాలీసా పఠనం చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ గౌలిపురా నగర్ సభ్యులు మనోజ్‌కుమార్, వసుమతి, శ్వేత, సరిత, కవిత, ప్రశాంతి, ఉమ, గోపీనాథ్ పాల్గొన్నారు.

ఛత్రినాక సెక్షన్ పరిధిలో విద్యుత్ కోత

చాంద్రాయణగుట్ట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రినాక సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ పి.దస్తగిరి తెలిపారు. బాలాగంజ్ ప్లేగ్రౌండ్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు, పటేల్‌నగర్‌లో 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రాఘవేంద్రస్వామినగర్‌లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు, గౌలిపురా శ్రీరాంనగర్ కాలనీలో మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

నార్సింగ్ పరిధిలో..

నార్సింగ్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నేడు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. 33/11 కేవీ నార్సింగ్ ఎస్‌ఎస్-1 సబ్‌స్టేషన్, 11 కేవీ బృందావన్ కాలనీ ఫీడర్ పరిధిలోని బృందావన్ కాలనీ, రాజపుష్ప రిగాలీలా, ఈఐపీఎల్, అపీలా, కోకాపేట్, 33/11 కేవీ పుప్పాల్‌గూడ సబ్‌స్టేషన్, 11 కేవీ సెక్రటేరియేట్ ఫీడర్ పరిధిలోని సెక్రటేరియేట్ కాలనీ, ఆదిత్య ఫోర్ట్ విల్లా, చింతచెట్టు ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

పహాడిషరీఫ్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం షాహీన్‌నగర్‌లో బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్‌లు ముని, విష్ణువర్ధన్‌రెడ్డి, పహాడిషరీఫ్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తోపాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో..

అనుమానాస్పదంగా ఇద్దరు మృతి

- భవనంపై నుంచి పడి బాలిక.. బాత్‌రూమ్‌లో యువకుడు
- 13న మృతి.. ఆలస్యంగా వెలుగులోకి..

మంగళ్‌హాట్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో వేర్వేరు చోట్ల ఇద్దరు అనుమానాస్పదంగా మృతిచెందారు. ఈ సంఘటనలు మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్‌లోని ఆరాంఘర్ ప్రాంతంలో నివాసం ఉండే నందితా సింగ్(13) సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఈ నెల 11న ఆమె అనారోగ్యానికి గురైంది. ఉదయం 8 గంటలకు నిద్రలేచి తన ఇంటి రెండో అంతస్తు బాల్కని వద్దకు వచ్చింది. అకస్మాత్తుగా జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు బంజారాహిల్స్ సెంచరి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 13న బాలిక మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఉస్మానియా మార్చురీలో శవపరీక్షలు నిర్వహించారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మంగళ్‌హాట్ పోలీసులు తెలిపారు.

బాత్‌రూమ్‌లో..

రాజస్థాన్ కన్‌కాహి గ్రామానికి చెందిన కేశారామ్(17) ఆగాపురాలో నివాసం ఉండే అతడి బాబాయ్ అమ్రారామ్ వద్దకు నెల రోజుల క్రితం వచ్చాడు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న కేశారామ్ ఈ నెల 13న ఉదయం స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. బాత్‌రూమ్ నుంచి పెద్ద శబ్దం రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా కేశారామ్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అతడిని నాంపల్లి కేర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పశ్చిమబెంగాల్ యువతులతో వ్యభిచారం

మంగళ్‌హాట్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్ నుంచి యువతులను నగరానికి రప్పించి వ్యభిచారం చేయిస్తున్న ఇద్దరిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సుల్తాన్‌బజార్ సమీపంలోని ఓ హోటల్‌లో వ్యభిచారం జరుగుతుందని సమాచారం అందుకున్న ఆబిడ్స్ పోలీసులు గురువారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. 16 మంది యువతులు, నలుగురు విటులు, ఇద్దరు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. యువతులను స్టేట్‌హోంకు పంపించారు. నలుగురు విటులను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు నిర్వాహకులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

మదీన, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సుమారు 50 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం హుసేనిఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం లభ్యమైంది. ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖిల్వత్ గ్రౌండ్ వద్ద ఓ వ్యక్తి మరణించి ఉన్నాడని సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు వివరాలు సేకరించారు. గుర్తు తెలియని భిక్షగాడిగా గుర్తించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 61284, 87126 60334లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసం.. వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. అత్యాచారానికి పాల్పడి ఆ తర్వాత మోసం చేసిన నిందితుడిని బహదూర్‌పురా పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సౌత్‌జోన్ డీసీపీ సాయిచైతన్య తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం చెనిగేపల్లికి చెందిన మహ్మద్ గౌసుద్దీన్ అలియాస్ గౌస్ 2016లో కిషన్‌బాగ్‌లో ఉంటున్న బంధువుల ఇంట్లో దిగి అక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో బంధువుల ద్వారా అతడికి మహిళ పరిచయం అయింది. ఆ తర్వాత ఆమెతో చనువు పెంచుకున్న నిందితుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ముఖం చాటేశాడు. దాంతో మోసపోయిన బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించింది. నిందితుడిన్ని బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ శుక్రవారం అరెస్ట్ చేసినట్లు డీసీపీ తెలిపారు.

దార్శనికుడు స్వామి వివేకానంద



స్వామి వివేకానంద సేవా పురస్కార్-2024, జాతీయ యువజన అవార్డు అందుకున్న ప్రముఖులు

అఫ్జల్‌గంజ్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలకు భారతజాతి ఔన్నత్యాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పిన అంతర్జాతీయ దార్శనికుడు స్వామి వివేకానంద అని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. నవ భారతి నిర్మాణ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. యువతపైనే దేశ భవిత ఆధారపడి ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ దయానంద్ మాట్లాడుతూ యువత స్వామి వివేకానంద జీవితాన్ని అధ్యయనం చేయాలన్నారు. సినీనటుడు, హీరో, మాజీ మంత్రి డాక్టర్ బాబుమోహన్ మాట్లాడుతూ స్వామి వివేకానంద భారతదేశ గొప్పతనాన్ని విదేశీయులకు చాటి చెప్పిన మహనీయుడన్నారు. డాక్టర్ కటం భాస్కర్ గుప్తా, హైదరాబాద్ ఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ, ఫిట్‌నెస్ గురువు అనుప్రసాద్, తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, నవ భారతి నిర్మాణ్ ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తుల హేమంత్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద సేవా పురస్కార్-2024ను డాక్టర్ బి.రాఘవేంద్ర, డాక్టర్ సి.వెంకటేశ్వర్లు, మహ్మద్ అబ్దుల్లా ఫైజల్, ఉజ్వల చందర్, పోసాని సుధాకర్, సయ్యద్ ఇమ్రాన్ ఉద్దీన్, డాక్టర్ బి.శోభారాణి, పూజగుప్తా, ఎస్సార్ శాస్త్రి, ఎ.లత, కాకి సదానంద స్వామిలకు ప్రదానం చేశారు. జాతీయ యువజన అవార్డు అందుకున్న వారిలో డాక్టర్ ఎ.సంధ్య, డాక్టర్ ఊహా మల్పూరు, వాణి చందన, మణి కిరణ్ రామిశెట్టి, కుమారి చిమ్మల సౌజన్య, కుమారి షేక్ జోమియా, జక్కుల విజ్ఞతలకు జాతీయ యువజన అవార్డు ప్రదానం చేసి సన్మానించారు.

అధికారులపై ఎమ్మెల్యే ముబీన్ ఆగ్రహం

బహదూర్‌పుర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కొందరు అధికారులు పట్టించుకోవడం లేదని బహదూర్‌పుర శాసనసభ్యుడు మహ్మద్ ముబీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలక్‌నుమా డివిజన్‌లో శుక్రవారం ఆయన పాదయాత్ర చేశారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫాతిమానగర్, గఫారియా మజీద్, హ్యాండీకాప్ కాలనీ, ఫాతిమా జోహార మజీద్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఫాతీమనగర్, గఫారీయ మజీద్, బెగ్గర్ కాలనీలో కలుషిత నీరు సరఫరా అవుతున్నా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అక్కడే ఉన్న జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కచ్చా మోరీలకు సంబంధించిన మ్యాన్‌హోల్ మూతలు పగిలి గుంతలుగా మారినా ఇంజనీరింగ్ విభాగం పట్టించుకోవడం లేదని, రోడ్లపై గుంతలు ఉన్నాయని స్థానికులు ఎమ్మెల్యేకు చెప్పారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముబీన్

పేదల విద్యకు సాయం : ఎమ్మెల్యే కసిరెడ్డి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, నాగిరెడ్డి, తదితరులు

అఫ్జల్‌గంజ్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): చదువుకోవాలనే తపన ఉండి నిస్సహాయక స్థితిలో ఉన్న విద్యార్థులకు తన తల్లిదండ్రుల పేరు మీద లక్ష్మీ జనార్దన్‌రెడ్డి ఎడ్యుకేషన్ సేవా సమితి ద్వారా సాయం అందిస్తానని ఓ ఉపాధ్యాయుడు ఎలుగుమెట్ల నాగిరెడ్డి తెలియజేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా లక్ష్మీ జనార్దన్ రెడ్డి ఎడ్యుకేషన్ సేవా సమితి పోస్టర్‌ను శుక్రవారం తన సహచరులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ నిరుపేద విద్యార్థులను చదివించేందుకు ముందుకొచ్చిన లక్ష్మీ జనార్దన్‌రెడ్డి ఎడ్యుకేషన్ సేవా సమితి ట్రస్టును తన చేతుల మీదుగా ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. దీనికి ముందుకొచ్చిన ఉపాధ్యాయుడు ఎలుగుమెట్ల నాగిరెడ్డిని అభినందించారు. ప్రతి ఒక్కరూ నాగిరెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని పలు సేవా సంస్థలు ముందుకొచ్చి నిరుపేదల చదువుకు తోడ్పాటు అందించాలని సూచించారు.

వ్యవసాయ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దు

- రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలను ముట్టడించిన విద్యార్థులు



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

రాజేంద్రనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం భూములను హైకోర్టుకు ఇవ్వొద్దని, జీవో నెంబర్ 55ను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు శుక్రవారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ కార్యాలయాన్ని ముట్టడించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వ్యవసాయ కళాశాలకు చెందిన రెండు గేట్లను మూసివేశారు. లోపల ఉన్న వారు బయటకు రాకుండా, బయట నుంచి ఎవరూ లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. కళాశాలలోని అన్ని డిపార్ట్‌మెంట్‌లలోకి వెళ్లి విద్యార్థులను బయటకు తీసుకువచ్చారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం సాగుతున్న నిరసన కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు తమతో కలిసి రావాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులు వచ్చి తమకు మద్దతు తెలిపే వరకూ వ్యవసాయ కళాశాల గేట్ల తాళాలు తెరిచేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో సాయంత్రం నాలుగు గంటలకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వెంకటరమణ, డీఎస్‌ఏ డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డీన్ డాక్టర్ సీమతో పాటు ఉన్నతాధికారులు విద్యార్థులకు నచ్చచెప్పి వారితో సమావేశమయ్యారు. విద్యార్థులు చేస్తున్న నిరసన శాంతియుతంగా చేసుకోవాలన్నారు. కళాశాల గేట్లకు తాళాలు వేయడం, విద్యార్థులను బలవంతంగా తరగతి గదుల నుంచి బయటకు తీసుకురావడం చేయొద్దన్నారు. అధికారులుగా తాము నిరసనకు దూరం అన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ స్కాలర్‌లు సురేందర్, రాజ్‌కుమార్, బాలకోటి, శ్రీజ, అరవింద్, దీక్షిత్ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాలకు చెందిన జీవ, వృక్ష జాతుల సంపద ఉన్న భూములను హైకోర్టు భవనాలకు ఇవ్వొద్దన్నారు. హైకోర్టును ఇతర భూములలో నిర్మించుకోవాలని సూచించారు.

పొడి చెత్త రీసైక్లింగ్ కోసం కృషి జరగాలి



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న అతిథులు

రవీంద్రభారతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ లక్ష్య సాకార దిశగా పొడి చెత్త రీసైక్లింగ్ కోసం మరింత కృషి జరగాలని పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ అన్నారు. వ్యర్థాల నిర్వహణ, పునర్వినియోగ పద్ధతులను ప్రోత్సహించేందుకు ఐటీసీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో వెల్‌బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. దీనికి ఆయనతోపాటు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సీనియర్ సోషల్ సైంటిస్ట్ డా. ప్రసన్నకుమార్ తదితరులు ప్రతిభ కనబరచిన విద్యార్థులకు, పాఠశాలలకు అవార్డులు ప్రదానం చేశారు. ఐటీసీ లిమిటెడ్ పేపర్ బోర్డ్స్ విభాగం చీఫ్ ఎగ్జిక్యూటివ్ వాదిరాజ్ కులకర్ణి మాట్లాడుతూ నగరంలోని 418 పాఠశాలల్లో ఐటీసీ ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ ఛాంపియన్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.

నయనానందంగా లలిత శ్రీయ కూచిపూడి నాట్యం



నాట్యం చేస్తున్న నర్తకి లలిత శ్రీయ

రవీంద్రభారతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): లయబద్ధమైన నాట్యాంశాలకు చక్కటి అభినయంతో నర్తించిన యువ నర్తకి లలిత శ్రీయ కూచిపూడి నాట్యం నయనానందంగా సాగింది. శుక్రవారం రవీంద్రభారతిలో శ్రీసిద్ధకృష్ణ కూచిపూడి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్యగురువు సుజాతమూర్తి శిష్యురాలైన లలిత శ్రీయ కూచిపూడి నాట్యంలో రంగప్రవేశం చేసింది. ఈ సందర్భంగా గజాననయుతం, శంకర శ్రీగిరి, కంజదాలయతాక్షి, కృష్ణం కలయశక్తి, భామకలాపం, లేఖ, తిల్లాన తదితర అంశాల్లో నర్తించి భళా అనిపించింది. ఈ నాట్యానికి నలువాంగం పీఆర్‌సీ శర్మ, సుజాతమూర్తిలు చేయగా గానం స్వేతాప్రసాద్, మృదంగం చంద్రకాంత్, వయోలిన్‌పై సాయికుమార్ వాయిద్య సహకారాన్ని అందజేశారు. శేషసయిదానం, సుధామాధురి దంపతుల కుమార్తె లలిత చక్కటి నాట్యంతో ప్రేక్షకుల్ని అలరించింది. కార్యక్రమంలో సబిత మాడభూషి, పద్మజారెడ్డి, ఓలేటి పార్వతీశం, రమణమూర్తి, అనురాధ, కృష్ణభారతి తదితరులు నర్తకి లలిత శ్రీయను ఘనంగా సత్కరించి అభినందించారు. శాస్త్రీయ కళలు మన సంస్కృతికి నిదర్శనమని అన్నారు. అనంతరం గురువు సుజాత మూర్తికి గురువందనం చేశారు.

కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



ఐఐఎంఆర్‌లో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కోసం వచ్చిన బస్సు

రాజేంద్రనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): 'రోటరీ రాజేంద్రనగర్ కృషి క్లబ్' ఆధ్వర్యంలో శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్(ఐఐఎంఆర్)లో మహిళా శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, సిబ్బందికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కృషి క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీనివాస్‌బాబు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.జగదీశ్వర్ ఆధ్వర్యంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. గైనకాలజీ, డెంటల్, కేన్సర్ స్క్రీనింగ్‌కు సంబంధించిన డాక్టర్లు మహిళలను పరీక్షించారు. రాజేంద్రనగర్‌లోని జాతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ, జాతీయ వరి పరిశోధనా సంస్థ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన 135 మంది మహిళా శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, కార్మికులు పరీక్షలు చేయించుకున్నారు. రోటరీ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ ఎం.రాంప్రసాద్ మాట్లాడుతూ కృషి క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోకాపేట్‌కు చెందిన రోటరీ ఏ కామ్, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రులకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/ h84AW8Hలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



వైద్యులను అభినందిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి

గర్భిణికి అరుదైన వ్యాధి

- నిలోఫర్‌లో చికిత్స.. తల్లీ,బిడ్డా క్షేమం

మంగళ్‌హాట్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అత్యంత అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ గర్భిణికి నిలోఫర్ ఆస్పత్రి వైద్యులు సాధారణ ప్రసవం చేసి పండంటి బిడ్డకు ప్రాణం పోశారు. సంగారెడ్డి జిల్లా మగ్దంపల్లి గ్రామానికి చెందిన సేవంత బాయ్(31) వీడబ్ల్యూడీ-3 రకం (అధిక రక్తస్రావం)తో బాధపడుతున్నట్టు గతంలోనే నిమ్స్ వైద్యులు గుర్తించారు. ఐదు నెలల గర్భిణిగా ఉన్న సమయంలో సేవంత బాయ్ నిలోఫర్ వైద్యులను సంప్రదించి తనకున్న సమస్యను వివరించింది. గైనకాలజీ వైద్యులు సదరు మహిళకు అప్పటి నుంచి పరీక్షలు నిర్వహిస్తూ వైద్య సేవలందిస్తున్నారు. ఈ నెల 13న ప్రసవం నిమిత్తం వచ్చిన సదరు మహిళకు మరోమారు పరీక్షలు నిర్వహించి సాధారణ ప్రసవం చేశారు. ఆమె పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. కాన్పు సమయంలో రక్తస్రావం కారణంగా ఆమెకు 27 బాటిళ్ల వీడబ్ల్యూ ఫ్యాటర్లను అందించారు. ప్రస్తుతం తల్లీ,బిడ్డా క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న మహిళకు సాధారణ ప్రసవం చేసిన డాక్టర్ ఇంద్రమణి, డాక్టర్ సునీత, డాక్టర్ అనిత, డాక్టర్ సాధన, డాక్టర్ దామోదర్, డాక్టర్ భవతి, వైద్య సిబ్బందిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి అభినందించారు.

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

రాజేంద్రనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనత యువమోర్చా(బీజేవైఎం) రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మహేందర్‌ను యువ మోర్చా రంగారెడ్డి జిల్లా నాయకుడు కె.కిరణ్‌చారి శుక్రవారం సన్మానించారు. మహేందర్ నాయకత్వంలో బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామన్నారు. సన్మానించిన వారిలో మణికంఠ, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అనీమియా ముక్త్ భారత్ కార్యాచరణపై సంక్షేమ, విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరీక్షల అనంతరం హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి చికిత్స అందించాలన్నారు. ఎనీమియా ముక్త్ భారత్ మంచి కార్యక్రమమని, దీనిని విజయవంతం చేయడానికి అధికారులు కృషి చేయాలని కోరారు. అధికారులు బృందాలుగా ఏర్పడి విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటి, డీఐఓ శ్రీకళ, వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఆశన్న, ఇంటర్ విద్యాధికారి ఒడ్డెన్న, ఎస్పీహెచ్‌వో, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మణికొండ పరిధిలోని ల్యాంకో హిల్స్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుపై పెద్ద కొండచిలువ రోడ్డుదాటుతూ కనిపించింది. దాంతో వాహనదారులు భయభ్రాంతులకు గురై వాహనాలను జాగ్రత్తగా పక్కకు తిప్పుకొని వెళ్లారు. కాగా.. ఒక కారుడ్రైవర్ మాత్రం రోడ్డుదాటుతున్న కొండచిలువ మీద నుంచి కారును పోనిచ్చాడు. అయినా, అది నెమ్మదిగా రోడ్డుదాటింది.
- నార్సింగి, ఆంధ్రజ్యోతి

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

మదీన, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు నేడు, రేపు నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో పేరు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. మలక్‌పేట, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, చార్మినార్, బహదూర్‌పురా, రాజేంద్రనగర్ నియోజకవర్గాల ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు జయంత్, నాగమణి, సురేందర్, సరిత, శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్‌లు ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు నమోదు, పరిశీలన కార్యక్రమం కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. ఇప్పటికే ఓటర్లుగా ఉన్న వారు మరోసారి ఓటరు జాబితాలో తమ పేరు, వివరాలు చూసుకోవాలని సూచించారు. తప్పులు ఉంటే స్థానిక పోలింగ్ కేంద్రా ల్లో బీఎల్‌ఓలను సంప్రదించి సవరించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా టైపు రైటింగ్ పరీక్షలు

తార్నాక, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంకేతిక విద్యాశాఖ, ఎస్.బి.టెట్ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21న రాష్ట్ర వ్యాప్తంగా టైపు రైటింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర టైపు రైటింగ్ షార్ట్ హ్యాండ్ కంప్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాలిగ తెలిపారు. శుక్రవారం తార్నాకలోని టైపు రైటింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

21 నుంచి కోటి ప్రత్యాంగిర మహాయాగం

కవాడిగూడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జగద్గురు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి 88వ అవతరణోత్సవం సందర్భంగా శ్రీ సిద్ధేశ్వర పీఠం కుర్తాళం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 21 నుంచి 28 వరకు దేశంలోనే తొలిసారిగా 108 హోమకుండాలతో 25 వేల కిలోల ఎండు మిరపకాయలతో కోటి ప్రత్యాంగిర మహాయాగాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, పీఠం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మోచెర్ల శశిభూషణ్, ధర్మాధికారి వల్లూరు శివకోటేశ్వర రాజు. కో ఆర్డినేటర్ మునిపల్లె శ్రీనివాస్, పీఠం పురోహితులు మాచవోలు రమేష్‌శర్మ తెలిపారు. శుక్రవారం యాగం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ, ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం ఆరున్నర గంటల వరకు యాగం, సాయంత్రం 6.30 గంటలకు భక్తి సంగీతం, శ్రీ లలిత, శ్రీ విష్ణు, సౌందర్య లహరి, శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం ఉంటాయని తెలిపారు. రాత్రి 7.30 గంటలకు వివిధ దేవతా మూర్తుల కల్యాణ మహోత్సవం, శ్రీ సిద్ధేశ్వరానంద భారతి అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు. కార్యక్రమాలకు హాజరైన మొదటి పది వేల మంది భక్తులకు వివిధ దేవతల రూపు. కాసు, రుద్రాక్షలను ప్రసాదంగా అందజేస్తామని వారు వెల్లడించారు. కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులను ఆహ్వానిస్తామని వారు తెలిపారు. భక్తులు విజయవంతం చేయాలని వారు కోరారు.

హార్స్ పోటీల ట్రోఫీ గెలుచుకున్న రెహానా



రెహానా, ముజాఫర్, గణేశ్

రాజేంద్రనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే సందర్భంగా న్యూ ఢిల్లీలో జరుగుతున్న హార్స్ రైడింగ్ పోటీల్లో తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ నుంచి పాల్గొన్న రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని షేక్ రెహానా షో ట్రోఫీని గెలుచుకుంది. షో జంపింగ్‌లో ఆమె స్వర్ణం, రజత పతకాలను సాధించింది. షో జంపింగ్‌లో ఇదే కళాశాలకు చెందిన మహ్మద్ ముజాఫర్, కొర్ర గణేశ్‌లు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ ఎర్ర అంజయ్య, అధ్యాపకులు అభినందించారు. కళాశాలకు చెందిన షేక్ రెహానా, మహ్మద్ ముజాఫర్, కొర్ర గణేశ్, సురయా బేగంలు రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు.

భగవన్నామ స్మరణతోనే సకల శుభాలు

● భద్రాచల దేవస్థాన అధర్వ వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్య



జయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్య

అల్వాల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కలియుగంలో మానవాళికి శుభాలను కలిగించేది, దోషాలను, పాపాలను పోగొట్టేది భగవన్నామ స్మరణం మాత్రమే అని భద్రాచల దేవస్థాన పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు అన్నారు. శ్రీవైష్ణవ సంప్రదాయ ప్రచారకులైన స్వామినాథ, శ్రీరంగశరకోస, వెంకటనరసింహ మహాపండితుల తిరునక్షత్రోత్సవాల(జయంతి ఉత్సవాలు) సందర్భంగా శుక్రవారం ఓల్డ్ అల్వాల్‌లో విశిష్ఠ ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మురళీకృష్ణమాచార్యులు మాట్లాడుతూ కలియుగంలో సులభంగా భగవంతుని అనుగ్రహాన్ని తెచ్చిపెట్టేది, శుభాలను కలిగించేదని, భగవన్నామ సంకీర్తనమే అనే విషయాన్ని 'కలౌనామ సంకీర్తనమ్' స్పష్టం చేస్తుందని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు, ప్రముఖ దినపత్రికల కాలమిస్ట్ సముద్రాల శఠగోపాలచార్యులు మాట్లాడుతూ ముగ్గురు ఆచార్యులు విశిష్ఠాద్వైతా సిద్ధాంతానికి చేసిన కృషిని వివరించారు. నేటి సమాజాభివృద్ధికి ఆధ్యాత్మిక చైతన్యం కూడా తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రామాలయ అర్చకులు డింగరి లక్ష్మణాచార్య, సంస్కృత భారత సంస్థ ఉపాధ్యక్షుడు మర్రి లక్ష్మీనాథచార్యులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.


సెంటర్ ప్రారంభోత్సవంలో వైద్యులు, నిర్వాహకులు

ఓక్యులర్ ఫార్మకాలజీ రీసెర్చ్ సెంటర్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో దివంగత డాక్టర్ చిగురుపాటి నాగేశ్వరరావు ఓక్యులర్ ఫార్మకాలజీ రీసెర్చ్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సెంటర్‌ను గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ సహకారంతో ఏర్పాటు చేసినట్లు ఎల్వీపీఈఐ ఓక్యులర్ ఫార్మకాలజీ రీసెర్చ్ హెడ్ డాక్టర్ సంహితా రాయ్ తెలిపారు. దేశంలోని నేత్ర ఔషధ పరిశోధనను సమర్థవంతంగా తీర్చిదిద్దడానికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. వ్యాధి కారకాలతో ఔషధ పరస్పర చర్యలను అర్థం చేసుకోవడం (వ్యాధులు కలిగించే సూక్ష్మజీవులు), వ్యక్తిగత కంటి సంరక్షణ చికిత్సలో మార్గదర్శకత్వం చూపుతుందని తెలిపారు. ఓక్యులర్ ఫార్మాకోలాజికల్ రీసెర్చ్‌లో పురోగతిని వేగవంతం చేయడంలో ఈ కేంద్రం సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమాదేవి చిగురుపాటి, ఎల్వీపీఈఐ ఎగ్జిక్యూటివ్ చైర్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని ఫెర్టిలిటీ సెంటర్ సీజ్

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేసిన ఓ ఫెర్టిలిటి సెంటర్‌ను ఔషధ నియంత్రణ అధికారులు గుర్తించి సీజ్ చేశారు. మూసారంబాగ్‌లోని ఓ ప్రైవేట్ ఫెర్టిలిటీ సెంటర్ కొంతకాలంగా సంతానం లేని దంపతులకు ఫెర్టిలిటీ చికిత్సలు అందిస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు దాడులు చేసి సెంటర్‌ను సీజ్ చేశారు.


స్టేడియంలో పూజలు నిర్వహిస్తున్న జగన్‌మోహన్ రావు

టెస్టు మ్యాచ్ విజయవంతంగా నిర్వహిస్తాం

● ఇప్పటికే సుమారు 20 వేల టికెట్ల విక్రయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉప్పల్ స్టేడియంలో ఈనెల 25 నుంచి జరగనున్న భారత్-ఇంగ్లండ్ తొలి టెస్టు మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు వెల్లడించారు. శుక్రవారం స్టేడియంలోని గణపతి ఆలయం, ప్రధాన పిచ్ వద్ద వేద పండితుల ఆధ్వర్యంలో జగన్‌మోహన్ రావు, అపెక్స్ కౌన్సిల్ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో విక్రయం ప్రారంభించిన ఒక్క రోజులోనే 20 వేల టికెట్లు అమ్ముడయ్యాయని చెప్పారు. స్టేడియం పూర్తి సామర్థ్యానికి తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏ ప్రధాన కార్యదర్శి దేవ్‌రాజ్, కోశాధికారి సీజే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు డ్రగ్స్ విక్రేతల అరెస్ట్

● రూ.కోటి విలువైన మాదక ద్రవ్యాలు స్వాధీనం

నేరేడ్‌మెట్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా డ్రగ్స్ తరలిస్తున్న అంతర్రాష్ట ముఠాను రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. రాజస్థాన్, బార్మర్ ప్రాంతానికి చెందిన నరేంద్ర బిష్ణోయి (20), ప్రవీణ్ బిష్ణోయి (23), హేమారామ్ (18), పక్కారామ్ దేవాసి అలియాస్ ప్రకాష్‌లు (31)లు మీర్‌పేట్ పరిధిలోని ప్రశాంత్ హిల్స్ లక్ష్మీనగర్‌లో ఉంటున్నారు. డ్రగ్స్‌కు బానిసలైన వీరు డబ్బు కోసం అడ్డదారిని ఎంచుకున్నారు. రాజస్థాన్ నుంచి తక్కువ ధరకు డ్రగ్స్‌ను కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వీరికి రాజస్థాన్‌కు చెందిన మరో ఇద్దరు సహకరిస్తున్నట్లు సీపీ వివరించారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్‌వోటీ ఎల్బీనగర్, మహేశ్వరం పోలీసులు మీర్‌పేట్ పోలీసులతో కలిసి అల్మాస్‌గూడ దగ్గర నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 150 గ్రాముల హెరాయిన్, 32 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, రెండు వేయింగ్ మిషన్లు వైట్, 60 వైట్ కవర్లు, 50 జిప్ లాక్ కవర్లు, రెండు సిల్వర్ పేపర్ బండిల్స్, 2,500 నగదు, ద్విచక్ర వాహనాలు, ఆరు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్‌లో వీటి విలువ కోటి రూపాయలుంటుందని సీపీ చెప్పారు. ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఎల్బీనగర్ మహేశ్వరం ఎస్‌వోటీ డీసీపీ మురళీధర్ పాల్గొన్నారు.

ప్లాన్ ఫర్ పార్లమెంట్

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వచ్చాయి. బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తనయుడు సాయికిరణ్ పోటీ చేయగా, బీజేపీ తరఫున బరిలో నిలిచిన కిషన్‌రెడ్డి విజయం సాధించారు. కిషన్‌రెడ్డి మరోసారి పోటీ చేయడం దాదాపు ఖరారైనట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి ఎవరు పోటీ చేస్తారన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. గతంలో జరిగిన సమావేశంలో సమర్థ నేతను బరిలో నిలుపుతామని కేటీఆర్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఎవరు పోటీ చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఇదిలాఉంటే గతంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించిన ఓటర్లు.. పార్లమెంట్, ఆ తర్వాత జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు పట్టం కట్టారు. ఈ నేపథ్యంలో నగర ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందన్నది చర్చనీయాంశంగా మారింది.

రేపు మల్కాజ్‌గిరి నేతలతో..

మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలోని నేతలతో కేటీఆర్ ఆదివారం సమావేశం కానున్నారు. లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. దీంతో ఈ స్థానంలో పార్టీ గెలుపుపైనా నేతలు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఈ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డి లోక్‌సభ అభ్యర్థిగా బరిలో దిగుతారని ప్రచారం జరుగుతోంది. 2014లో టీడీపీ తరఫున పోటీ చేసిన మల్లారెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఓ మాజీ మంత్రి, సంపన్నుడైన ఓ మాజీ ఎమ్మెల్యే కూడా ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గం పరిధిలో మెజార్టీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలున్నప్పటికీ.. కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేసిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి గెలుపొందారు.

ఏడేళ్ల పాప.. అన్న ప్రాణం నిలబెట్టింది!

జాంబియాకు చెందిన 14 ఏళ్ల బాలుడికి సికిల్‌సెల్ వ్యాధి

అన్న కోసం మూలుగ దానం చేసిన చెల్లెలు

కిమ్స్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స విజయవంతం


జాంబియాకు చెందిన కుటుంబంతో కిమ్స్ వైద్య బృందం

హైదరాబాద్ సిటీ/రాంగోపాల్‌పేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టుమని పదేళ్లు కూడా లేని ఆ బాలిక, ప్రాణాంతక సమస్యతో బాధపడుతున్న అన్నను ఆ ముప్పు నుంచి బయటపడేసింది. తన ఎముక మూలుగ (బోన్ మ్యారో)ను దానం చేసి, 14 ఏళ్ల సోదరుడి ప్రాణాలను నిలబెట్టింది. తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతున్న తమ కుమారుడి ప్రాణాలు కాపాడుకునేందుకు ఎన్నో ఆశలతో ఖండాలు దాటుకొని హైదరాబాద్‌కు వచ్చిన ఆ విదేశీ దంపతుల కళ్లలో కిమ్స్ వైద్యులు ఆనందం నింపారు. వారి కుమారుడికి, కుమార్తె నుంచి సేకరించిన మూలుగతో బోన్‌మ్యారో ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఆఫ్రికా ఖండంలోని జాంబియా దేశానికి చెందిన జంటకు 14 ఏళ్ల కుమారుడు, ఏడేళ్ల కుమార్తె ఉన్నారు. కుమారుడు కొన్నాళ్లుగా కీళ్ల నొప్పులు, హిమోగ్లోబిన్ శాతం తగ్గిపోవడం, విపరీతమైన నీరసం లాంటి సమస్యలతో బాధపడుతున్నాడు. అక్కడ సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో సికింద్రాబాద్‌లోని కిమ్స్‌కు తీసుకొచ్చారు. హెమటో ఆంకాలజిస్ట్, మూలుగ మార్పిడి నిపుణుడు డాక్టర్ నరేంద్ర కుమార్ తోట ఆ బాలుడిని పరీక్షించి సికిల్‌సెల్ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఇలాంటివారికి ఆరోగ్యకరమైన మూలుగ నుంచి మూలకణాలను ఇతరుల నుంచి సేకరించి, ఎక్కించాల్సి ఉంటుందని, సహజంగా దాన్నివ్వడానికి ఎవరూ అంత త్వరగా ముందుకు రారని డాక్టర్ నరేంద్ర కుమార్ చెప్పారు. అయితే బాలుడి చెల్లెలైన ఏడేళ్ల బాలిక చాలా ధైర్యంగా సహకరించిందని చెప్పారు. పాపకు కూడా సికిల్‌సెల్ వ్యాధి ఉన్నా, ఆమెకు తక్కువ తీవ్రత ఉందని, మూలుగ మూలకణం కూడా వంద శాతం మ్యాచ్ అయిందని పేర్కొన్నారు. మూలుగ మార్పిడి ఫలితంగా బాలుడికి తీవ్రమైన వ్యాధి కాస్తా తక్కువ తీవ్రత గల వ్యాధిగా మారిపోతుందని చెప్పారు. ఇక నుంచి అతనికి సికిల్‌సెల్‌కు సంబంధించి ఎలాంటి సమస్యలూ ఉండవని, అసలు ఆ వ్యాధి ఉన్న విషయమే దాదాపు తెలియదని, అన్నాచెల్లెళ్లు జీవితాంతం ఆరోగ్యకరంగానే ఉంటారని వివరించారు. జాంబియాలో ఈ వ్యాధిని గుర్తించడానికి కూడా సదుపాయాలు తక్కువగా ఉన్నాయని, ఫలితంగానే వారు ఇక్కడికి వచ్చారని వివరించారు. సికిల్‌సెల్ వ్యాధితో బాధపడుతున్నవారికి మూలుగ మార్పిడి చేస్తే నయం అవుతుందని.. ఈ విషయం చాలామందికి తెలియదని చెప్పారు.

డ్రగ్ లైసెన్స్‌లేని గోదాముపై దాడి

(5వ పేజీ తరువాయి)

ప్రకారం అంబర్‌పేటలోని ఆజాద్‌నగర్‌లో మొహమ్మద్ బషీర్ అహ్మద్.. డ్రగ్స్ లైసెన్స్ లేకుండానే గోడౌన్ నిర్వహిస్తూ అక్రమంగా మందుల విక్రయాలు సాగిస్తున్నాడు. దీంతో గురు, శుక్రవారాల్లో అధికారులు జరిపిన దాడిలో గోడౌన్‌లో భారీ మొత్తంలో మందులతో కూడిన అనేక కార్డ్ బోర్డ్ షిప్పర్ కార్టన్‌లను గుర్తించారు. గోడౌన్‌లో హయ్యర్ జనరేషన్ యాంటీబయాటిక్స్, పీడియాట్రిక్ సిరప్‌లు, యాంటీ అల్సర్ డ్రగ్స్, అనాల్జేసిక్ డ్రగ్స్, యాంటీబయాటిక్ ఇంజెక్షన్లు, యాంటీమలేరియా డ్రగ్స్ వంటి 40 రకాల మెడిసిన్స్ లభ్యమయ్యాయి. గోడౌన్‌లో దొరికిన చాలా మందుల లేబుల్స్‌పై యాప్లే ఫార్మాటెక్ ప్రైవేట్ లిమిటెడ్, వసంత కుంజ్, న్యూఢిల్లీ అని ఉంది. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని వివిధ తయారీదారుల వివరాలను ఉన్నట్లు అధికారులు తెలిపారు. గోడౌన్‌లో తెలంగాణ ప్రభుత్వ సరఫరా ఔషధాల భారీ నిల్వలు కూడా గుర్తించారు. గోవా యాంటీబయాటిక్స్ అండ్ ఫార్మాసూటికల్స్ లిమిటెడ్, పెర్నెమ్ తయారు చేసిన అమోక్సిసిలిన్ క్యాప్సూల్స్ ఐపీ 500 ఎంజీ, ఘటికేసర్‌లోని స్ట్రడ్ ఆర్గానిక్ ప్రైవేట్ లిమిటెడ్ తయారు చేసిన అజిత్రోమైసిన్ ఐపీ 500ఎంజీ టాబ్లెట్లను గుర్తించారు. రాష్ట్రంలోని పలు మెడికల్ షాపులకు మందులను సరఫరా చేస్తున్నట్లుగా అహ్మద్ వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. కాప్రాలోని శ్రీరాజరాజేశ్వర మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ ఆవరణలో అధికారులు గురు, శుక్రవారాల్లో దాడి చేసి అక్రమంగా, అనుమతి లేకుండా నిల్వ చేస్తున్న రూ.5 లక్షల విలువైన ఇన్సులిన్ ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇన్సులిన్ ఇంజెక్షన్లు, ఇన్సులిన్ పెన్నులు సహా ఐదు రకాల మందులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

మహిళా సంరక్షణకు నిఘా రిజిస్టర్

ఆరు నెలల పాటు నిందితుల వెంట నీడలా పోలీసులు

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడు లు, వేధింపులకు గురి చేసి న వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా, మరోసారి పునరావృతం కాకుండా ఉండేందుకు పోలీసులు కొత్త ప్రణాళికలు రచించారు. మహిళా సంరక్షణ నిఘా రిజిస్టర్‌ను అందుబాటులోకి తెచ్చారు. లైంగిక వేధింపులు, దాడులు, ఈవ్ టీజింగ్ కేసుల్లో నిందితులు మరోసారి బాధితులపై దాడులు, కక్షపూరిత వేధింపులు జరిపే అవకాశమున్నందున వాటి నిరోధానికి చర్యలు చేపడుతున్నారు. నిందితుల వివరాలను మహిళా సంరక్షణ రిజిస్టర్‌లో నమోదు చేసి ఆరు నెలల పాటు ఎస్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో వారిపై ప్రత్యేక నిఘా పెట్టనున్నారు. ఈ రిజిస్టర్‌ను గోప్యంగా ఉంచుతారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్‌లో శుక్రవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఈ రిజిస్టర్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల భద్రత కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, షీ టీమ్స్ ద్వారా డెకాయ్ ఆపరేషన్లు, ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ వుమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, ఏసీపీ వెంకటేశంతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

నైపర్‌లో సందడిగా ముగిసిన 11వ స్నాతకోత్సవం


పీజీ పూర్తి చేసిన వారికి బంగారు పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న అరుణీష్ చావ్లా

బాలానగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ (నైపర్)లో శుక్రవారం 11వ స్నాతకోత్సవం ఘనంగా ముగిసింది. ఫార్మసూటికల్స్ విభాగం కార్యదర్శి అరుణీష్ చావ్లా ముఖ్య అతిథిగా హాజరై పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బంగారు పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ఫార్మసీకి భారత్‌ను విశ్వగురువుగా పేర్కొంటున్నాయని అన్నారు. పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థినీ విద్యార్థులు భవిష్యత్‌లో ఫార్మారంగానికి సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు చేసి నూతన ఔషధాలను కనుగొని దేశ ప్రతిష్ఠను పెంచాలని సూచించారు. నైపర్ డైరెక్టర్ ప్రొ. డా. శైలేంద్ర షరాఫ్, నైపర్ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ (బీవోజీ), లారస్ ల్యాబ్స్ సీఈవో డా. సత్యనారాయణ చావ మాట్లాడారు. అనంతరం అరుణీష్ చావ్లా 192 మంది విద్యార్థులకు పీజీ, పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేశారు. అత్యుత్తమ ప్రతిభను కనబరచిన 11మందికి బంగారు పతకాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డీన్ ప్రొ.నందూరి శ్రీనివాస్, ప్రొ.చంద్రయ్య గొడుగు, సంస్థ అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ చెల్లించలేక ఆటో డ్రైవర్ ఆత్మహత్య

రాజేంద్రనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్‌లో తెచ్చిన ఆటో ఈఎంఐలు చెల్లించలేక ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కొడంగల్‌కు చెందిన ముడావత్ రాహుల్(22) గండిపేట్ మండలం లోని బండ్లగూడ జాగీర్‌లో తన సోదరుడితో కలిసి ఉంటున్నాడు. ఏడు నెలల క్రితం ఫైనాన్స్‌లో ఆటో కొన్నాడు. కొన్ని రోజులుగా ప్రయాణికులు లేక సంపాదన తగ్గడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఆటో సరిగ్గా నడవకపోవడంతో ఈఎంఐలు చెల్లించలేకపోయాడు. ఫైనాన్సర్ల నుంచి ఒత్తిడి పెరగడంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాహుల్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని సోదరుడి ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యుద్ధాలు సైనికులతో కాదు.. సైబర్ దాడులతో

● జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి



వీసీ నర్సింహారెడ్డికి మెమెంటో అందజేస్తున్న డైరెక్టర్ శ్రీదేవి

హైదరాబాద్ సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత తరుణంలో యుద్ధాలు సైనికులతో కాకుండా సైబర్ దాడులతో జరుగుతున్నాయని, వీటిని అరికట్టడానికి సైబర్ సెక్యూరిటీ ఆవశ్యకత ఎంతో ఉందని జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో 'వలనరబిలిటీ అసెస్‌మెంట్ అండ్ పెనట్రేషన్ టెస్టింగ్(వీఏపీటీ)" అంశంపై ఏర్పాటుచేసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ.. సైబర్ సెక్యూరిటీ అవశ్యకతను ముందుగానే గుర్తించి జేఎన్టీయూలో బీటెక్‌లో సైబర్ సెక్యూరిటీ కోర్సును ప్రారంభించామన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ చాలా ముఖ్యమైన అంశాలని, వీటిని మానవ శ్రేయస్సుకు లేదా మానవ వినాశనానికి కూడా వాడొచ్చని చెప్పారు. రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్ మాట్లాడుతూ.. సైబర్ సెక్యూరిటీ కోర్సులకు సంబంధించి ఇటీవల అమెరికన్ యూనివర్సిటీలతోనూ జేఎన్‌టీయూ అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుందన్నారు. రెక్టార్ గోవర్ధన్ మాట్లాడుతూ.. సైబర్ సెక్యూరిటీ అంశాలపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్.. వివిధ ఇంజనీరింగ్ కాలేజీల్లో పనిచేస్తున్న కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్లకు ఎంతో ఉపయోగకరమన్నారు. జె-హబ్ డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ.. సైబర్ సెక్యూరిటీ రంగంలో వీఏపీటీ టెక్నీషియన్స్‌కు ఎంతో డిమాండ్ ఉందన్నారు.

అక్రమబద్ధీకరణపై ఆగ్రహం

(5వ పేజీ తరువాయి)

వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పలువురు ప్రజాప్రతినిధులు, పలు రాజకీయ పార్టీ నేతలు స్పందిస్తున్నారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలను చూపుతూ విచారణ జరపాలని, కన్వేయన్స్ డీడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

'ఆంధ్రజ్యోతి' కథనాలు ఆధారంగా..

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ నానక్‌రాంగూడ సర్వేనెంబర్ 149లోని ప్రభుత్వ భూమిని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి శుక్రవారం పరిశీలించారు. పి.సురేందర్ అనే వ్యక్తితో పాటు అతడి కుటుంబ సభ్యులు ఖాళీ స్థలాన్ని 59కింద అక్రమంగా కన్వేయన్స్ చేసుకున్న డాక్యుమెంట్లను, ఇతర ఆధారాలను చూపించారు. 'ఆంధ్రజ్యోతి' కథనాలను కూడా చూపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాన్ని వేలాది గజాల చొప్పున ఒక్కొక్కరికీ రాసిచ్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో 59ను దుర్వినియోగం చేసిన అధికారులు, కాంగ్రెస్ నాయకుడు పి.సురేందర్ ప్రధాన సూత్రధారని, అతడి కుటుంబ సభ్యులు, బినామీల పేర్ల మీద వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని రెగ్యులరైజ్ చేసుకుని, కొన్ని గంటల్లోనే నిర్మాణ సంస్థలకు రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఈ తంతు నడిపించారని తెలిపారు. రెగ్యులరైజ్ చేసిన స్థలాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు తుంగలో తొక్కి రాత్రి సమయంలో రెవెన్యూ అధికారులు ఒక్కొక్కరికి వేల గజాల స్థలం రెగ్యులరైజ్ చేశారని తెలిపారు. కోట్లాది రూపాయాల స్థలం చేతులు మారడంలో అధికారులు, కొందరు ప్రజాప్రనిధుల పాత్ర ఉందని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కొందరు కావాలనే గత ప్రభుత్వ హయాంలో జరిగిందంటున్నారని, కానీ డిసెంబర్ 5న రాత్రి సమయంలో జరిగిందని తెలిపారు. జీఓను దుర్వినియోగం చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని, వారిపై చర్యలు తీసుకోవాలని గాంధీ డిమాండ్ చేశారు.

చర్యలపై కలెక్టర్‌కు బీజేపీ వినతి

శేరిలింగంపల్లి మండల కార్యాలయ అధికారులు 59జీఓను దుర్వినియోగం చేశారని, చర్యలు చేపట్టాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్‌కు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్, బీజేపీ నేత గంగాధర్ రెడ్డి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పేదల కోసం తీసుకువచ్చిన జీఓ నెంబర్ 59ను దుర్వినియోగం చేస్తూ పల్లపు సురేందర్, మాధవితో పాటు ఇంకొందరు అక్రమార్కులు సర్వే నెంబర్ 82లో ఎలాంటి ఇళ్ల నిర్మాణాలు లేకున్నా, విద్యుత్, నల్లా బిల్లుల లాంటివి లేకుండానే స్థలాలను పొందారని తెలిపారు. లబ్ధి పొందిన వ్యక్తులపై, ప్రభుత్వ ఆస్తులను కట్టబెట్టిన అప్పటి తహశీల్దార్ శ్రీనివాస్ రావు, సీనియర్ అసిస్టెంట్ ఫ్రాంక్లిన్, ఇతర అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. వినతిపత్రమిచ్చిన వారిలో బీజేపీ గచ్చిబౌలి డివిజన్ ఉపాధ్యక్షులు తిరుపతి, సీనియర్ నాయకులు మన్నె రమేష్ పాల్గొన్నారు.

పద్దు.. పరేషాన్..!

(5వ పేజీ తరువాయి)

కౌన్సిల్ ఆమోదించిందని, పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సమీక్ష తర్వాతేనా?

డిసెంబర్ 7న కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. అనంతరం కొద్ది రోజుల్లోనే మంత్రిత్వ శాఖలూ ఖరారయ్యాయి. పురపాలక శాఖ సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ఉంది. మూసీ సుందరీకరణ, మెట్రో పొడిగింపు తదితర అంశాలపై సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి.. జీహెచ్‌ఎంసీపై ప్రత్యేకంగా సమీక్ష జరపలేదు. ఈ నేపథ్యంలో ఏం చేయాలన్న దానిపై అధికారులు అయోమయానికి గురవుతున్నారు. పురోగతిలో ఉన్న వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ), రెండు పడకల ఇళ్ల నిర్మాణం, రెండో దశ ప్రతిపాదనలు సిద్ధం చేసిన కాంప్రెహెన్సీవ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్(సీఆర్ఎంపీ), ఎస్ఆర్‌డీపీ ఫేజ్-2 ప్రతిపాదనలపై సందిగ్ధత నెలకొంది. నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ప్రభుత్వ ప్రాధమ్యాలు ఏంటన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహిస్తే తప్ప ఎలా ముందుకు వెళ్లాలన్నది తేలే అవకాశం లేదని ఓ ఉన్నతాధికారి చెప్పారు.


పేలుడుకు పైకప్పు కూలిన పాత పోలీస్ స్టేషన్

పోలీస్‌స్టేషన్‌లో పేలిన సిలిండర్లు

● కుప్పకూలిన పైకప్పు

● కానిస్టేబుల్, విద్యుత్ సిబ్బందికి గాయాలు

మంగళ్‌హాట్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సీజ్ చేసిన సిలిండర్లు పేలి పోలీస్ స్టేషన్ కుప్పకూలింది. దీంతో కానిస్టేబుల్, విద్యుత్ సిబ్బందికి గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దారుల్‌సలాం ప్రధాన రోడ్డు మార్గంలో మంగళ్‌హాట్ పాత పోలీస్‌స్టేషన్ భవనం శిథిలావస్థలో ఉంది. అక్రమంగా రీఫిల్లింగ్ వ్యవహారంలో సీజ్ చేసిన సిలిండర్లను కొంతకాలంగా పాత పోలీస్ స్టేషన్ భవనంలో నిల్వ చేసి ఉంచారు. నిత్యం ఈ భవనం ప్రధాన ద్వారాలకు తాళం వేసి ఉంటుంది. శుక్రవారం తెల్లవారుజామున భవనం వద్ద పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలకు నిప్పంటుకొని ఒక్కసారిగా పాత పోలీస్ స్టేషన్‌కు వ్యాపించాయి. మంటలు అంటుకోవడంతో కానిస్టేబుల్ రాజా, స్థానిక విద్యుత్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అంతలోనే భవనంలో నిల్వ చేసిన సిలిండర్లు పేలి పెద్ద శబ్దం రావడంతోపాటు నిప్పు రవ్వలు, ఇతర సామగ్రి ఎగిరొచ్చి కానిస్టేబుల్ కుడి కంటికి తగిలాయి. దీంతో గాయాలయ్యాయి. ఇద్దరు విద్యుత్ సిబ్బందికి సైతం గాయాలయ్యాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. సిలిండర్ల పేలుడుకు పోలీస్ స్టేషన్ భవనం పైకప్పు కుప్పకూలింది. మంగళ్‌హాట్ పోలీసులు గాయపడిన కానిస్టేబుల్ రాజాను నాంపల్లి కేర్ ఆస్పత్రికి తరలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో దంపతుల ఆత్మహత్య


మృతి చెందిన దంపతులు శ్రీనివాస్, రమాదేవి (ఫైల్)

మౌలాలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. గౌతంనగర్ సెక్టార్ మల్లికార్జున్‌నగర్ కాలనీలో శ్రీనివాస్(47) వృత్తి రీత్యా బార్బర్. అతనికి భార్య రమాదేవి(37), కుమార్తె సుస్మిత ఉన్నారు. ఇటీవల అతను ఆర్థిక సమస్యలకు తోడు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. గురువారం రాత్రి సుస్మిత సమీపంలో ఉంటున్న తాతయ్య ఇంటికి వెళ్లి పడుకుంది. ఉదయం వచ్చి ఇంటి తలుపుతట్టగా ఎంతకూ తీయకపోవడంతో మామ హరీష్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. అతను వెంటనే అక్కడికి వచ్చి పరిశీలించగా ఇంట్లో శ్రీనివాస్ ఉరేసుకొని కనిపించాడు. రమాదేవి నుంచి స్పందన లేకపోవడంతో చుట్టు పక్కల వారి సహాయంతో తలుపులు పగులగొట్టారు. అప్పటికే దంపతులు మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దంపతులు శ్రీనివాస్, రమాదేవి ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ బాధిత కుటుంబీకులకు కలిసి పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.30వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

నేడు, రేపు ఓటరు క్యాంపెయిన్

● నమోదు, సవరణకు అవకాశం

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఓటరుగా పేరు నమోదు, సవరణకు నేడు, రేపు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్టు జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ తెలిపారు. నిర్ణీత పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ ఆఫీసర్లు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారు. ఈ నెల 6వ తేదీన ప్రకటించిన ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరిస్తారు. జాబితాలో పేరుందా..? లేదా..? తెల్సుకోవడంతోపాటు పేరు, చిరునామాలో తప్పులు, ఓటర్ గుర్తింపు కార్డుల్లో సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని పౌరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 22వ తేదీ వరకు దరఖాస్తులను ఎలక్టొరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌ఓ) కార్యాలయాల్లోనూ సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఫిబ్రవరిలో ఓటరు తుది జాబితా ప్రకటించనున్నారు.

రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రమాదం

● వెస్టెక్స్ ఏషియా సిల్వర్ జూబ్లీ వేడుకల్లో అపశ్రుతి

● కంపెనీ సీఈవో మృతి.. ప్రెసిడెంట్‌కు తీవ్ర గాయాలు


సంజయ్‌షా (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించిన వెస్టెక్స్ ఏషియా కంపెనీ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ ఘటనలో సదరు కంపెనీ సీఈవో మృతి చెందగా, కంపెనీ ప్రెసిడెంట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ఈ ఘటన జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రిగింది. ముంబైకి చెందిన సంజయ్ షా(56) చికాగోలో స్థిరపడ్డారు. ఆయనకు విస్టెక్స్ ఏషియా సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉంది. కంపెనీ ఏర్పాటు చేసి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రామోజీఫిల్మ్ సిటీలోని లైమ్-లైట్ గార్డెన్ వేదికగా గురు, శుక్ర వారాల్లో సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. గురువారం రాత్రి 7గంటలకు ఈ వేడుక ప్రారంభమైంది. కంపెనీ సీఈవో సంజయ్‌షాతోపాటు ప్రెసిడెంట్ విశ్వనాథ్ రాజ్‌దాట్ల ఏరియల్ యాక్ట్ ద్వారా స్టేజీ మీదకు వచ్చేలా ఈవెంట్ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఏరియల్ యాక్ట్ ద్వారా వారిద్దరూ స్టేజీ మీదకు దిగే క్రమంలో ఒక వైపున ఉన్న ఐరన్ తీగలు తెగిపోయాయి. దీంతో సుమారు 20అడుగుల ఎత్తు నుంచి వారిద్దరూ కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ తొలుత సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం మలక్‌పేటలోని యశోద ఆస్పత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ సంజయ్‌షా గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కంపెనీ ప్రెసిడెంట్ విశ్వనాథ్‌రాజ్ దాట్ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈవెంట్ నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేగంగా సికింద్రాబాద్ స్టేషన్ పునరభివృద్ధి పనులు

(5వ పేజీ తరువాయి)

పనులు పూర్తయ్యాయి. కాజీపేట వైపు కొత్త పాదచారుల వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దక్షిణం వైపున మిగిలిన నిర్మాణ పనులను కూడా సకాలంలో పూర్తి చేసేందుకు, వాహనాల రాకపోకలు సజావుగా సాగించేందుకు తాత్కాలిక రహదారి ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న 11 కేవీ విద్యుత్ స్థానంలో 33 కేవీ విద్యుత్ కెపాసిటీ విద్యుత్ సబ్ స్టేషన్లు రెండు రానున్నాయి. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్టేషన్ పునరభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ తెలిపారు.



వంటిల్లు

కూరలు, మసాలా కర్రీలు, మాంసాహారం.. ఎన్ని తిన్నా...
ఏమాటకి ఆ మాట చెప్పుకోవాలి కానీ.. ఈ రోటి పచ్చడి కథే వేరు.
అన్నం, దోశలోకి కొద్దిగా రోటి పచ్చడి వేసుకుని తింటే..
ఆ రుచి అదరహో. ఈ వీకెండ్‌లో దొండకాయ రోటి పచ్చడి,
కంద రోటి పచ్చడి, కాల్చిన వంకాయల రోటి పచ్చడి,
పండు మిరపకాయల రోటి పచ్చడిని సులువుగా
ఎలా చేసుకోవాలో తెలుసుకుందాం.

రోటి పచ్చడి... కచ్చా పచ్చా!



దొండకాయ రోటి పచ్చడి

కావాల్సిన పదార్థాలు

దొండకాయ ముక్కలు- 300 గ్రాములు, నూనె- 2 టేబుల్ స్పూన్లు, మీడియం సైజ్ ఉల్లిపాయ- 1 (చిన్న ముక్కలుగా కట్ చేయాలి), చిన్న టమోటాలు- 3, పచ్చిమిర్చి-8 (సగానికి కట్ చేయాలి), వేయించిన పల్లీలు- ఒకటిన్నర టేబుల్ స్పూన్, వెల్లుల్లి- 4, చింతపండు రసం- టేబుల్ స్పూన్, ఉప్పు- కొద్దిగా, పసుపు- తగినంత

తయారీ విధానం

ఒక గుంత ప్యాన్‌లో నూనె వేసి దొండకాయ ముక్కలు, టొమాటో ముక్కలు, పచ్చిమిర్చి వేసి మీడియం ఫ్లేమ్‌లో అవి మగ్గేవరకు కనీసం పది నిముషాలు కుక్ చేయాలి. మధ్యమధ్యలో చూసుకుంటూ మగ్గేంత వరకూ కుక్ చేయాలి. వీటిని ప్లేట్‌లో పక్కన ఉంచుకోవాలి.

రోలులో వేయించుకున్న దొండకాయ, టొమాటో, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలను వేసి దంచాలి. వేయించిన పల్లీలు, వెల్లుల్లి వేసి దంచాలి. ఇందులో ఉప్పు, పసుపును రుచికి తగినట్లు వేసుకుని రుబ్బాలి. చివరగా పల్లీలు వేసి ఆ తర్వాత చింతపులుసు వేసి దంచాలి. మిశ్రమంలోకి బాగా పడుతుంది. అవసరం అనుకుండా ఈ పచ్చడిని పోపు వేసుకోవచ్చు. అన్నంలోకి, దోశ, చపాతీలోకి బావుంటుంది ఈ దొండకాయ పచ్చడి.



కంద రోటి పచ్చడి


కావాల్సిన పదార్థాలు

శుభ్రపరచిన కందగడ్డ ముక్కలు- 300 గ్రాములు, ఎండుమిర్చి- 6, ఇంగువ- తగినంత, ఆవాలు- కొద్దిగా, శనగలు- అరటీస్పూన్, మెంతులు- కొద్దిగా, మినపప్పు- అరటీస్పూన్, చింతపండు గుజ్జు- రెండు స్పూన్లు, నూనె- 4 టీస్పూన్లు, ఉప్పు- రుచికి తగినంత, పసుపు- కొద్దిగా, ఉల్లిపాయ- 1 (చిన్న ముక్కలుగా తరగాలి), టొమాటో- 1 (చిన్న ముక్కలుగా తరగాలి)

తయారీ విధానం

శుభ్రపరచిన కంద ముక్కలను బియ్యం కడిగిన నీళ్లలో నానబెట్టాలి. ఇలా చేస్తే కంద వల్ల దురదరాదు. ఇలా పది నిముషాల పాటు నానబెట్టాలి. ఒక ప్యాన్‌లో సరిపడ నూనె వేసి కంద ముక్కలను పదిహేను నిముషాల పాటు వేయించాలి. మెత్తగా అవుతాయి. ఆ కంద ముక్కలను పక్కన ఉంచుకోవాలి. అదే ప్యాన్‌లో కొద్దిగా నూనె వేసి ఉల్లిపాయ ముక్కలు, టొమాటో ముక్కలను వేయించాలి. చివరగా అదే ప్యాన్‌లో కొద్దిగా నూనె వేసి శనగలు, ఆవాలు, మెంతులు, మినప్పప్పును వేయించుకోవాలి. రోటిలో కంద ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, టొమాటో ముక్కలు వేసి కచ్చాపచ్చాగా నూరాలి. ఇందులోకి సరిపడ ఉప్పు, పసుపు వేసి నూరాలి. చివరగా పోపు మిశ్రమాన్ని వేసి నూరాలి. కంద పచ్చడి రెడీ. అన్నంలో లేదా దోశలోకి బాగుంటుంది.

కాల్చిన వంకాయ రోటి పచ్చడి



కావాల్సిన పదార్థాలు

మీడియం సైజ్ పచ్చ వంకాయలు- 4, టొమాటోలు- 3 (చిన్నవి), ఉల్లిపాయ- 1, పచ్చిమిర్చి- 6, చింత పులుసు- టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత, పసుపు- చిటికెడు

తయారీ విధానం

స్టవ్‌మీద రోటీ గ్రిల్ ఉంచి దాని మీద వంకాయలను పైన పొట్టు నల్లగా అయ్యేంత వరకు కాల్చుకోవాలి. వీటిని పక్కన ఉంచుకోవాలి. ఆ తర్వాత ఉల్లిపాయ, టొమాటోలు, పచ్చిమిర్చి కాల్చుకోవాలి. వీటిమీద ఉండే నల్లటి పొట్టు వల్చేయాలి. రోటిలో ఉల్లిపాయ, టొమాటో, పచ్చిమిర్చి వేసి దంచాలి. ఆ తర్వాత వంకాయలను వేసి దంచాలి. ఇందులో పసుపు, చింత పులుసు, ఉప్పు వేసి దంచాలి. ఈ కచ్చా పచ్చా వంకాయల రోటి పచ్చడి స్మెల్ అద్దిరిపోతుంది. దీన్ని బౌల్‌లో వేసుకుని తాజాగా సర్వ్ చేసుకోవటమే తరువాయి. అన్నంలోకి రుచిగా ఉంటుంది.

పండు మిరపకాయల రోటి పచ్చడి



కావాల్సిన పదార్థాలు

పండు మిరపకాయలు- 12, టొమాటోలు- 3 (చిన్న ముక్కలుగా కట్ చేయాలి), ఉల్లిపాయ-1 (చిన్న ముక్కలుగా కట్ చేయాలి), కరివేపాకు- కొద్దిగా, నూనె- రెండు టేబుల్ స్పూన్లు, ధనియాలు- అరటీస్పూన్, జీలకర్ర- అరటీస్పూన్, వెల్లుల్లి రెబ్బలు- 6, చింతపండు- కొద్దిగా, పసుపు- చిటికెడు, ఉప్పు- రుచికి సరిపడ

తయారీ విధానం

ప్యాన్‌లో నూనె వేసి అందులో పండు మిరపకాయలను వేయించాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు, కరివేపాకు, జీలకర్ర, ధనియాలు, వెల్లుల్లి రెబ్బలు, చింతపండు వేసి వేయించాలి. అవసరం అనుకుంటే కొద్దిగా నూనె జతచేయాలి. ఈ మిశ్రమాన్ని రోటిలో వేసి దంచాలి. చివరగా ఉప్పు, పసుపు వేసి దంచాలి. ఈ పండు మిరపకాయల పచ్చడిని అవసరం అనుకుంటే పోపు పెట్టుకోవచ్చు. ఈ పచ్చడిని అన్నంతో తింటే ఎంతో రుచిగా ఉంటుంది.

మేకప్

మెలకువలతో మెరుపులీనొచ్చు

మేకప్ అవసరం ప్రతి రోజూ ఉండకపోయినా, అవసరం పడినప్పుడు వేసుకునే మేకప్‌లో పొరపాట్లు లేకుండా చూసుకోవాలి. అందుకోసం మేకప్ వేసుకునే విధానం మీద అవగాహన పెంచుకోవాలి.


చర్మపు రకం, రంగు: చర్మానికి నప్పే మేకప్ ఐటమ్స్ ఎంచుకోవాలంటే, చర్మపు తత్వం, టోన్‌ల గురించి తెలుసుకోవాలి. జిడ్డు చర్మం కలిగిన వాళ్లు నూనె ఆధారిత మేకప్ ఐటమ్స్ ఎంచుకోకూడదు. కొన్ని మేకప్ సాధనాలు చర్మంలోని తేమను పీల్చేస్తాయి కాబట్టి పొడి చర్మం కలిగిన వాళ్లు వీటిని వాడకూడదు. చర్మపు తత్వం, రంగులకు తగిన సాధనాలనే ఎంచుకోవాలి.

సరైన బ్రషెస్: వేర్వేరు దశల్లో వేర్వేరు బ్రష్‌లను వాడుకుంటే, మేకప్ వేసుకోవడం తేలికవుతుంది. వేసుకున్న మేకప్ చూడచక్కగా ఉంటుంది. కనురెప్పల బేస్‌లో ఐ షాడో వేసుకోవడానికి చదునైన షాడో బ్రష్‌ను వాడాలి. ముడతలను దాచడం కోసం బ్లెండింగ్ క్రీజ్ బ్రష్ ఉపయోగించాలి. ల్యాష్ లైన్ మీద సన్నని గీతలా లైనర్‌ను పెట్టుకోవడానికి యాంగిల్డ్ లైనర్ బ్రష్ వాడాలి.

లిప్ లైనర్, లిప్‌స్టిక్: లిప్‌స్టిక్ వేసుకునే ముందు లిప్‌లైనర్‌తో పెదవుల అంచుల్లో లైన్ గీసుకోవాలి. లిప్‌స్టిక్ చెదిరిపోకుండా ఉండడానికి లిప్‌లైనర్ అప్లై చేసుకోవడం అవసరం. ఆ తర్వాత లిప్‌స్టిక్ బ్రష్‌తో లిప్‌స్టిక్‌ను గీసుకున్న గీతల లోపల అద్దుకోవాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి:

- మేకప్‌ను పూర్తిగా తొలగించి, ముఖాన్ని శుభ్రం చేసుకున్న తర్వాతే నిద్రకు ఉపక్రమించాలి.
- శుభ్రమైన ఉత్పత్తులనే వాడాలి. వాటి మీది ఇంగ్రీడియెంట్స్‌ను క్షుణ్ణంగా చదవాలి.
- చర్మ తత్వానికి తగిన మేకప్ సాధనాలనే వాడాలి.
- అవసరానికి మించి మేకప్ వేసుకోకూడదు.



నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం...
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/7LxJCLEలో
చదవండి.

విభిన్నం

చిన్నప్పటి లక్ష్యం... డాక్టర్ కావాలని. దాని కోసమే శ్రమించి... అనుకున్నది సాధించింది.
డెంటిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టాలనుకుంది. కానీ డ్యాన్స్‌పై ఉన్న అమితమైన ప్రేమ...
ఆమె రూటు మార్చేసింది. యూట్యూబ్ స్టార్‌గా ఎదిగి... రెండు మూడు సినిమాల్లో నటించింది.
భారత క్రికెటర్ యజువేంద్ర చాహల్ సతీమణిగా... అద్భుతమైన డ్యాన్సర్‌గా... కొరియోగ్రాఫర్‌గా
పేరు తెచ్చుకున్న ధనశ్రీ వర్మ జర్నీ ఇది.

రంగం ఏదైనా... ధనశ్రీ హల్‌చల్ పక్కా



యజువేంద్ర చాహల్‌తో పెళ్లికి ముందే ధనశ్రీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. తన డ్యాన్స్ వీడియోలతో యూట్యూబ్‌లో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. పెళ్లి తరువాత ఒక్కసారిగా ఆమె పేరు క్రికెట్ ప్రేమికులందరికీ పరిచయమైంది. భారత్‌లోనే కాదు... ఇతర దేశాల్లోని క్రికెట్ అభిమానులు కూడా ధనశ్రీ 'ఆట'కు ఫిదా అయ్యారు. ఇక చాహల్‌తో కలిసి ఆమె చేసే డ్యాన్స్ మూమెంట్స్‌కు అయితే విపరీతమైన క్రేజ్. విశేషమేంటంటే... వీరిద్దరినీ కలిపింది కూడా ఆ నాట్యమే. ఇప్పుడే కాదు... ఒకప్పుడు చాహల్ కూడా ఆమె డ్యాన్స్‌కు అభిమానే.

ఆమె అంటే ఎంతో గౌరవం...

"దేశమంతా లాక్‌డౌన్‌లో ఉన్న సమయం అది. 'టిక్‌టాక్'లో నా డ్యాన్స్ చూసి నాకు మెసేజ్ పంపించారు. తాను కూడా డ్యాన్స్ నేర్చుకోవాలని అనుకుంటున్నానని, ఆన్‌లైన్ తరగతులు ఏవైనా ప్రారంభించే ఉద్దేశం ఉందా అని అడిగారు. నేను సరేనన్నాను. ఒకటి రెండు నెలలు మా ఇద్దరి మధ్య సంభాషణలు కేవలం డ్యాన్స్ సంబంధిత విషయాల మీదే సాగాయి. తరువాత ఒక రోజు 'నిన్ను ఒకటి అడగాలని అనుకొంటున్నా' అని తను మెసేజ్ చేశారు. అదేంటంటే... 'ప్రపంచమే స్తంభించిన లాక్‌డౌన్‌లో కూడా మీరు ఇంత సంతోషంగా ఎలా ఉండగలుగుతున్నారు' అని! అక్కడి నుంచి మా మాటలు మా జీవన ప్రయాణంలోకి వెళ్లాయి" అంటూ చాహల్‌తో తన పరిచయం గురించి ఓ సందర్భంలో చెప్పుకొచ్చింది ధనశ్రీ. తనలానే స్వయంశక్తితో ఎదిగిన మహిళగా చాహల్ ఆమెను ఎంతో గౌరవిస్తాడు. అభిమానిస్తాడు.



ముందు అమ్మకు చెప్పి...

చాహల్‌తో ధనశ్రీ పరిచయం కొన్నాళ్లకు మరో మలుపు తిరిగింది. తమ స్నేహాన్ని తరువాతి స్థాయికి తీసుకువెళ్లాలని అనుకున్నాడు చాహల్. "ధనశ్రీ గురించి నాకు పెద్దగా తెలియదు. కానీ ఈ కొన్నాళ్ల పరిచయంలో ఆమె అంటే నాకు ఇష్టం ఏర్పడింది. ముందు మా అమ్మా నాన్నలకు చెప్పాను... తనను నా జీవిత భాగస్వామి చేసుకోవాలని కోరుకొంటున్నానని. తరువాత అదే విషయం నేరుగా



తనకు చెప్పాను. 'నువ్వంటే నాకు ఇష్టం. నీతో డేటింగ్ చేయాలనుకోవడం లేదు. నిన్ను పెళ్లి చేసుకోవాలని అనుకొంటున్నా' అని మనసులో ఉన్నది ఉన్నట్టు చెప్పాను" అని నాడు తమ నిశ్చితార్థం సందర్భంగా చాహల్ వెల్లడించాడు. అతడిలో ధనశ్రీకి నచ్చింది అదే... ముక్కుసూటితనం... ఎదుటివారికి గౌరవం ఇవ్వడం. 'ఆయన ప్రతిపాదన కాదనడానికి నా దగ్గర కారణాలేవీ లేవు' అంటున్న ధనశ్రీకి పరిచయమైన చాలా రోజుల వరకు చాహల్ పెద్ద క్రికెటర్ అని తెలియదు. ఎందుకంటే అతను అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టే సమయానికి ఆమె క్రికెట్ చూడడం మానేసిందట. 'యజీ ఎవరో నాకు అప్పటికి తెలియదు. అయితే ఏదో కాలక్షేపానికి కాకుండా డ్యాన్స్ క్లాసుల్లో పూర్తి శ్రద్ధ పెట్టేవారు. ఇచ్చింది ఇచ్చినట్టు హోమ్‌వర్క్ పూర్తి చేసేవారు. ఆయనలోని నిబద్ధత, మర్యాదగా నడుచుకొనే తీరు నాకు బాగా నచ్చాయి' అని భర్త గురించి గొప్పగా చెబుతుంది ధనశ్రీ. వీరిద్దరూ 2020లో పెళ్లి చేసుకున్నారు.

డాక్టర్ కావాలనుకుని...

ధనశ్రీ తండ్రి కపిల్‌వర్మ పారిశ్రామికవేత్త. తల్లి వర్ష గృహిణి. దుబాయ్‌లో పుట్టిన ధనశ్రీ ముంబయిలో పెరిగింది. అక్కడి 'జమునా బాయ్ నర్సీ ఇంటర్నేషనల్ స్కూల్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె... చిన్న నాటి నుంచి డాక్టర్ కావాలని కోరుకుంది. అందుకు తల్లితండ్రులు కూడా మద్దతు తెలిపి, ప్రోత్సహించారు. తన ఆకాంక్షకు అనుగుణంగా మెడిసిన్‌లో సీటు సాధించి 'డీవై పాటిల్ యూనివర్సిటీ'లో బీడీఎస్ పూర్తి చేసింది. అయితే మొదటి నుంచి డ్యాన్స్‌తో పాటు నటనపైన ఉన్న మక్కువ ఆమె కెరీర్‌ను మరో మలుపు తిప్పింది. చదువుకొనే రోజుల్లోనే ధనశ్రీ డ్యాన్స్, లిప్ సింకింగ్ వీడియోలు చేసి యూట్యూబ్‌లో పోస్ట్ చేసేది. అలా పదేళ్ల కిందట ఆమె పెట్టిన ఓ వీడియోకు మంచి ఆదరణ లభించింది. ఇక అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. ప్రముఖ డ్యాన్సర్లతో జతకట్టి చేసిన వీడియోలకు లక్షల్లో వ్యూస్ వచ్చాయి. తన పేరుతో పెట్టుకున్న 'ధనశ్రీవర్మ' చానల్‌ను తక్కువ సమయంలో పది లక్షలమంది సబ్‌స్క్రైబ్ చేశారు.

భాగస్వామితో కలిసి...

ఇక పెళ్లి తరువాత ధనశ్రీ గ్రాఫ్ అనూహ్యంగా పెరిగిపోయింది. చాహల్ క్రికెట్ క్రేజ్ ఆమెకు బాగా కలిసివచ్చింది. వీరిని కలిపింది కూడా ఇద్దరికీ నాట్యం మీద ఉన్న మక్కువే కదా. దానికి కొనసాగింపుగా ఇద్దరూ కలిసి హిట్ పాటలకు లయబద్ధంగా అడుగులు కదిపి... వాటిని ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తున్నారు. ఇవి దేశం దాటి విదేశాల్లోని వారిని కూడా అలరిస్తున్నాయి. కొరియోగ్రఫీలో కూడా మంచి నైపుణ్యం ఉన్న ధనశ్రీ... ఒక్క క్షణం కూడా ఖాళీగా కనిపించదు. అటు ఇంటి పనులు చూసుకొంటూనే... మైదానానికి వెళ్లి చాహల్‌లో స్ఫూర్తి నింపుతుంది. ఆటలో అతడికి ఆటుపోట్లు ఎదురైనప్పుడు... ధైర్యం చెప్పి ముందుకు నడిపిస్తుంది. తనలా మరింతమంది డ్యాన్సర్లను తయారు చేయాలన్న ఉద్దేశంతో... ఒక నాట్యాలయాన్ని ప్రారంభించింది. అంతేకాదు... పెద్ద పెద్ద బ్రాండ్లకు ప్రచారకర్తగా కూడా వ్యవహరిస్తోంది. డ్యాన్స్ ఆల్బమ్స్ రూపొందిస్తోంది. గత ఏడాది జరిగిన వన్డే ప్రపంచకప్ గీతంలో బాలీవుడ్ స్టార్ రణవీర్‌సింగ్‌తో కలిసి చేసిన డ్యాన్స్ ధనశ్రీకి ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం మెగా డ్యాన్స్ రియాలిటీ షో 'ఝలక్ దిక్‌లాజా'లో వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ఇచ్చిన ధనశ్రీ నికర వార్షిక ఆదాయం మూడు మిలియన్ డాలర్లకు పైనే.



నారంగ కేసరమపాకృత బీజ పుంజం యోగ్యంతి ఖండమరీ చోద్య వచూర్ణ మిశ్రమ్!
అన్నం గలె విశతి తస్య నరస్య తూర్ణం సంగృహ్యమాణ ఇవం రాహుణవేన చంద్రః!!

నారింజ, కమలా, బత్తాయి, నిమ్మ దబ్బ, పంపరపనస... ఇవన్నీ ఇంచుమించుగా సమాన గుణధర్మాలు కలిగిన ఫలాలు. ఆహార పదార్థాలుగా తయారు చేసు

నారింజ పచ్చడి... పప్పు

కునేందుకు ఎక్కువ అనుకూలంగా ఉంటాయి.

కమలాలు, బత్తాయిలూ 16-17 శతాబ్దాలలో మనకు పరిచయం అయ్యాయి. డచ్చి ఈస్టిండియా కంపెనీ వాళ్ల వాణిజ్య రాజధాని బటావియా దీవి. ఇది ఇండోనీషియాలో ఉంది. ఇక్కడ నుండి విత్తనాలు తెచ్చి గోదావరి జిల్లాల్లో రైతులకు ఇచ్చి పండించారు. పాలకొల్లు రైతులు దీన్ని అభివృద్ధి చేశారు. బటావియా నుండి వచ్చినవి కాబట్టి, వీటిని తెలుగువాళ్లు బత్తాయి పళ్లన్నారు. మనవాళ్లు బత్తాయిల్ని, మహారాష్ట్రులు కమలాల్ని వ్యాప్తిలోకి తెచ్చారు. ఇవి తియ్యని రసం కలిగినవి కాబట్టి వాటిని తీపి ఫలాలుగానే వాడుకుంటున్నాం.

పులుపు రుచి గల ఈ సిట్రస్ ఫలాలతో వంటకాన్ని క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో వివరించాడు. నిమ్మ, నారింజ, పంపర పనస, దబ్బ, గజనిమ్మ, మాదీఫలం... ఇవన్నీ పుల్లని రసం కలిగిన సిట్రస్ ఫలాలు. వీటితో పచ్చడి చేసుకునే విధానాన్ని ఈ శ్లోకంలో క్షేమశర్మ తెలిపాడు.

నారింజ పానీయం ఇలా...

నారింజకాయ తొనలు వలిచి, పైన పీచు తీసేసి, లోపల ముత్యాలుతో సహా రసాన్ని గింజలు లేకుండా ఒక గాజు పాత్రలోకి తీసుకోండి. అందులో తగినంత మిరియాల పొడి, ఉప్పు కలిపిన నారింజ పానీయం కమ్మగా ఉంటుంది. ఇది 'చంద్రుణ్ణి మింగిన రాహువులా రోగాల్ని మింగేస్తుంద'న్నాడు క్షేమశర్మ.

'నారంగం తువరం రుచ్యం సుగంధమతి చారు ఇమ్! వాతఘ్నం కఫదం కించిత్పిత్తఘ్నం విశదమ్ స్మృతమ్'... ఈ పానీయం రోజూ తాగితే నోటికి రుచి తెలుస్తుంది. అన్నహితవు కలుగుతుంది. వాతవ్యాధులన్నిటిలోనూ ఔషధంగా పనిచేసి, త్వరగా తగ్గేలా చేస్తుంది. కొంచెం కఫాన్ని పెంచుతుంది. కానీ, వేడిని బాగా తగ్గిస్తుంది. సాధారణంగా వాతాన్ని తగ్గించే ద్రవ్యాలు వేడి చేసే స్వభావం కలిగి ఉంటాయి. నారింజ పానీయం వేడిని, వాతాన్ని కూడా తగ్గిస్తుంది. జీర్ణశక్తిని బాగు చేస్తుంది. సుగంధభరితంగా ఉంటుంది. శరీరంలో నీటిని లాగేస్తుంది. నీరు పట్టి వచ్చే జబ్బు (ఎడీమా) ఉన్నవారికి ఇది మంచి ఔషధం.

నారింజ పచ్చడి...

ఒక బాండీలో కొద్దిగా నూనె తీసుకుని, ఎండు మిరపకాయలు, తాలింపు గింజలు, కాసిని మెంతులతో సహా వేగించి, మిక్సీ పట్టాలి. అందులో నారింజ రసం, తగినంత ఉప్పు వేసి, కొత్తిమీరతో అలంకరిస్తే అదే నారింజ పచ్చడి. నిమ్మ రసంతోనూ, దబ్బ లేదా పంపరపనస రసాలతో కూడా ఇలా పచ్చడి చేసుకోవచ్చు. ఇది అన్నంలోకి ఆదరవుగానూ, టిఫిన్లలో చట్నీగా కూడా బాగుంటుంది.

నారింజ పులిహోర...

చక్కగా వండిన అన్నం చల్లారిన తరువాత నారింజ రసం కలిపి, తాలింపు పెడితే కమ్మని పులిహోర తయారవుతుంది. చింతపండుకి బదులు నారింజ రసం ఎక్కువ ఆరోగ్యదాయకం. ఇందులో కొద్దిగా ఆవపిండి కలుపుకుంటే ఈ పులిహోర ఇంకా రుచికరంగా ఉంటుంది. నిమ్మ, దబ్బ, పంపర పనస, గజనిమ్మ లాంటి సిట్రస్ ఫలాలన్నింటితోనూ పులిహోర తయారు చేసుకోవచ్చు.

నారింజ పప్పు...

కందిపప్పు, పెసరపప్పు, మినప్పప్పు, శనగపప్పు, ఎర్ర కందిపప్పు (మసూరిపప్పు)... ఈ ఐదింటినీ సమానంగా తీసుకుని, విడివిడిగా దోరగా వేయించి, అన్నీ



కలిపి గుజ్జులా ఉడికించాలి. కొంచెం చల్లారాక అందులో నారింజ రసం తగినంత కలిపి, తాలింపు పెట్టిన ముద్దపప్పు కమ్మగా ఉంటుంది. ఇది అమిత బలకరం.

నారింజలో పొటాషియం, భాస్వరం, మెగ్నీషియం కాల్షియం, ఇనుము ఉప్పు కూడా తగినంత ఉన్నాయి. 'సి, బి' విటమిన్లూ పుష్కలం. ఒకప్పుడు నారింజ వాడకమే ఎక్కువ. తరువాత తీపి సిట్రస్ ఫలాలు అందుబాటులోకి వచ్చి, నారింజ వాడకం తగ్గిపోయింది. అందువల్ల వాణిజ్య పరంగా గిట్టుబాటు కాకపోవటంతో నారింజను పండించటం కూడా తగ్గిపోయింది.

• గంగరాజు అరుణాదేవి

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శనివారం • 20 జనవరి 2024
cinema@andhrajyothy.com

బాధపెట్టాం... క్షమించండి



నయనతార

నయనతార 'అన్నపూరణి' వివాదం ఇంకా సద్దుమణగలేదు. కథ రీత్యా ఇందులోని కొన్ని సన్నివేశాలు మత విశ్వాసాలను భంగపరిచేలా వున్నాయంటూ పలువురు అభ్యంతరాలు వెలిబుచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంపై నయన్‌తో సహా చిత్రబృందంపై మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్, ముంబయ్‌ల్లో ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి . దీంతో చిత్ర నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ ఈ సినిమాను ఓటీటీ స్ట్రీమింగ్ నుంచి తొలగించడంతోపాటు వివరణ కూడా ఇచ్చుకుంది. ఇదిలా వుంటే.. రీసెంట్‌గా 'అన్నపూరణి' వ్యవహారంపై నయనతార భావోద్వేగపూరితంగా సోషల్ మీడియా ద్వారా ఓ లేఖను విడుదల చేశారు. 'బరువెక్కిన హృదయంతో ఈ లెటర్‌ను రాస్తున్నాను. నిజానికి 'అన్నపూరణి ' మంచి ప్రయత్నం. ఓ మంచి ఆలోచన ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉద్దేశ్యంతో ఈ సినిమా చేశాం. సంకల్పం గట్టిదైతే ఏదైనా సాధించవచ్చు అనే మంచి విషయాన్ని ఈ సినిమా ద్వారా చర్చించాం. కానీ ఈ ప్రయత్నంలో తెలీకుండానే కొందరి మనసుల్ని బాధపెట్టాం. ఇది ఉద్దేశ్యపూర్వకంగా జరిగింది కాదు. మనోభావాలు దెబ్బతీయడం మా అభిమతం కాదు. నా 20 ఏళ్ల కెరీర్‌లో ఎవరినీ బాధపెట్టలేదు. సానుకూలంగానే ముందుకెళ్లాను. సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చిన సినిమాను ఓటీటీ నుంచి తొలిగిస్తారని అనుకోలేదు. తెలిసో తెలియకో కొందరిని బాధపెట్టాం. క్షమించమని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాం' అంటూ సోషల్ మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు నయనతార. ఇక 'అన్నపూరణి' కథ విషయానికొస్తే.. 'అగ్నిహోత్రం లాంటి సంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఓ అమ్మాయి, చెఫ్ కావాలనే తన కోరికను ఎలా సాకారం చేసుకుంది? అనే ప్రశ్నకు సమాధానంగా ఈ సినిమా రూపొందింది. నయనతార టైటిల్‌రోల్ పోషించిన ఈ చిత్రంలో సత్యరాజ్, జై కీలక పాత్రలు పోషించారు. నీలేశ్ కృష్ణ దర్శకుడు.

బుక్ మై షోకు ఫిర్యాదు చేశాం



నాగవంశీ

'కొంతమంది కావాలనే బుక్ మైషోలో నకిలీ రివ్యూలు ఇచ్చి, 'గుంటూరు కారం' సినిమాను దెబ్బతీయాలని చూశారు. దానిపై ఆ సంస్థకు ఫిర్యాదు చేశాం. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'గుంటూరు కారం' విజయాన్ని అడ్డుకోవాలని కొందరు మొదటి రోజు నుంచే 'సినిమా బాగోలేదని సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేశారు. కానీ వారి ప్రయత్నాలు ఫలించలేదని చెప్పడానికి మా సినిమాకు వస్తున్న వసూళ్లే నిదర్శనం. ఆ విషయం చెప్పడానికే మీడియా ముందుకొచ్చాను' అని నిర్మాత నాగవంశీ అన్నారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. తొలి వారాంతానికే రూ. 200 కోట్ల వసూళ్లను సాధించి బాక్సాఫీసు దగ్గర నిలకడగా కొనసాగుతోందని. నాగవంశీ మీడియాతో ఆనందం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

● మహేశ్‌బాబు మొదట్నుంచి ఈ సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నారు. నెగెటివ్ రివ్యూలు వచ్చినా ఆయన ఆందోళన చెందలేదు. 'రేపటి నుంచి 'గుంటూరు కారం' వసూళ్లు ఎలా ఉంటాయో చూడండి' అన్నారు. ఆయన అంచనాలే నిజమయ్యాయి. మహేశ్ ధైర్యమే ఈ స్థాయి వసూళ్లకు కారణమైందనుకుంటున్నాను.

● 'గుంటూరుకారం' సినిమా కొంతమంది మీడియా వాళ్లకు లక్ష్యంగా మారింది. డిస్ట్రిబ్యూటర్లకు, థియేటర్లకు ఫోన్ చేసి మరీ వసూళ్ల గురించి ఆరా తీస్తున్నారు. వాళ్లు ఎన్ని విధాలా ప్రయత్నించినా, నెగెటివ్ రివ్యూలు ఇచ్చినా సినిమా ఫలితాన్ని దెబ్బతీయలేకపోయారు. రిలీజైన తొలి రోజే సోషల్ మీడియా ద్వారా సినిమా బాగోలేదనే ప్రచారాన్ని మొదలుపెట్టారు. కానీ సినిమా బాగుండడంతో ప్రేక్షకులు వాటన్నింటినీ పక్కనపెట్టి అఖండ విజయాన్ని అందించారు. కుటుంబ ప్రేక్షకులకు మా సినిమా బాగా నచ్చడం వల్లే ఈ స్థాయి వసూళ్లు వస్తున్నాయి. గతంలో మా బేనర్‌లో వచ్చిన చిత్రాలకు నెగెటివ్ రివ్యూ వచ్చినప్పుడు వసూళ్లు పడిపోయాయి. కానీ ఈ సారి మాత్రం వాటితో సంబంధం లేకుండా 'గుంటూరు కారం' భారీ వసూళ్ల దిశగా సాగుతోంది. కొందరు కావాలనే మా సినిమాను టార్గెట్ చేశారనే అభిప్రాయం ఉంది.

● దీనిని ఫ్యామిలీ సినిమాగా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లి ఉండాల్సింది. ఇది త్రివిక్రమ్ శైలిలో ఉండే ఫ్యామిలీ సినిమా అని ప్రేక్షకులకు ముందే తెలియజెప్పలేకపోయాం. దీనివల్ల 'గుంటూరు కారం' పక్కా మాస్ ఫిల్మ్ అని అభిమానులు అనుకున్నారు. అందువల్ల మొదట్లో కొంత నిరాశ చెందినా సర్దుకున్నారు.



పుట్టిన రోజు ప్రత్యేక వీడియో

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న పీరియాడిక్ చిత్రం 'మట్కా'. కరుణకుమార్ దర్శకత్వంలో డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో చిత్రీకరణ జరుగుతోంది. వరుణ్‌తేజ్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం మేకర్స్ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ఈ చిత్రంలో గ్యాంబ్లింగ్ మాఫియా అధిపతిగా వరుణ్ కనిపించనున్నారు. వీడియోలో సిగార్ తాగుతూ స్టైలిష్ లుక్‌లో ఆయన ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో నోరా ఫతేహీ, మీనాక్షి చౌదరి హీరోయిన్లు. నవీన్‌చంద్ర, సత్యం రాజేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు.

ఫిల్మ్ ఛాంబర్ మాట నిలబెట్టుకోవాలి

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ

సంక్రాంతి సినిమా వార్ ముగిసింది అనుకునేలోపే రాబోతున్న ఫిబ్రవరి వార్‌కి సంబంధించిన సెగలు అప్పుడే మొదలయ్యాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు ఫిల్మ్‌ఛాంబర్‌కి రాసిన లేఖ.. వార్ మొదలవ్వకముందే వాతావరణం వేడెక్కేలా చేసిందని చెప్పాలి. నిజానికి పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన రవితేజ 'ఈగల్' సినిమా సంక్రాంతికి విడుదలకావాల్సింది. కానీ అప్పటికే నాలుగు సినిమాలు పోటీలో ఉండటం, తద్వారా తలెత్తే థియేటర్ల కొరత.. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని 'ఈగల్'ని ఫిబ్రవరికి వాయిదా వేసుకోవలసిందిగా ఛాంబర్ కోరింది. ఫిబ్రవరిలో సోలో డేట్ వచ్చేలా చూస్తామని ఫిల్మ్ ఛాంబర్ మాటివ్వడంతో.. పీపుల్‌మీడియా సంస్థ 'ఈగల్'ని ఫిబ్రవరి 9కి వాయిదా వేసింది. ఇదిలావుంటే.. ఇప్పుడు అదే తేదీకి రజనీకాంత్ 'లాల్ సలామ్', సందీప్‌కిషన్ 'ఊరి పేరు భైరవకోన' చిత్రాలు విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని సదరు చిత్రాల నిర్మాతలు ప్రకటించారు కూడా. ఈ నేపథ్యంలో 'సోలో డేట్ ఇస్తాం' అని మాటిచ్చిన ఛాంబర్, తన మాటను నిలబెట్టుకోవాలని, తమకు సోలో డేట్ వచ్చేలా సహకరించాలని కోరుతూ ఫిల్మ్‌ఛాంబర్‌కి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లేఖ రాసింది. మరి ఈ విషయంపై ఛాంబర్ ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి. ఇక 'ఈగల్' విషయానికొస్తే రవితేజ కథానాయకుడిగా రూపొందిన ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. అనుపమా పరమేశ్వరన్, కావ్య థాపర్ కథానాయికలు.



శేఖర్ కమ్ముల సినిమాలా...

'కేరింత' ఫేమ్ పార్వతీశం కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. ప్రణీకాన్విక కథానాయిక. వీఎస్ ముఖేశ్ యువ దర్శకత్వంలో అఖిలేశ్ కలారు నిర్మించారు. హర్షవర్ధన్ కీలకపాత్ర పోషించారు. ఈ మూవీ టైటిల్ పోస్టర్‌ను నటుడు శివాజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇది నా మొదటి సినిమా. సరికొత్త కథాంశంతో తెరకెక్కిస్తున్నాం' అన్నారు. చక్కటి ఫ్యామిలీ, లవ్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించామని నిర్మాత చెప్పారు. 'మార్కెట్ మహాలక్ష్మి' సినిమా చూస్తుంటే శేఖర్ కమ్ముల సినిమాలు గుర్తుకొచ్చాయని నిర్మాత బెక్కం వేణుగోపాల్ చెప్పారు.

అది నా అదృష్టం



వీకే నరేశ్

నటుడిగా 50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను అని వీకే నరేశ్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటిస్తూ.. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్లే నటుడిగా సుదీర్ఘ కెరీర్ సాధ్యమైందని చెప్పారు. జీవితాంతం పరిశ్రమకు సేవ చేస్తానని పేర్కొన్నారు. ఊహ తెలిసినప్పటి నుంచి సినిమాల మధ్యనే పెరగడం వల్ల ఇదే తన జీవితం కావాలని కోరుకున్నానని చెప్పారు. తొమ్మిదో ఏట 'పండంటి కాపురం' లాంటి చిత్రంతో బాలనటుడిగా అరంగేట్రం చేయడం, ఎన్టీఆర్ లాంటి గొప్ప నటులతో కలసి పనిచేయడం తన జీవితంలో మర్చిపోలేని అనుభవం అని తెలిపారు. ఒక్క సినిమాలో హీరోగా నటించినా చాలు అనుకున్న తనకు ప్రేక్షకులు ఇంత సుదీర్ఘ సినీ కెరీర్‌ను ఇచ్చారని, వారికి రుణపడి ఉంటానని అన్నారు. నంది పురస్కారాలను అందించకపోవడంపై నరేశ్ స్పందిస్తూ 'నంది పురస్కారాలను చిత్ర పరిశ్రమలో చాలా గౌరవంగా, ఒక గుర్తింపుగా భావిస్తారు. కానీ ఇప్పుడు ఆ పురస్కారాలను ప్రభుత్వాలు అందజేయకపోవడం చాలా బాధాకరం. దీనివల్ల ఒక తరం నటీనటులకు అసలు నంది పురస్కారాలు అంటే తెలిసే అవకాశం కూడా లేకుండా పోతుంది. నంది పురస్కారాలు ఇచ్చే సంప్రదాయాన్ని ప్రభుత్వాలు మళ్లీ పునరుద్ధరించాలి' అని కోరారు. 'సేవాభావంతోనే నేను రాజకీయాల్లోకి వెళ్లాను, కానీ అక్కడ మారిన పరిస్థితుల్లో ఇమడలేక బయటకు వచ్చాను, మళ్లీ ఆ వైపు వెళ్లే ఆలోచన ప్రస్తుతానికైతే లేదు' అని నరేశ్ తెలిపారు. రాజమౌళి, మహేశ్‌బాబు కాంబినేషన్‌లో రూపొందే సినిమా తెలుగు పరిశ్రమ ఖ్యాతిని మరో స్థాయికి తీసుకెళుతుందని చెప్పారు. నటుడిగా తనని తాను కొత్త కోణంలో ఆవిష్కరించుకొనే పాత్రలు మరిన్ని వస్తున్నాయనీ, నెగెటివ్ రోల్స్ చేయాలనుందని ఆయన చెప్పారు.

వేసవిలో ఎగిరే పతంగ్



గాలి పటాల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. ప్రణవ్, వంశీ పూజిత్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో గాయకుడు ఎస్పీ చరణ్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రం పోస్టర్ విడుదల చేశారు. హీరోలిద్దరూ గాలి పటాలు ఎగరేస్తూ పోటీ పడుతుంటే హీరోయిన్ వారిని చూస్తూ నవ్వుకుంటున్న ఈ పోస్టర్ అందరినీ ఆకర్షిస్తోంది. ఈ సందర్భంగా నిర్మాతలు విజయ్‌శేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి మాట్లాడుతూ 'సికిందరాబాద్ బస్తీ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న యూత్‌ఫుల్ ఫిల్మ్ ఇది. సినిమాలో ప్రతి సన్నివేశం సహజంగా ఉంటుంది' అని తెలిపారు.

పాటల పొట్టేల్



యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా రూపొందిన చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకుడు. నిశాంక్‌రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగే నిర్మాతలు. త్వరలో సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా 'నగిరో..' అంటూ సాగే ఈ సినిమాలోని తొలి పాటను శుక్రవారం చిత్రబృందం విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ రాయగా, శేఖర్‌చంద్ర స్వరపరిచిన ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని చిత్రబృందం తెలిపింది. గాయనీగాయకులైన అనురాగ్ కులకర్ణి, ఆర్.లాలస గానం శ్రోతల్ని మెస్మరైజ్ చేయడం ఖాయమని, విజువల్ పరంగా కూడా ఈ పాట అద్భుతంగా ఉంటుందని, యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్లల కెమిస్ట్రీ చూడముచ్చటగా ఉంటుందని మేకర్స్ చెప్పారు. అజయ్, ప్రియాంక శర్మ, తనస్వీ చౌదరి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మోనిష్ భూపతిరాజు.



మూడు భాషల్లో 'బాబు'

అర్జున్ కల్యాణ్, కుషిత కల్లాపు జంటగా నటించిన చిత్రం 'బాబు'. నంబర్ వన్ బుల్ షీట్ గై అనేది ట్యాగ్‌లైన్. లక్ష్మణ్ వర్మ దర్శకత్వంలో దండు దిలీప్‌కుమార్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. విలాసం కంటే అవసరం గొప్పది అనే కథాంశంతో రూపుదిద్దుకున్న చిత్రం ఇదనీ, ఫ్యామిలీ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని సిద్ధమైన ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో రూపుదిద్దుకొన్న ఈ చిత్రంలో ఎంఎల్ఆర్, సోనాలి, మురళీధర్ గౌడ్, భద్రం, జబర్దస్త్ అప్పారావు, రవివర్మ, సునీత, మనోహర్, అశోక్‌వర్ధన్, భద్రి జార్జి ఇతర ముఖ్య తారాగణం. సంగీతం:: పవన్, ఛాయాగ్రహణం: పీఎస్ మణికర్ణన్, ఎడిటింగ్: డి.వెంకటప్రభు.

ఒకటే షాట్.. 105 మినిట్స్!



హన్సిక హీరోయిన్‌గా నటించిన చిత్రం '105 మినిట్స్' ఈ నెల 26న విడుదల కానుంది. రాజు దుస్సా దర్శకత్వంలో బొమ్మక్ శివ నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. సినిమాలో పోషించిన పాత్ర గెటప్‌లోనే హన్సిక వేదికపైకి వచ్చి ట్రైలర్‌ను విడుదల చేయడం విశేషం. ఒకే పాత్రతో, ఒకటే షాట్‌లో చిత్రీకరించిన తొలి ప్రయోగాత్మక చిత్రం ఇది. ఈ సందర్భంగా చిత్రం కో ప్రొడ్యూసర్ సుమన్ మాట్లాడుతూ 'ఇలాంటి సినిమా తీయడానికి నిర్మాతకు గట్స్ కావాలి. అందుకే నిర్మాత బొమ్మక్ శివను అభినందిస్తున్నాను. మంచి కంటెంట్ ఉన్న ఈ చిత్రాన్ని మొదట తెలుగులో ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసి, తర్వాత మిగిలిన భాషల్లో రిలీజ్ చేస్తాం' అని చెప్పారు. 'నన్ను నమ్మి ఈ అవకాశం ఇచ్చిన నిర్మాతకు కృతజ్ఞతలు. ఈ కథ విని హన్సికగారు అంగీకరిస్తారా లేదా అనే అనుమానం ఉండేది. కానీ ఆమె సింగిల్ సిట్టింగ్‌లో ఓకే చేశారు. మాంక్ ఫిల్మ్స్ సుమన్‌గారు ఈ సినిమా విడుదల చేస్తున్నందుకు ఆనందంగా ఉంది' అన్నారు దర్శకుడు రాజు దుస్సా. హీరోయిన్ హన్సిక మాట్లాడుతూ 'ఇది కంప్లీట్ ఎక్స్‌పెరిమెంటల్ ఫిల్మ్. ఈ సినిమాకు నన్ను ఎన్నుకోవడం చాలా ఆనందంగా ఉంది' అన్నారు.

స్పోర్ట్స్

హైదరాబాద్ ● శనివారం 20 జనవరి 2024

శుభారంభం దక్కాలని..

బంగ్లాదేశ్‌తో భారత్ పోరు నేడు
అండర్-19 వరల్డ్‌కప్
మ. 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

బ్లూమ్‌ఫోంటీన్: అండర్-19 వరల్డ్‌కప్ చరిత్రలోనే విజయవంతమైన జట్టుగా పేరు తెచ్చుకున్న యువ భారత్ ఆరో టైటిల్ కోసం బరిలోకి దిగుతోంది. శనివారం గ్రూప్ 'ఎ'లో బంగ్లాదేశ్‌తో జట్టుతో తమ తొలి మ్యాచ్‌ను ఆడనుంది. జట్టుకు ఉదయ్ సహరన్ కెప్టెన్సీ వహిస్తుండగా.. ఇటీవలి అండర్-19 ఆసియాకప్ సెమీస్‌లో బంగ్లా చేతిలోనే భారత కుర్రాళ్లకు ఓటమి ఎదురైంది. దీంతో ఈసారి ఆ జట్టును తేలిగ్గా తీసుకుంటే మరో భంగపాటు తప్పదు. గత మూడు మ్యాచ్‌ల్లో ఓ సెంచరీ, రెండు హాఫ్‌సెంచరీలతో ఉదయ్ ఫామ్‌లో ఉండడం కలిసిరానుంది. అలాగే తెలంగాణ క్రికెటర్ అవనీశ్ తొలిసారి ఈ భారీ టోర్నీలో సత్తా చాటాలనుకుంటున్నాడు. ఆల్‌రౌండర్ ముషీర్ ఖాన్, బ్యాటర్ అర్షిన్ కులకర్ణి కీలకం కానున్నారు. ఇక, ఇదేరోజు గ్రూప్ 'బి'లో స్కాట్లాండ్-ఇంగ్లండ్ మధ్య, గ్రూప్ 'డి'లో పాక్-అఫ్ఘాన్ జట్ల మధ్య మ్యాచ్‌లుంటాయి. ఇక, గురువారం జరిగిన ప్రారంభ మ్యాచ్‌ల్లో ఐర్లాండ్ 7 వికెట్లతో అమెరికాపై.. గ్రూప్ 'బి'లో దక్షిణాఫ్రికా 31 పరుగులతో విండీస్‌పై నెగ్గాయి.

అయ్యో.. అమ్మాయిలు!

భారత్ ఒలింపిక్ ఆశలు ఆవిరి



- మూడోస్థానం పోరులో జపాన్ చేతిలో ఓటమి
- హాకీ ఒలింపిక్ క్వాలిఫయర్స్ చాంపియన్ జర్మనీ

రాంచీ: ఈ ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో భారత మహిళల హాకీ జట్టు విఫలమైంది. క్రితంసారి టోక్యో విశ్వక్రీడల్లో సెమీస్ వరకు చేరి అందరి అభిమానాన్ని చూరగొన్న జట్టు ఈసారి బెర్త్ కోసం స్వదేశీ అనుకూలతను కూడా సొమ్ము చేసుకోలేకపోయింది. శుక్రవారం మూడు-నాలుగు స్థానాల కోసం జపాన్‌తో జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో సవిత సారథ్యంలోని భారత జట్టు 0-1 తేడాతో ఓడి నిరాశపరిచింది. ఇందులో కచ్చితంగా గెలిస్తేనే భారత్ బెర్త్ దక్కించుకునేది. తాజా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకే ఒలింపిక్స్‌లో చోటు లభిస్తుంది. ఫైనల్‌కు చేరడంతో జర్మనీ, అమెరికా జట్లు ఇప్పటికే అర్హత సాధించగా.. వీటి సరసన మూడోస్థానంలో నిలిచిన జపాన్ చేరింది. ఇక, మ్యాచ్‌లో నమోదైన ఏకైక గోల్‌ను జపాన్ తొలి క్వార్టర్‌లోనే సాధించి, అదే ఆధిక్యాన్ని చివరికంటా కొనసాగించింది. అటు భారత్‌కు తొమ్మిది పెనాల్టీ కార్నర్లు లభించినా ఏమాత్రం ఫలితం లేకపోయింది. పీసీలను గోల్స్‌గా మలచడంలో తమ బలహీనతను మరోసారి చాటుకుని మూల్యం చెల్లించుకుంది. గురువారం జరిగిన సెమీస్‌లో భారత జట్టు షూటవుట్ ద్వారా జర్మనీ చేతిలో 3-4తో ఓడిన విషయం తెలిసిందే. కాగా, శుక్రవారమే జరిగిన ఫైనల్లో జర్మనీ 2-0తో అమెరికాను ఓడించి చాంపియన్‌గా నిలిచింది. 2016 తర్వాత ఒలింపిక్స్‌లో భారత్ చోటు దక్కించుకోకపోవడం ఇదే ప్రథమం. 2021 గేమ్స్‌లో అత్యుత్తమంగా నాలుగోస్థానంలో నిలిచింది.



గేమ్స్‌ను ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

ఒలింపిక్స్ నిర్వహిస్తాం

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభ వేడుకలో ప్రధాని మోదీ

చెన్నై: భారత్‌లో యూత్ ఒలింపిక్స్ (2029), ఒలింపిక్స్ (2036) నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను శుక్రవారం ఇక్కడ ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. 'ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్‌ను ఈ క్రీడలు ప్రతిబింబిస్తున్నాయి. యూత్ గేమ్స్ ద్వారా 2024 క్రీడా ఏడాదికి స్వాగతం పలుకుతున్నాం. గత పదేళ్లలో దేశ క్రీడారంగంలో ఎంతో అభ్యున్నతిని సాధించాం. రాబోయే రోజుల్లో భారత క్రీడా రంగ పరిశ్రమ విలువ రూ. లక్ష కోట్లకు చేరే చాన్సుంది. ప్రపంచంలోనే అతిపెద్ద టోర్నీ ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నాం. 2029 యూత్ ఒలింపిక్స్‌తో పాటు 2036లో జరిగే విశ్వక్రీడల నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నాం' అని అన్నారు. తమిళనాడును దేశ క్రీడాకేంద్రం దిశగా అభివృద్ధి చేస్తున్నామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్ రవి, కేంద్ర క్రీడాశాఖ మంత్రి ఠాకూర్, రాష్ట్ర క్రీడల మంత్రి ఉదయనిధి స్టాలిన్ పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ ఉపాధ్యక్షులుగా సత్యం, సంజీవ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఆర్చరీ సంఘం ఎన్నికల్లో ఇద్దరు తెలుగు వ్యక్తులకు చోటు లభించింది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఈ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ, తెలంగాణ ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి ఈగ సంజీవ రెడ్డి ఉపాధ్యక్షులుగా గెలిచారు. ఇక, జాతీయ సంఘం అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి అర్జున్ ముండా, ప్రధాన కార్యదర్శిగా వీరేంద్ర సచ్‌దేవ్ ఎన్నికయ్యారు.

ఐదో రౌండ్‌లో హారిక ఓటమి

వీకాన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ చాలెంజర్ విభాగంలో తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక ఐదోరౌండ్‌లో ఓడిపోయింది. భారత్‌కే చెందిన ల్యూక్ మెన్డోన్సా.. హారికపై గెలిచాడు. ఇక మాస్టర్స్ టోర్నీ ఆరో రౌండ్‌లో జీఎం గుకేశ్..జీఎం వాన్ ఫోరీస్ట్‌పై నెగ్గాడు. గుకేశ్‌కిది వరుసగా రెండో విజయం కావడం విశేషం. జీఎం ప్రజ్ఞానంద- నెపోమ్నియాచీతో ఆరో రౌండ్ గేమ్‌ను డ్రా చేశాడు.

స్టార్లు సులువుగా..

ప్రీక్వార్టర్స్‌లో జొకో, సబలెంకా, గాఫ్

ఆస్ట్రేలియన్ ఓపెన్



కొకొ గాఫ్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో శుక్రవారం పురుషులు, మహిళల సింగిల్స్ విభాగాల్లో స్టార్లంతా సునాయాస విజయాలతో ప్రీక్వార్టర్స్‌కు చేరారు. గత రెండు మ్యాచ్‌ల్లో నాలుగు సెట్లపాటు శ్రమకోర్చిన టాప్ సీడ్ జొకోవిచ్ మూడో రౌండ్‌లో 6-3, 6-3, 7-6 (2)తో మార్టిన్ ఎచివెరీపై అలవోకగా నెగ్గాడు. మిగతా సీడెడ్ ఆటగాళ్లలో రుబ్లేవ్ 6-2, 7-6 (6), 6-4తో కోర్దాపై, సిన్నర్ 6-0, 6-1, 6-3తో సెబాస్టియన్‌పై, సిట్సిపాస్ 6-3, 6-0, 6-4తో లుకా వాన్‌పై, డిమినార్ 6-3, 6-3, 6-1తో కొబోలీపై గెలిచి నాలుగో రౌండ్ చేరారు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో డిఫెండింగ్ చాంప్ సబలెంకా 6-0, 6-0తో సురెంకోను, నాలుగో సీడ్ కొకొ గాఫ్ 6-0, 6-2తో అలీసియాను చిత్తుచేయగా, 9వ సీడ్ క్రెజికోవా 4-6, 7-5, 6-4తో హంటర్‌పై, ఆంద్రీవా 1-6, 6-1, 7-6 (5)తో డిన్‌పారీపై నెగ్గి రౌండ్-16లో ప్రవేశించారు. గత రౌండ్‌లో వోజ్నియాకికి షాకిచ్చిన రష్యన్ స్టార్ మరియా తొమఫీవా మూడోరౌండ్‌లో 7-6 (7), 6-3తో పదోసీడ్ మయాను ఓడించింది.

మూడోరౌండ్‌కు బోపన్న జోడీ

భారత వెటరన్ స్టార్ రోహన్ బోపన్న డబుల్స్‌లో తన జోరు కొనసాగిస్తున్నాడు. బోపన్న, మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 6-2, 6-4తో స్థానిక ద్వయం జాన్ మిల్‌మన్/ఎడ్వర్డ్ వింటర్‌పై విజయంతో మూడోరౌండ్‌లో అడుగుపెట్టింది. ఇక భారత్‌కే చెందిన శ్రీరామ్ బాలాజీ/విక్టర్ వ్లాడ్ (రొమేనియా) జంట 6-3, 6-4తో ఇటలీ ద్వయం మాటియో/ఆండ్రియాను ఓడించి రెండోరౌండ్ చేరింది.

సత్తాచాటిన తనయ్, తన్మయ్

పట్టు బిగించిన హైదరాబాద్

హైదరాబాద్: సిక్కింతో రంజీ మ్యాచ్‌లో తొలిరోజే హైదరాబాద్ పట్టుబిగించింది. తనయ్ త్యాగరాజన్ (6/25) ఆరు వికెట్లతో చెలరేగడంతో శుక్రవారం మొదలైన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో సిక్కిం 79 పరుగులకే కుప్పకూలింది. మిలింద్ 4 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ ఆట ఆఖరికి 381/3 స్కోరు చేసింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (137) శతకంతో.. రాహుల్ (83), రోహిత్ (75), తిలక్ వర్మ (70 బ్యాటింగ్) అర్ధ శతకాలతో సత్తా చాటారు.

భళా.. శ్రీజ

డబ్ల్యూటీటీ టైటిల్ కైవసం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రెండుసార్లు జాతీయ చాంపియన్, తెలుగమ్మాయి ఆకుల శ్రీజ కొత్త సీజన్‌ను అద్భుత విజయంతో ప్రారంభించింది. వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) సీనియర్ విభాగంలో శ్రీజ సింగిల్స్ విజేతగా నిలిచి ఈ ఏడాది తొలి అంతర్జాతీయ టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. అమెరికాలోని టెక్సాస్‌లో జరిగిన డబ్ల్యూటీటీ ఫీడర్ కార్పస్ క్రిస్టీ టోర్నమెంట్ ఫైనల్లో శ్రీజ 11-6, 18-16, 11-5తో అమెరికాకు చెందిన లిల్లీ ఝాంగ్‌పై గెలిచింది.

సీజన్‌కు రూ. 500 కోట్లు

టాటాకే ఐపీఎల్ టైటిల్ హక్కులు

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులను తిరిగి టాటా గ్రూప్ దక్కించుకుంది. ఐదేళ్లపాటు (2024-2028) సీజన్‌కు రూ.500 కోట్ల చొప్పున మొత్తంగా రూ.2500 కోట్లను బీసీసీఐకి చెల్లించనుంది. ఆదిత్య బిర్లా గ్రూప్ (ఏబీజీ) మొదట టైటిల్ హక్కుల కోసం పోటీ పడింది. అయితే రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) కార్డు ద్వారా ఏబీజీ వేసిన బిడ్ మొత్తాన్ని తానే చెల్లించేందుకు టాటా గ్రూప్ సిద్ధమైంది. గతంలో చైనా బ్రాండ్ వీవో ఈ హక్కుల నుంచి వైదొలగడంతో టాటా గ్రూప్ 2022, 2023 సీజన్లకు రూ.335 కోట్ల చొప్పున చెల్లించింది. తాజాగా ఈ బిడ్ సీజన్‌కు రూ.165 కోట్ల చొప్పున పెరగడం విశేషం.

టైటాన్స్‌కు మళ్లీ నిరాశే



బెంగళూరు చేతిలో ఓటమి

హైదరాబాద్ అంచె కబడ్డీ పోటీల ప్రారంభ కార్యక్రమంలో టాలీవుడ్ హీరో బాలకృష్ణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈ సీజన్ ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ వైఫల్యం కొనసాగుతోంది. సొంతగడ్డపై అభిమానులను కూడా ఆ జట్టు నిరాశపరిచింది. శుక్రవారం ఇక్కడ గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో మొదలైన హైదరాబాద్ అంచె పోటీల్లో తెలుగు టైటాన్స్ 26-42 స్కోరు తేడాతో బెంగళూరు బుల్స్ చేతిలో చిత్తుగా ఓడింది. టాలీవుడ్ హీరో బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై హైదరాబాద్ అంచె పోటీలను ప్రారంభించారు. ఇక మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 34-31తో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది. ఇప్పటిదాకా తానాడిన మొత్తం 13 మ్యాచుల్లో ఒకే ఒక్క గెలుపందుకున్న టైటాన్స్ కేవలం పది పాయింట్లతో చివరి స్థానంలో నిలిచింది.

సెమీస్‌లో సాత్విక్ జోడీ

సింగిల్స్‌లో ప్రణయ్



న్యూఢిల్లీ: భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి సొంతగడ్డపై జరుగుతున్న ఇండియా ఓపెన్ టోర్నమెంట్‌లో టైటిల్ సాధించే దిశగా సాగుతోంది. శుక్రవారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-7, 21-10తో డెన్మార్క్‌కు చెందిన ఐదోసీడ్, కిమ్ ఆస్ట్రప్-ఆండర్స్ రాసుముస్సెన్ జంటను చిత్తుగా ఓడించి సెమీఫైనల్ చేరింది. ఇక, పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 21-11, 17-21, 21-18తో చైనీస్ తైపీ షట్లర్ వాంగ్ జూ వీపై గెలిచి ఈ టోర్నీలో తొలిసారి సెమీఫైనల్లో ప్రవేశించాడు. ఫైనల్ బెర్త్ కోసం షి యుకి (చైనా)తో ప్రణయ్ తలపడనున్నాడు. ఇక, జియా మిన్ (సింగపూర్)తో జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో 19-21, 0-3తో వెనుకంజలో ఉన్న దశలో డిఫెండింగ్ చాంప్ అన్ సే యంగ్ (కొరియా) రిటైర్డ్ హర్ట్‌తో మ్యాచ్ నుంచి వైదొలగింది. దీంతో జియా సెమీస్ చేరింది.

పంకజ్‌దే స్నూకర్ టైటిల్

ముంబై: పంకజ్ అద్వానీ ఆలిండియా ఓపెన్ స్నూకర్ టైటిల్ గెలుచుకున్నాడు. శుక్రవారం ఇక్కడ జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో పంకజ్ 10-8తో ఇష్‌ప్రీత్‌సింగ్ చద్దాను ఓడించి విజేతగా నిలిచాడు.

రిలయన్స్ లాభం రూ.17,265 కోట్లు

ఆదాయం రూ.2.28 లక్షల కోట్లు.. మందగించిన ఓ2సీ వ్యాపారం

రిటైల్, టెలికాంలో కొనసాగిన జోరు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఏకీకృత నికర లాభం రూ.17,265 కోట్లుగా (ఒక్కో షేరుకు రూ.25.52) నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.15,792 కోట్ల (ఒక్కో షేరుకు రూ.23.19) లాభంతో పోలిస్తే, 9.3 శాతం వృద్ధి కనబర్చింది. సమీక్షా కాలానికి జామ్‌నగర్‌లోని చమురు శుద్ధి ప్లాంట్‌లో షెడ్యూల్డ్ మెయింటెనెన్స్ తనిఖీతో కంపెనీ ప్రధాన ఆదాయ వనరు అయిన ఆయిల్ టు కెమికల్స్ (ఓ2సీ) వ్యాపారం బలహీనపడినప్పటికీ రిటైల్, టెలికాం విభాగాలు జోరు కొనసాగించాయి. కాగా, ఈ క్యూ3లో రిలయన్స్‌కు వ్యాపార కార్యకలాపాల ద్వారా ఆదాయం వార్షిక ప్రాతిపదికన 3.6 శాతం వృద్ధితో రూ.2.28 లక్షల కోట్లకు పెరిగింది. ఈ క్యూ2 (జూలై-సెప్టెంబరు)తో పోలిస్తే, లాభం 0.7 శాతం, ఆదాయం దాదాపు 3 శాతం తగ్గింది. కాగా, ఈ క్యూ3లో కంపెనీ ఎబిటా వార్షిక ప్రాతిపదికన 16.7 శాతం పెరిగి రూ.44,678 కోట్లకు చేరుకుంది. గత ఏడాది సెప్టెంబరు చివరినాటికి కంపెనీ వద్దనున్న నగదు, నగదుకు సమానమైన నిల్వలు రూ.1.78 లక్షల కోట్లుగా ఉండగా.. డిసెంబరు చివరికల్లా రూ.1.92 లక్షల కోట్లకు పెరిగాయి. కంపెనీ నికర అప్పులు కూడా రూ.2.95 లక్షల కోట్ల నుంచి రూ.3.11 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

జియో ప్లాట్‌ఫామ్స్ లాభం రూ.5,445 కోట్లు

రిలయన్స్‌కు చెందిన టెలికాం, డిజిటల్ వ్యాపారాల విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ ఏకీకృత నికర లాభం ఈ క్యూ3లో 11.6 శాతం వృద్ధి చెంది రూ.5,445 కోట్లకు చేరుకుంది. స్థూల ఆదాయం 11.4 శాతం పెరిగి రూ.32,510 కోట్లుగా నమోదైంది. గడిచిన మూడు నెలల్లో రిలయన్స్ జియో వినియోగదారుల నుంచి సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) మాత్రం కేవలం రెండు శాతం పెరుగుదలతో రూ.181.7గా నమోదైంది. క్యూ3లో జియో వినియోగదారులు మరో 1.12 కోట్ల మేర పెరిగి 47.09 కోట్లకు చేరుకున్నారు.

రిటైల్ లాభంలో 31.87 శాతం వృద్ధి

డిసెంబరుతో ముగిసిన మూడు నెలల్లో రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) నికర లాభం 31.87 శాతం పెరిగి రూ.3,165 కోట్లకు చేరుకుంది. వ్యాపార కార్యకలాపాల ద్వారా ఆదాయం 23.75 శాతం వృద్ధితో రూ.74,373 కోట్లుగా నమోదైంది. కిరాణా సరుకులతో పాటు ఫ్యాషన్, లైఫ్‌స్టైల్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ రిటైల్ వ్యాపారాలన్నీ మంచి పనితీరు కనబర్చడం ఇందుకు దోహదపడింది. గడిచిన మూడు నెలల్లో 252 కొత్త స్టోర్లను ప్రారంభించడం జరిగిందని, దాంతో మొత్తం విక్రయ కేంద్రాలు 18,774కు పెరిగాయని కంపెనీ తెలిపింది. అంతేకాదు, గత మూడు నెలల్లో కంపెనీ స్టోర్లను 28.2 కోట్ల మంది సందర్శించారని వెల్లడించింది. డిజిటల్ కామర్స్, న్యూ కామర్స్ వ్యాపారాలు సైతం వేగంగా వృద్ధి చెందుతున్నాయని, ఈ విభాగ ఆదాయంలో ఈ రెండింటి వాటా 19 శాతానికి చేరుకుందని ప్రకటనలో పేర్కొంది.

ఓ2సీ ఆదాయంలో 2.4 శాతం తగ్గుదల

మూడో త్రైమాసికంలో ఆయిల్ రిఫైనింగ్, పెట్రోకెమికల్ (ఓ2సీ) వ్యాపార విభాగ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 2.4 శాతం తగ్గి రూ.1,41,096 కోట్లకు పరిమితం కాగా.. ఎబిటా 1 శాతం వృద్ధితో రూ.14,064 కోట్లుగా నమోదైంది. అయితే, క్యూ2లో నమోదైన రూ.16,281 కోట్ల ఎబిటాతో పోలిస్తే బాగా తగ్గింది.

ఆయిల్ అండ్ గ్యాస్ ఎబిటా రూ.5,804 కోట్లు

సమీక్షా కాలానికి కంపెనీ ఆయిల్ అండ్ గ్యాస్ విభాగ ఎబిటా 50 శాతం వృద్ధితో రూ.5,804 కోట్లకు చేరుకుంది. కేజీ-డీ6 బేసిన్ నుంచి సహజ వాయువు రోజువారీ ఉత్పత్తి 30 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్లకు చేరుకుందని, రోజుకు 21,000 పీపాల చమురు ఉత్పత్తి చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

బిజినెస్



భారత మార్కెట్లోకి రోల్స్-రాయిస్ ఎలక్ట్రిక్ లగ్జరీ కారు స్పెక్టర్

- ప్రారంభ ధర రూ.7.5 కోట్లు
- దేశీయంగా అత్యంత ఖరీదైన ఎలక్ట్రిక్ కారు ఇదే

న్యూఢిల్లీ: బ్రిటిష్ లగ్జరీ కార్ల దిగ్గజం రోల్స్-రాయిస్.. భారత మార్కెట్లోకి తొలి పూర్తి ఎలక్ట్రిక్ లగ్జరీ సెడాన్ కారు స్పెక్టర్ విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.7.5 కోట్లు. దేశీయ మార్కెట్లో అత్యంత ఖరీదైన ఎలక్ట్రిక్ కారు ఇదే. 102 కిలోవాట్ అవర్ (కేడబ్ల్యూహెచ్) బ్యాటరీ ప్యాక్‌తో కూడిన ఈ కారు ఒకసారి చార్జింగ్‌తో 530 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. అంతేకాకుండా కేవలం 4.5 సెకన్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. 195 కేడబ్ల్యూ డీసీ ఫాస్ట్ చార్జర్‌ను ఉపయోగిస్తే 34 నిమిషాల్లో 80 శాతం బ్యాటరీ చార్జింగ్ అవుతుందని రోల్స్-రాయిస్ తెలిపింది. ఈ అల్ట్రా లగ్జరీ కారును భారత్‌లో ప్రిన్సిపల్ డీలర్‌గా ఉన్న సెలెక్ట్ కార్స్ ద్వారా రోల్స్-రాయిస్ విక్రయించనుంది. ప్రపంచంలో శరవేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అగ్రస్థానంలో ఉండటమే కాకుండా మూడో అతిపెద్ద కార్ మార్కెట్‌గా ఉందని సెలెక్ట్ కార్స్ సీఈఓ యదుర్ కపూర్ అన్నారు.

ప్రస్తుతం దేశీయంగా రోల్స్-రాయిస్.. ఫాంథమ్, కలినాన్ ఎస్‌యూవీలను విక్రయిస్తోంది. కాగా ప్రస్తుతం ఈ కార్లను పూర్తిగా యూకే నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, దేశీయంగా భిన్న వర్గాల నుంచి ఈ కార్లకు డిమాండ్ పెరుగుతుండటంతో వెయిటింగ్ పీరియడ్ కనీసం ఆరు నుంచి ఎనిమిది నెలల వరకు ఉంటోందని కపూర్ వెల్లడించారు. స్పెక్టర్ ఎలక్ట్రిక్ కారుకు ఇప్పటికే మంచి ఆర్డర్లు వచ్చాయని, ఈ కారు డెలివరీకి వెయిటింగ్ పీరియడ్ దాదాపు ఏడాది వరకు ఉందని తెలిపారు.

మూడు రోజుల తర్వాత లాభాల్లోకి..

సెన్సెక్స్ 496 పాయింట్లు అప్

ముంబై: వరుసగా మూడు రోజుల పాటు నష్టాలు చవిచూసిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో మళ్లీ లాభాలబాట పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల ట్రెండ్‌తో ఇన్వెస్టర్లు ఆయిల్, మెటల్ సెక్టార్ షేర్లలో కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 496.37 పాయింట్ల లాభంతో 71,683.23 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 160.15 పాయింట్లు పెరిగి 21,622.40 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 25 పుంజుకున్నాయి. ఎయిర్‌టెల్ 3.52 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. కాగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహా సూచీలోని ఇతర బ్యాంకింగ్ షేర్లన్నీ నష్టాల్లో కొనసాగాయి. శుక్రవారం సెషన్‌లో మరో 1.08 శాతం క్షీణించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు గడిచిన ఈ మూడు సెషన్లలో మొత్తం 12.40 శాతం పతనమైంది.

నేడు మార్కెట్లో ట్రేడింగ్

సోమవారం మార్కెట్లకు సెలవు

సాధారణంగా స్టాక్ మార్కెట్లో ప్రతి సోమవారం నుంచి శుక్రవారం వరకు ట్రేడింగ్ జరుగుతుంది. శని, ఆదివారాలు ఎక్స్ఛేంజీలకు సెలవు. కానీ, ఈ శనివారం (జనవరి 20న) కూడా ట్రేడింగ్ నిర్వహించనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ తెలిపాయి. అలాగే, అయోధ్యలో రామ మందిరం ప్రతిష్ఠాపన సందర్భంగా ఈ నెల 22న (సోమవారం) మహారాష్ట్ర సర్కారు సెలవు ప్రకటించిన నేపథ్యం లో ఎక్స్ఛేంజీలు సైతం సెలవు పాటించనున్నాయి. తొలుత ఎక్స్ఛేంజీలు శనివారం ప్రత్యేక ట్రేడింగ్‌ను నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. భారీ అంతరాయాలు లేదా వైఫల్యాలను ఎదుర్కొనే విషయంలో సంసిద్ధతను పరీక్షించుకునేందుకు ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ విభాగాల్లో ఈ ప్రత్యేక ట్రేడింగ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపాయి. రెండు సెషన్లలో (ఉదయం 9.15 గంటల నుంచి పదింటి వరకు ప్రాథమిక సైట్‌లో, 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు డిజాస్టర్ రికవరీ సైట్లో) స్పెషల్ ట్రేడింగ్‌ను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాయి. కానీ 22న సెలవు పాటించాల్సి వస్తుండటంతో శనివారం ప్రత్యేక ట్రేడింగ్‌కు బదులు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు సాధారణ ట్రేడింగ్‌నే నిర్వహించాలని ఎక్స్ఛేంజీలు నిర్ణయించాయి.

ఎయిర్‌లైన్లు, క్యాటరర్లు ఆహార భద్రతా నిబంధనలు పాటించాలి

ఎఫ్‌ఎస్ఎస్ఏఐ

హైదరాబాద్: దేశంలోని విమానయాన సంస్థలు, వాటికి ఆహార పదార్థాలు సరఫరా చేసే క్యాటరర్లు ఆహార భద్రతా నియమాలను పాటించాలని ఫుడ్ రెగ్యులేటర్ ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశించింది. ప్రయాణికులకు సరఫరా చేసే ఆహార పదార్థాలకు తగిన లేబుల్ జత చేయడం ద్వారా వాటి తయారీ గురించిన సవివరమైన సమాచారం అందించాలని సూచించింది. ఎయిర్‌లైన్ క్యాటరింగ్ పరిశ్రమ అనుసరిస్తున్న ఆహార భద్రతా నియమావళిని పరిశీలించి, వాటిని మరింత పెంచడానికి చర్యలు తీసుకోవడం లక్ష్యంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ గత మంగళవారం విమానయాన సంస్థలు, వాటికి ఆహారం సరఫరా చేసే ప్రముఖ క్యాటరర్ల సమావేశం ఏర్పాటు చేసింది. విమాన ప్రయాణికులకు అందించే ఆహారం ఎప్పుడు ఎక్కడ తయారైంది, దాని స్వభావం ఏమిటి అనే వివరాలు అందించడం ద్వారా పారదర్శకత పెంచడం దీని లక్ష్యం.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,950 ▲	57,700 ▲	77,200 ▲
ముంబై	62,390 ▲	57,149 ▲	71,228 ▲

బెంగళూరులో ఇంటెక్స్ ఫార్మింగ్ 2024 ఎక్స్‌పో



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): భారత స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో తయారీ రంగం వాటా రెండింతలు పెరగాలంటే భారతీయ మెషిన్ పరిశ్రమ.. హై ప్రెసిషన్ మెషిన్స్ ఉత్పత్తిని చేపట్టాలని టైటాన్ కంపెనీ ఎండీ సీకే వెంకటరామన్ అన్నారు. శుక్రవారం నాడిక్కడ ఇంటెక్స్ ఫార్మింగ్ 2024, టూల్‌టెక్, వెల్డ్ ఎక్స్‌పోను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి భారత్ 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అంచనా వేస్తున్నారన్నారు. అయితే భారత ఆర్థిక వ్యవస్థ ఈ స్థాయికి చేరుకోవాలంటే అందులో మాన్యుఫ్యాక్చరింగ్ రంగం వాటా లక్ష కోట్ల డాలర్లుగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 50,000 కోట్ల డాలర్లుగా ఉంది. ఈ కార్యక్రమంలో కిర్లోస్కర్ సిస్టమ్స్ లిమిటెడ్ సీఎండీ గీతాంజలి కిర్లోస్కర్, ఇండియన్ మెషిన్ టూల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐఎంటీఎంఏ) రాజేంద్ర రాజమనే పాల్గొన్నారు. ఈ ఎక్స్‌పో ఈ నెల 23 వరకు కొనసాగనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ		విజయవాడ	535
హైదరాబాద్	523	విశాఖపట్నం	550
20 జనవరి		వరంగల్	525
చిత్తూరు	548	దజను గుడ్లు రూ.72	
గోదావరి	535		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	గోదావరి	106
వరంగల్	97	విజయవాడ	106
కరీంనగర్	97	గుంటూరు	107
మహబూబ్‌నగర్	97	ఒంగోలు	107
కర్నూలు	97	చిత్తూరు	103
విశాఖపట్నం	101		

ఎల్ఐసీ నుంచి జీవన్ ధార 2 ప్లాన్



న్యూఢిల్లీ: జీవిత బీమా దిగ్గజం భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) జీవన్ ధార 2 ప్లాన్‌ను మార్కెట్లోకి తెచ్చింది. ఇది వ్యక్తిగత, సేవింగ్స్ డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్. కనీస ఎంట్రీ వయసు 20 సంవత్సరాలు. గరిష్ఠ ఎంట్రీ వయసు 80, 70, 65 సంవత్సరాలు. ప్రారంభం నుంచి యాన్యుటీకి అనుమతిస్తారు. సోమవారం నుంచి ఈ ప్లాన్ విక్రయానికి అందుబాటులో ఉంటుంది. ఈ ప్లాన్ కింద 11 యాన్యుటీ ఆప్షన్లు అందుబాటులో ఉంటాయి. ఎల్ఐసీ చైర్మన్ సిద్ధార్థ మొహంతి దీన్ని ఆవిష్కరించారు. డిఫర్‌మెంట్ సమయంలో జీవిత బీమా కవరేజీ కూడా కల్పిస్తారు. అధిక వయసుకి అధిక యాన్యుటీ రేట్లు వర్తిస్తాయి. రెగ్యులర్ ప్రీమియం, సింగిల్ ప్రీమియం అందుబాటులో ఉంటాయి. డిఫర్‌మెంట్ (పాలసీదారుడు ఎంచుకున్న మేరకు భవిష్యత్తులో బీమా పాలసీ ప్రయోజనాలు అందుకునేందుకు నిర్దేశించుకున్న సమయం) కాలపరిమితి రెగ్యులర్ ప్రీమియంలో 5-15 సంవత్సరాలు. కాగా సింగిల్ ప్రీమియంలో 1-15 సంవత్సరాలు ఉంటుంది. డిఫర్‌మెంట్ సమయంలోను, ఆ తర్వాత కూడా రుణ సదుపాయం అందుబాటులో ఉంటుంది.

● విదేశీ పర్యటనల సందర్భంగా పెట్టుబడులపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్‌లాగే స్పష్టత ఇవ్వడం లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ విమర్శించారు. ఈ రెండు పార్టీల నాయకులు అక్కడ పెట్టుబడులు పెట్టేందుకే వెళ్తున్నారు తప్ప తెలంగాణకు పెట్టుబడులు తేవడానికి కాదని ఆరోపించారు.

ఫైర్ సేఫ్టీ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు ఉత్తిదే

» దుబాయ్ కంపెనీ ఒప్పందంపై గత ప్రభుత్వానిది ప్రచారమే..

» 'న్యాక్' ఆదాయానికి పలు సంస్థల గండి..

అన్నింటిని సరిచేస్తాం: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌తో దుబాయ్ కంపెనీ చేసుకున్న ఒప్పందం ఉత్తిదేనని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశంపై గత ప్రభుత్వం ప్రచారానికే పరిమితమైంది కానీ కార్యరూపం దాల్చలేదని ఆరోపించారు. దుబాయ్‌కు చెందిన నాఫ్కో కంపెనీ, రాష్ట్రంలో ఫైర్ సేఫ్టీ ట్రైనింగ్ అకాడమీని ఏర్పాటు చేస్తున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించిందని, కానీ ఇపుడు అసలు ఆ కంపెనీ ఊసేలేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని చెప్పారు. నేషనల్ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ అకాడమీకి సంబంధించిన భూములను పొందిన కొన్ని సంస్థలు.. వాటిని పూర్తిగా కమర్షియల్ కార్యకలాపాలకు వినియోగిస్తూ, న్యాక్ ఆదాయానికి గండికొడుతున్నాయని చెప్పారు. వాటన్నింటిని గుర్తించి, సరిచేస్తామన్నారు. హైటెక్స్‌లోని న్యాక్‌లో నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాదిలో కనీసం నాలుగుసార్లు నిర్వహించాల్సిన న్యాక్ గవర్నింగ్ బాడీ సమావేశాలను 10 ఏళ్లలో కేవలం ఒక్కసారే జరపడం బాధాకరమన్నారు. రాబోయే రోజుల్లో 9 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మండలాల వారీగా నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటుచేసి, శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పిస్తామని తెలిపారు. కన్‌స్ట్రక్షన్ యూనివర్సిటీ ఏర్పాటు, జిల్లాల్లో స్కిల్ సెంటర్ల ఏర్పాటు, న్యాక్ భూముల్ని కాపాడటం, నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు నిర్వహించాల్సిన కోర్సుల గురించి ఈ సమావేశంలో చర్చించారు. అనంతరం న్యాక్ సముదాయంలోని బిల్డర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన అభినందన సభకు మంత్రి కోమటిరెడ్డి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 10 ఏళ్ల పాటు పోరాడినా తీరని కాంట్రాక్టర్ల సమస్యను 48 గంటల్లోనే పరిష్కరించారని మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తెలంగాణ ఆర్ అండ్ బీ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ ప్రెసిడెంట్ బాలప్రసాద్ తెలిపారు.

మూసీ అభివృద్ధికి బ్రిటన్ సహకారం

(మొదటి పేజీ తరువాయి)



రేవంత్ లండన్‌లో పర్యటించారు. ఆయన వెంట పాతబస్తీకి చెందిన ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ కూడా ఉన్నారు. పర్యటనలో భాగంగా రేవంత్ లండన్ పర్యాటకంలో కీలకమైన థేమ్స్ నదిని సందర్శించారు. రివర్ ఫ్రంట్ అభివృద్ధి, నిర్వహణ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. థేమ్స్ నదీ పాలక మండలి, పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ అధికారులు, నిపుణులతో సుమారు మూడు గంటల పాటు రేవంత్ చర్చలు జరిపారు. దశాబ్దాలుగా థేమ్స్ నదీ తీరం వెంట చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను అక్కడి కార్పొరేట్ ఎఫైర్స్ డైరెక్టర్ సియాన్ పోస్టర్, పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ హెడ్ రాజ్ కెహల్ లీవీ ముఖ్యమంత్రికి వివరించారు. రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో ఎదురైన సవాళ్లు, ఇబ్బందులు, వాటి పరిష్కారాలు, సాంకేతిక సమస్యలు, ఖర్చు, భాగస్వాములైన సంస్థలు, అందంగా తీర్చిదిద్దేందుకు అనుసరించిన అత్యుత్తమ విధానాలను ముఖ్యమంత్రితో చర్చించారు.

మూసీకి పూర్వ వైభవం

నదులు, సరస్సులున్న నగరాలు చారిత్రకంగా అభివృద్ధి చెందాయని, హైదరాబాద్ కూడా అలాంటి ప్రత్యేకత కలిగినదేనని లండన్ అధికారులు రేవంత్‌కు వివరించారు. మూసీ, హుస్సేన్‌సాగర్, ఉస్మాన్ సాగర్‌లను ఆధారంగా చేసుకొని హైదరాబాద్ అభివృద్ధి చెందిందని చెప్పారు. పునరుజ్జీవ ప్రాజెక్టు ద్వారా మూసీకి మంచి నీటితో పూర్వ వైభవం తీసుకువస్తే నదులు, సరస్సులతో హైదరాబాద్ మరింత అందంగా, శక్తివంతంగా తయారవుతుందని రేవంత్ తన విజన్‌ను థేమ్స్ పాలక మండలికి వివరించారు. తన విజన్ 2050లో భాగంగా చేపట్టే మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టు రూపకల్పనపై లండన్ అధికారులతో చర్చించారు. లండన్‌లోని థేమ్స్ నది విషయంలో నది ఒడ్డున అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నదీ సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు థేమ్స్ పాలక వర్గం తెలిపింది. నదీ జలాలను సుస్థిరంగా ఉంచాలని, ఎంచుకున్న ప్రాజెక్టు ద్వారా స్థానికులకు ఎక్కువ ప్రయోజనం ఉండే రెవెన్యూ మోడల్‌ను అనుసరించాలని రేవంత్‌కు సూచించింది. ప్రపంచ వ్యాప్తంగా రూపుదిద్దుకుంటున్న కొత్త విధానాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రాజెక్టు నిర్వహణపై నిరంతర దృష్టి పెట్టాలని చెప్పింది. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టుకు సంబంధించి ఈ నెల 2వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ప్రాథమికంగా చర్చించిన అంశాలను రేవంత్‌రెడ్డి లండన్ అధికారులకు వివరించారు. మూడేళ్లలో మూసీ నదీ పరీవాహక ప్రాంతంలో తొలిదశలో 55 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయాలని ప్రతిపాదించామని చెప్పారు. ప్రాజెక్టులో భాగంగా ఎమ్యూజ్‌మెంట్ పార్క్, జలపాతాలు, జల క్రీడలు, వీధి వ్యాపారులు, వాణిజ్య ప్రాంతం దుకాణ సముదాయాలు ఉంటాయని చెప్పారు.

లండన్ షార్డ్ సందర్శన

బ్రిటన్‌లో కెల్లా అత్యంత ఎత్తయిన భవనం లండన్ షార్డ్‌ను సీఎం రేవంత్, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ కలిసి సందర్శించారు. వెయ్యి అడుగుల ఎత్తున ఉన్న 72వ అంతస్తు నుంచి లండన్ నగరం అందాలను తిలకించారు. అక్కడి నుంచి థేమ్స్ నది అభివృద్ధి ప్రాజెక్టును పరిశీలించారు. నదికి ఉత్తరాన పాత లండన్, దక్షిణాన కొత్త లండన్ అభివృద్ధి చెందిన తీరును అధికారులు వివరించారు.

పెట్టుబడులు రెట్టింపు!

రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన విజయవంతమైంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అధికారులతో కలిసి సీఎం పాల్గొన్నారు. నాలుగు రోజుల్లో 200కి పైగా ప్రముఖ సంస్థల ముఖ్యులతో రేవంత్ సమావేశమయ్యారు. రికార్డు స్థాయిలో రూ.40,232 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదిరాయని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గత ఏడాది దావోస్‌లో తెలంగాణ ప్రభుత్వం సాధించిన పెట్టుబడులకు ఇది రెట్టింపు అని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

రైతులను అండగా నిలవండి

అదానీ గ్రూప్, జేఎస్‌డబ్ల్యూ, వెబ్ వర్క్స్, టాటా టెక్నాలజీస్, బీఎల్ అగ్రో, సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ గ్రూప్ హోల్డింగ్స్, గోడీ ఎనర్జీ, అరజెన్ లైఫ్ సైన్సెస్, ఇన్నోవెరా ఫార్మాస్యూటికల్స్, క్యూ సెంట్రియో, సిస్ట్రా, ఉబర్, ఓ9 సొల్యూషన్స్ తదితర కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి సంసిద్ధతను వ్యక్తం చేశాయి. దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివిధ వేదికలలో మాట్లాడారు. చిన్న మరియు సన్నకారు రైతుల పక్షాన నిలబడాలని ప్రపంచ దిగ్గజ కంపెనీలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను ఆసియా మెడికల్ టూరిజం రాజధానిగా మార్చడానికి హెల్త్ కేర్‌ను సాఫ్ట్‌వేర్‌తో సమ్మిళితం చేయాలన్నారు. ముఖ్యమంత్రితో సమావేశమైన భారతీయ పారిశ్రామిక వేత్తలు, గ్లోబల్ బిజినెస్ లీడర్లందరూ తెలంగాణలో కొత్త ప్రభుత్వం అనుసరించిన వ్యాపార స్నేహ దృక్పథానికి మద్దతు ప్రకటించారు. దావోస్‌కు రావడం, ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన వ్యాపారవేత్తలను కలుసుకోవటం సంతోషంగా ఉందని రేవంత్ అన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమం అందించాలంటే పెట్టుబడులు, వృద్ధిరేటు కలిసి రావాలన్నారు. పారిశ్రామికవేత్తలందరూ హైదరాబాద్‌కు రావాలని ఆహ్వానం పలికారు.

జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు

ప్రభుత్వ భవనాలపై సోలార్ రూఫ్ టాప్ సిస్టం

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

అధికారులతో సమీక్ష.. ప్రతిపాదనలకై ఆదేశాలు



హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న అన్ని జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ(రెడ్‌కో) ఆధ్వర్యంలో అమలవుతున్న సోలార్, విండ్, స్మాల్ హైడ్రో పవర్, చెత్త నుంచి విద్యుత్ తయారీ వంటి కార్యకలాపాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. సోలార్, విండ్, హైడ్రోజన్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల అనుమతుల ఫైళ్లపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ వాహనాలకు చార్జింగ్ సౌకర్యాలు పెంచాల్సిన అవసరం ఉందని భట్టి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ రూఫ్ టాప్ సిస్టం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ప్రాంతాల్లో సేకరించిన చెత్త నుంచి కంప్రెస్డ్ బయో గ్యాస్ విద్యుత్ తయారీ పనులు, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలపై ఆయన ఆరా తీశారు. ఖమ్మం, వరంగల్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లలో బయోగ్యాస్ ప్లాంట్‌ల ఏర్పాటు కోసం పురపాలక శాఖకు ప్రతిపాదనలు పంపించామని రెడ్‌కో వీసీఎండీ జానయ్య ఉపముఖ్యమంత్రికి వివరించారు. గృహ వినియోగదారులకు ఒక కిలో వాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునేందుకు రూ.18 వేల రాయితీని మూడు కిలో వాట్‌ల వరకు ప్రభుత్వం ఇస్తోందని చెప్పారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సోలార్ విద్యుత్‌తో కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలని భట్టి అధికారులకు సూచించారు.

అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి రండి

కేసీఆర్‌కు రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో జరిగే రామమందిర ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌కు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ శుక్రవారం ఆహ్వానం పంపింది. అయితే ఇటీవలే తుంటి ఎముక శస్త్రచికిత్స జరిగినందున కేసీఆర్ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం లేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

శ్రీరాం సాగర్ వరద కాలువకు నిధులివ్వండి

ఉత్తమ్‌కు సీపీఐ లేఖ

శ్రీరాం సాగర్ వరద కాలువ, గౌరవెల్లి జలాశయం పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను కేటాయించాలని ప్రభుత్వాన్ని సీపీఐ కోరింది. ఈ మేరకు జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. నిధుల కొరత వల్ల ఆగిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేస్తే జూన్, జూలైలో నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. వెంటనే నిధులు విడుదల చేసి గౌరవెల్లి, గండిపల్లి, తోటపల్లి లాశయాల పనులను పూర్తి చేయాలని మంత్రిని చాడ కోరారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

టూరిజం కార్పొరేషన్‌లో దశాబ్దాల నుంచి కాంట్రాక్ట్, పొరుగు సేవల కింద పని చేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని చాడ వెంకట రెడ్డి శుక్రవారం పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల గురించి ప్రభుత్వం ఆలోచిస్తోందని, ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి సమాధానమిచ్చారు.

టీఎస్‌పీఎస్సీ పదవులకు తీవ్ర పోటీ

» చైర్మన్, సభ్యుల పోస్టులకు 500కు పైగా దరఖాస్తులు

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పదవులకు తీవ్ర పోటీ ఏర్పడింది. కమిషన్ చైర్మన్, పది మంది సభ్యుల పోస్టులకు దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. ఏకంగా 500కు పైగా దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. చైర్మన్, సభ్యులపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కేసుల భయంతో దరఖాస్తులు తగ్గవచ్చన్న ఊహాగానాలు వెలువడగా.. అందుకు విరుద్ధంగా ప్రభుత్వం కూడా ఊహించని విధంగా అప్లికేషన్లు వచ్చాయి. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైనందున.. టీఎస్‌పీఎస్సీ పనితీరు మారుతుందని, పారదర్శకత ఉంటుందన్న భరోసాతో ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోవడానికి ఉత్సాహం చూపినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీతో టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కమిషన్ సభ్యుల్లో ఒక్కరు మినహా మిగతా సభ్యులు, చైర్మన్ జనార్దన్‌రెడ్డి రాజీనామా చేశారు. వారి స్థానాల్లో తిరిగి చైర్మన్, సభ్యుల నియామకం కోసం ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ నెల 18 సాయంత్రం 5 గంటల వరకు గడువు విధించింది. అధికారులైతే ప్రస్తుతం వారు పనిచేస్తున్న పోస్టు, నియామక తేదీ, రిటైర్‌మెంట్ తేదీ, విద్యార్హతలు వంటి వివరాలను తెలపాలని పేర్కొంది. ప్రముఖ వ్యక్తుల కేటగిరీ కింద విద్య, మేనేజ్‌మెంట్, న్యాయం, సైన్స్ అండ్ టెక్నాలజీ, సోషల్ సైన్స్, హ్యూమానిటీస్ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలని, విద్యార్హతలు కూడా పేర్కొనాలని తెలిపింది. ఆ మేరకు 11 పోస్టులకుగాను అధికారులు, వివిధ రంగాల నిష్ణాతుల నుంచి భారీ స్పందన వచ్చింది. అయితే.. కొంత మంది రెండు పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. కొందరు రెండు మూడుసార్లు దరఖాస్తు చేశారు. మరికొంత మంది ఏ పోస్టు ఇచ్చినా పర్వా లేదన్నట్లుగా దరఖాస్తులో పేర్కొన్నారు. దీంతో నికరంగా ఏ పోస్టుకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయన్నది జీఏడీ అధికారులు శుక్రవారం రాత్రికల్లా తేల్చి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. మొత్తంగా దరఖాస్తుల సంఖ్య 500 దాటవచ్చని భావిస్తున్నారు.

22న సెలవు దినంగా ప్రకటించండి

రాష్ట్ర ప్రభుత్వానికి ఎంపీ బండి సంజయ్ వినతి

ఇల్లందకుంట, హైదరాబాద్, జనవరి 19: అయోధ్య రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో ఈ నెల 22ను రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కోరారు. రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ కోసం యావత్ ప్రపంచం ఎదురుచూస్తోందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దేవాలయాల శుద్ధి చేయాలని ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా ఇల్లందకుంటలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయాన్ని సంజయ్ శుక్రవారం సందర్శించారు. ఆలయ ఆవరణను స్వయంగా శుభ్రం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన సంజయ్.. అయోధ్య రాముని అక్షింతలను రేషన్ బియ్యం అని విమర్శించిన కాంగ్రెస్ నేతలకు బాస్మతి అక్షింతలను తెచ్చి ఇస్తామని కౌంటర్ ఇచ్చారు. కాగా, ఈ నెల 22న రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) రాష్ట్ర దేవాదాయ శాఖను శుక్రవారం కోరింది.

తెలంగాణ ప్రయోజనాలు కాపాడేది బీఆర్ఎస్సే!

» ఉద్యమ కాలంలో, ఆ తర్వాత పదేళ్లలోఢిల్లీలో పోరాడింది పార్టీ ఎంపీలే

» పార్లమెంటులో గులాబీ జెండా లేకపోతే తెలంగాణకు నష్టం: కేటీఆర్

» మెదక్ లోక్‌సభ సన్నాహక సమావేశం



మెదక్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ కాలంలో, ఆ తర్వాత రాష్ట్రం ఏర్పడి అధికారం చేపట్టిన పదేళ్లలో తెలంగాణ ప్రయోజనాల కోసం ఢిల్లీలో పోరాడింది బీఆర్ఎస్ ఎంపీలేనని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు చెప్పారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మెదక్ పార్లమెంటు నియోజకవర్గం బీఆర్ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. దీంట్లో పార్టీ ముఖ్య నేతలు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, కడియం శ్రీహరి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పార్టీ అధినేత కేసీఆర్, హరీశ్‌రావు నాయకత్వంలో క్రియాశీలంగా పనిచేయడం వల్లనే.. గత లోక్‌సభ ఎన్నికల్లో మెదక్‌లో అత్యధిక మెజార్టీ సాధించామని, ఈసారి కూడా గులాబీ జెండా ఎగరటం ఖాయమన్నారు. తెలంగాణ తరుపున గళం విప్పింది బీఆర్ఎస్ ఎంపీలనే విషయం మరచిపోవద్దని, పార్లమెంటులో గులాబీ జెండా లేకుంటే రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం జరుగుతుందన్నారు. ఇదే విషయాన్ని ప్రజలకు చెప్పాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారెంటీలు కాదు.. అవి 420 హామీలని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అడ్డగోలుగా ఇచ్చిన హామీలను అమలు చేయలేక గత ప్రభుత్వంపై ఆరోపణలకు దిగుతున్నారని, అయినప్పటికీ, హామీలను అమలు చేసేదాకా విడిచి పెట్టమన్నారు. 'తెలంగాణ గుల్ల అయిందని గవర్నర్ ప్రసంగంలో అబద్ధాలు మాట్లాడించారు. అందుకే స్వేదపత్రం విడుదల చేశాం. అధికారంలోకి వచ్చాక డిసెంబర్ 9న రుణ మాఫీ చేస్తాం.. రూ.2 లక్షల రుణం తెచ్చుకోండని పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పుడు తుమ్మల నాగేశ్వర్‌రావు రుణాలు వసూలు చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తోంది. ప్రియాంకాగాంధీ నిరుద్యోగ భృతి ఇస్తామని చెబితే, భట్టి విక్రమార్క భృతి ఇస్తామని చెప్పలేదని అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తెస్తామన్నారు. అది వారివల్ల సాధ్యం కాదని మొన్ననే స్పష్టమైంది' అని కేటీఆర్ దుయ్యబట్టారు.

కార్యకర్తల సూచనలను అమలు చేస్తాం: హరీశ్

మెదక్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరుచోట్ల పార్టీ అభ్యర్థులు గెలిచారని, మెదక్ అసెంబ్లీ సీటును తక్కువ ఓట్లతో కోల్పోయామని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఈ ఓటమిని స్వీకరించి మరో గెలుపు కోసం అడుగులు వేద్దామని, కార్యకర్తల సూచనలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయి రెండు ఎమ్మెల్సీల నోటిఫికేషన్లతో వేరు వేరుగా పోలింగ్ జరిగేలా చూశారని హరీశ్‌రావు ఆరోపించారు.

రెక్కలు విప్పిన ఆవిష్కరణలు

» వింగ్స్ ఇండియా-2024లో ఆకట్టుకున్న స్టార్టప్‌లు



ప్రదర్శనలో చిన్న విమానం, ఎక్స్‌పాండబల్ టాయ్‌లెట్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): విమానమే గొప్ప ఆవిష్కరణ అనుకుంటే.. దానిలో ప్రయాణాన్ని మరింత ఆధునికంగా, చాలా సౌకర్యంగా మార్చే ఆవిష్కరణలు వింగ్స్ ఇండియా-2024లో కనువిందు చేస్తున్నాయి. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో నిర్వహిస్తున్న ఈ షో.. అవసరం నుంచే ఆలోచన పుడుతుందని చాటుతోంది.

ఎక్స్‌పాండబల్ ఎయిర్‌క్రాఫ్ట్ టాయ్‌లెట్

విమానాల్లో ఎక్కువసేపు ప్రయాణించాల్సి వస్తే దివ్యాంగులు, ఆరోగ్య సమస్యలున్నవారు, గర్భిణులకు చాలా చిన్నగా ఉండే టాయ్‌లెట్ వాడకం కష్టమే. వీరికోసం సింగపూర్ సంస్థ ఎస్‌టీ ఇంజినీరింగ్ 'ఎక్స్‌పాండబల్ టాయ్‌లెట్'ను ఆవిష్కరించింది. ప్రస్తుత టాయ్‌లెట్‌లతో పోలిస్తే 40% అదనపు స్థలం లభిస్తుంది. దీని తయారీలో జర్మనీలోని ఈటీడబ్ల్యు సంస్థకు భారత్‌లోని వాయు సంస్థ తోడ్పాటు అందించింది. రెండేళ్లలో దీనిని అందుబాటులోకి తెస్తామని ఎస్‌టీ అసిస్టెంట్ ప్రోగ్రామ్ మేనేజర్ లాయిజాన్ తెలిపారు.

మొట్టమొదటి 5సీటర్ ఈ-వీటాల్

మొహాలీకి చెందిన నల్వా ఏరో ప్రైవేట్ లిమిటెడ్ దేశంలోనే మొట్టమొదటి 5 సీటర్ ఈ-వీటాల్‌ను తీర్చిదిద్దింది. నమూనా రూపుదిద్దుకుందని.. నిధులు అందితే తయారీ ప్రారంభిస్తామని సంస్థ సీఈవో కుల్జీత్ సంధు చెప్పారు. శబ్దం, గాలి కాలుష్యం లేని ఈ-వీటాల్.. వర్టికల్‌గా ల్యాండింగ్, టేకాఫ్ అవుతుంది. పూర్తిగా బ్యాటరీ, ప్రొపెల్లర్‌తో పనిచేసే దీని పేటెంట్ కోసం దరఖాస్తు చేశారు. పైలెట్ సహా ఐదుగురు ప్రయాణించవచ్చు. ఒక్కసారి చార్జింగ్‌తో 450 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు.

ఆకాశంలో హైదరాబాద్ 'తార'

హైదరాబాద్‌కు చెందిన తార సంస్థ రూపొందించిన లియో ఎంకె 1 డెక్ ల్యాండింగ్ యూఏవీని ఇప్పటికే విదేశాలు కొనుగోలు చేశాయి. భారత నౌకాదళమూ ఇదే ప్రయత్నాల్లో ఉందట. నిఘాతో పాటుగా యాంటీ డ్రోన్ సిస్టమ్‌గా వాడవచ్చు. దీని పరిధి 35 కిలోమీటర్లు. 50 కిలోమీటర్ల వరకూ పెంచుకోవచ్చని తార సీనియర్ యూఏవీ ఇంజనీర్ సాయి ఆదిత్య వంగ తెలిపారు.

అడ్వాన్స్‌డ్ మొబిలిటీ ఇక్కడే!

హైదరాబాద్‌కు చెందిన ఎయిర్ ఏఆర్‌కె సంస్థ.. ఫ్యూచర్ ఆఫ్ ఎయిర్ మొబిలిటీ అంటూ ముగ్గురు లేదంటే ఐదుగురు ప్రయాణించేలా రూపొందించిన నమూనా ఆకట్టుకుంటోంది. స్నేహితుడు కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి బ్యాటరీతో పనిచేసేలా రూపకల్పన చేశామని కో-ఫౌండర్ బెహరూన్ సాజిల్ షేక్ తెలిపారు. ఈ సంస్థ నాలుగేళ్లగా ఈ ప్రాజెక్ట్‌పై పనిచేస్తోంది. దేశీయంగా అనుమతుల కోసం చూస్తోంది. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ శక్తితో గంటకు 200 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందని వెల్లడించారు. విమాన ఇంజన్, ఇతర యంత్రాల్లో లోపాలను గుర్తించేందుకు ఢిల్లీకి చెందిన ఐటీ కాన్సెప్ట్ సంస్థ ప్రత్యేక పరికరాన్ని అభివృద్ధి చేసింది. దీన్ని పోలీస్, నిఘా వర్గాల వారూ కొనుగోలు చేస్తున్నారని సంస్థ ప్రతినిధి అరవింద్‌కుమార్ తెలిపారు. ప్రముఖ విమానయాన సంస్థ ప్రాట్ అండ్ విట్నీ ఇంధనం పొదుపు చేసే జీటీఎఫ్ ఇంజన్‌ను రూపొందించింది. సున్నిత పరికరాలు, పేలుడు పదార్థాలు, మిస్సైల్, రాకెట్ లాంచర్‌లను భద్రంగా తీసుకెళ్లేందుకు కోయంబత్తూరుకు చెందిన సంస్థ సార్క్ కేస్‌ను తయారుచేసింది. ఆరోగ్య అత్యవసర పరిస్థితి, పరికరాల తరలింపు, రవాణా కోసం అత్యాధునిక హైబ్రిడ్ డ్రోన్ వెహికల్‌ను కెనడాకు చెందిన హొరైజన్ ఎయిర్ క్రాఫ్ట్ సంస్థ రూపొందించింది. విమాన ఇంధనంతో పాటు హైడ్రోజన్‌తో నడిచే ఈ ఎయిర్‌క్రాఫ్ట్‌లో గరిష్ఠంగా గంటకు 450 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించవచ్చు.



వ్యాక్సిన్‌ను విడుదల చేస్తున్న ఐఐఎల్ ఎండీ ఆనంద్‌కుమార్, ఎమ్మెల్యే నాగరాజు, అజయ్‌మిశ్రా తదితరులు

దేశీయ హెపటైటిస్-ఏ వ్యాక్సిన్ వచ్చేసింది

- 'హవిష్యూర్'ను విడుదల చేసిన ఐఐఎల్
- విస్తృతమైన క్లినికల్ ట్రయల్స్ తర్వాత అందుబాటులోకి

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మొట్టమొదటిసారిగా దేశీయంగా అభివృద్ధి చేసిన హెపటైటిస్-ఏ వ్యాక్సిన్ 'హవిష్యూర్'ను ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఇమ్యునాలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) శుక్రవారం విడుదల చేసింది. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన వ్యాక్సిన్ విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగరాజ్ కర్పన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఐఎల్ ఎండీ డాక్టర్ కె ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం హెపటైటిస్-ఏ వ్యాక్సిన్ల కోసం దిగుమతులపై ఆధారపడుతున్నామని, తొలిసారిగా దేశీయంగా వ్యాక్సిన్‌ను తయారు చేశామని తెలిపారు. విస్తృతమైన క్లినికల్ ట్రయల్స్ అనంతరం హవిష్యూర్ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. సాధారణ రోగనిరోధకత (ఇమ్యూనిటీ) ఉన్న పిల్లలకూ ఈ టీకాను సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు. ఇది రెండు మోతాదుల టీకా అని, తొలి మోతాదును 12 నెలల కంటే ఎక్కువ వయసు ఉన్న పిల్లలకు ఇస్తారని, మొదటి డోస్ ఇచ్చిన 6 నెలల తర్వాత రెండో డోస్ ఇస్తారని వివరించారు.

దేవాదాయ భూమిలో రోడ్డు

(మొదటి పేజీ తరవాయి)

అడ్డుకున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుపై గండిపేట మండలం మంచిరేవుల వద్ద చారిత్రక వేణుగోపాల స్వామి ఆలయం ఉంది. ఆలయ భూముల వెనుక ఉన్న ప్రైవేటు విల్లాలకు ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి దారి కోసం మున్సిపాలిటీ అధికారులు రోడ్డు నిర్మాణం చేపడుతుండగా దేవాదాయ శాఖ అధికారులు అడ్డుపడ్డారు. ఇలా అడ్డుకోవడం గత కొద్ది నెలల్లో ఇది రెండోసారి. ఈ రోడ్డుకు నార్సింగ్ మున్సిపాలిటీ నిధులు మంజూరు చేసింది. దేవాలయ స్థలంలో రోడ్డు నిర్మాణం ఎలా చేస్తారంటూ దేవాదాయ శాఖ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దాంతో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం ఈ పనులను అడ్డుకుంది. ఇది బండ్లబాటని, ఈ రోడ్డు వేసుకొనే అధికారం తమకు ఉందని, రోడ్డుకు అనుకూలంగా ఉన్న స్థానికులు దేవాదాయ శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ భూమిని కాపాడుకొనే కార్యక్రమంలో భాగంగా దేవాదాయ శాఖ అధికారులు రోడ్డు పనులను పూర్తిగా నిలిపేశారు. తమ స్థలంలో అక్రమంగా రోడ్డు వేస్తున్నారంటూ రోడ్డు వేస్తున్న వ్యక్తులపై నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరో ఫిర్యాదు కాపీని రాజేంద్రనగర్ డీసీపీకి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు అందించారు. దేవాలయ స్థలానికి పక్కన విల్లాలు ఉండటంతో అందులో ఉండేవారికి సౌకర్యం కోసం ఈ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సరైన రోడ్డు లేకుండా విల్లాల నిర్మాణానికి అనుమతి ఎలా ఇచ్చారని, ఇప్పుడు వారి సౌకర్యం కోసం దేవాదాయ స్థలంలో మున్సిపాలిటీ వారు రోడ్డు ఎలా వేస్తారని ఆలయ అనుకూల వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ స్థలంపై ఇప్పటికే కోర్టులో కేసులు ఉన్నాయని దేవాదాయశాఖ అధికారులు ప్రస్తావించారు. ఈ ఆలయానికి 143 ఎకరాల భూమి ఉండేదని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 2004లో నరసింహాచారి అనే వ్యక్తి హైకోర్టులో రిట్ పిటిషన్ వేసి స్టేటస్ కో తెచ్చుకున్నాడని తెలిపారు. 2017లో ఇదే మధ్యంతర ఉత్తర్వును పొడిగించారని చెప్పారు. ఇప్పుడు ఆలయం భూమిలో రోడ్డు వేయడం అంటే హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వునకు విరుద్ధమే అవుతుందని తెలిపారు. ఇది కోర్టు ధిక్కారం కిందకు వస్తుందని స్పష్టం చేశారు. రోడ్డుకు సంబంధించి బాధితులెవరైనా ఉంటే హైకోర్టుకు వెళ్లి, ఈ కేసులో భాగస్వాములుగా మారి అనుకూల ఉత్తర్వులు తెచ్చుకోవాలని సూచించారు.

కేంద్రం చేతిలో సాగునీటి ప్రాజెక్టులా?

- కేఆర్ఎంబీ పరిధిలోకి సాగర్, శ్రీశైలం వెళ్తే రాష్ట్రానికి నష్టం
- కృష్ణాలో మన వాటా తేల్చకుండా ఎలా తెస్తారు
- ఇది తెలంగాణకు ఆత్మహత్యా సదృశమే: హరీశ్



హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకు జరిగే నష్టాన్ని అర్థం చేసుకోకుండా ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్‌లను కేంద్రం చేతిలో పెడితే ఎలా అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) ద్వారా ఉమ్మడి సాగు నీటి ప్రాజెక్టులను కేంద్రం ఆధీనంలోకి తీసుకు వెళ్తున్నారంటూ వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ రెండు ప్రాజెక్టులనూ కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకురావడం వల్ల తెలంగాణపై ప్రతికూల ప్రభావం పడుతుందని చెప్పారు. ఈ చర్య వల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతుందని, ఆంధ్రప్రదేశ్ లాభపడుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి నీటిపారుదల ప్రాజెక్టులను 2021లో కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకు రావాలని కేంద్రం ప్రతిపాదించిందని, దాన్ని అప్పటి సీఎం కేసీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఆనాడు తమ ప్రభుత్వం కొన్ని షరతులు పెట్టిందని, వాటిని ఇంకా కేంద్రం ఒప్పుకోలేదని గుర్తు చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేలనప్పుడు కేఆర్ఎంబీ పరిధిలోకి ఉమ్మడి ప్రాజెక్టులను ఎలా తెస్తారని ఆయన నిలదీశారు. ౨. శ్రీశైలం నుంచి జల విద్యుత్ ఉత్పత్తి చేసి 264 టీఎంసీల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేయాలని మరో షరతు పెట్టామన్నారు. ఏక పక్షంగా కేఆర్ఎంబీపై నిర్ణయం తీసుకోకుండా అపెక్స్ కమిటీ వేయాలని తాము ఆనాడే కోరామన్నారు. ఆపరేషన్ మాన్యువల్ రూపొందించకుండా కేఆర్ఎంబీ పరిధిలోకి ఎలా తెస్తారని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం గుడ్డిగా కేఆర్ఎంబీ ఏర్పాటుకు ఒప్పుకున్నదని వార్తలు వస్తున్నాయని చెప్పారు. ఉమ్మడి ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి తేస్తే జలవిద్యుత్ ఉత్పత్తిపై తీవ్రప్రభావం పడుతుందని పేర్కొన్నారు.


ఆత్మహత్యా సదృశమే..!

నాగార్జున సాగర్ ఎడమ గట్టు కాలువ ఆయకట్టుపై కూడా కేఆర్ఎంబీ ప్రభావం ఉంటుందని హరీశ్ చెప్పారు. హైదరాబాద్ నగరానికి తాగు నీళ్లకు కూడా కటకట ఏర్పడుతుందని చెప్పారు. కేఆర్ఎంబీలో ఉమ్మడి ప్రాజెక్టులు చేరిస్తే తెలంగాణకు ఆత్మహత్యా సదృశమేనని స్పష్టంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని సూచించారు. రాజకీయం మాని రాష్ట్రానికి జరిగే నష్టం గురించి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని డిమాండ్‌చేశారు. కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నుంచి తక్షణమే నీటిని విడుదల చేసి ఆయకట్టుల పరిధిలోని సాగు పొలాలకు నీరందించాలని డిమాండ్ చేశారు. మేడి గడ్డ బ్యారేజీకి నష్టం కలిగినా నీటిని ఎత్తిపోయడంలో ఇబ్బంది లేదని, ఇప్పటికీ అక్కడ 4 నుంచి 5 వేల క్యూసెక్కుల నీళ్లు ప్రవహిస్తున్నాయని.. దీన్ని దృష్టిలో ఉంచుకొని పంటల సాగుకోసం నీటిని మళ్లించాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు బీఆర్ఎస్ దేనికైనా సిద్ధమని, ప్రభుత్వం స్పందించకుంటే బీఆర్ఎస్ పోరాటం తప్పదని హరీశ్ హెచ్చరించారు.

ప్రాజెక్టులను అప్పగిస్తే కష్టాలే!

నీటి పంపకాలు తేలకుండా అప్పగింతతో నష్టం... పాలమూరు-రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీకి తాళమే!

- జలవిద్యుత్తు ఉత్పాదనపైనా బోర్డుదే నియంత్రణ
- విద్యుత్తుకూ ఇబ్బందులేనని ప్రభుత్వం ఆందోళన



హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు అప్పగిస్తే.. రాష్ట్రానికి కష్టాలు ఎదురవుతాయని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. రెండు ప్రాజెక్టులను నెల రోజుల్లోగా బోర్డుకు అప్పగించాలన్న కేంద్రం ఆదేశాలను తాము అంగీకరించబోమని చెబుతున్నా.. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం అప్పగించాల్సి వస్తే పరిస్థితేంటన్న దానిపై ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. రెండు ప్రాజెక్టులను కృష్ణా బోర్డు స్వాధీనం చేసుకున్నాక.. బచావత్ ట్రిబ్యునల్‌ను అనుసరించి నీటిని విడుదల చేస్తామని కేంద్ర జలశక్తి శాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. లేదంటే.. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర అవగాహన ఒప్పందాన్ని అనుసరించి నీటి విడుదల, నిర్వహణ నిబంధనలు ఉంటాయని పేర్కొంది. కానీ, బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీల కృష్ణా నీటి కేటాయింపులు ఉన్నాయి. 2015 నుంచి రెండు రాష్ట్రాలు ఈ నీటిని ఏయేటికాయేడు తాత్కాలిక ప్రాతిపదికన పంచుకుంటున్నాయి. 811 టీఎంసీలను ఏపీ 66 శాతం, తెలంగాణ 34 శాతంగా వాడుకుంటున్నాయి. కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ నీటి విడుదల ఉత్తర్వులు ఇస్తోంది. అయితే రెండేళ్లుగా నీటి అవసరాలు పెరుగుతుండడంతో తెలంగాణ 50:50 శాతం వాటా కావాలని పట్టుబడుతోంది. ఈ అంశం ఇంకా తేలనే లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రాజెక్టులను బోర్డుకు అప్పగిస్తే నష్టపోవాల్సివస్తుందన్న ఆందోళన నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాలకు నీటి కేటాయింపుల బాధ్యతను కేంద్రం బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు అప్పగించినా.. ఈ విచారణ కొలిక్కి రావడానికి మరో పదేళ్లు పట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదని అధికారులు అంటున్నారు. ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులపై ట్రిబ్యునల్ పదేళ్లపాటు విచారణ జరిపినా ఎటువంటి ఫలితం తేలని విషయాన్ని గుర్తు చేస్తున్నారు. నీటి వాటాలు తేలకుండా బోర్డుకు ప్రాజెక్టులను అప్పగిస్తే.. పాలమూరు-రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతుందన్న ఆందోళనా ఉంది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 90 టీఎంసీల సామర్థ్యంతో చేపడుతుండగా.. దీని నిర్మాణానికి ఇప్పటివరకు ప్రభుత్వం రూ.26,738 కోట్లు ఖర్చు చేసింది. మరో రూ.24 వేల కోట్ల దాకా వెచ్చిస్తే 12.30 లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు వేలాది గ్రామాలకు తాగునీరు అందించవచ్చు. అయితే ఈ ప్రాజెక్టు డీపీఆర్‌కు ఇంకా అనుమతి లభించలేదు. పోలవరం ఖాతాలో లభించిన 45 టీఎంసీలపై ఉమ్మడి ఏపీకే అధికారం ఉందని, తెలంగాణకు ఆ నీరు దక్కాలంటే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరగాల్సి ఉంటుందని సీడబ్ల్యూసీ ఇప్పటికే స్పష్టం చేసింది. 45 టీఎంసీలతో చేపడుతున్న ఎస్ఎల్‌బీసీ పరిస్థితి కూడా అలాగే ఉంది. కృష్ణా బోర్డుకు ప్రాజెక్టులను అప్పగిస్తే.. ఈ ప్రాజెక్టులకు తాళం వేసుకోవాల్సిన పరిస్థితే వస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు జలవిద్యుదుత్పత్తి కూడా కృష్ణా బోర్డు పర్యవేక్షణలోనే జరుగుతుంది. శ్రీశైలం ఎడమగట్టు, నాగార్జునసాగర్ ప్రధాన, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల సామర్థ్యం 1775.6 మెగావాట్లు ఉండగా.. వీటన్నింటిపై తెలంగాణ నియంత్రణ కోల్పోనుంది. ఫలితంగా విద్యుత్తుకు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

ప్రాజెక్టుల అప్పగింతకు తెలుగు రాష్ట్రాలు ఓకే!

సమావేశం మినిట్స్ విడుదల చేసిన కేంద్రం

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బోర్డుకు ఏ ప్రాజెక్టునూ అప్పగించేందుకు తాము అంగీకరించలేదని తెలంగాణ ప్రభుత్వం చెబుతుండగా.. కేంద్రం మాత్రం రెండు తెలుగు రాష్ట్రాలూ ప్రాజెక్టుల అప్పగింతకు అంగీకరించాయని అంటోంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుతోపాటు 15 కాంపోనెంట్లను అప్పగించేందుకు ఈ నెల 17న జరిగిన సమావేశంలో అంగీకారం తెలిపాయని ప్రకటించింది. ఈ మేరకు ఆ సమావేశం తాలూకు మినిట్స్‌ను కేంద్ర జలశక్తి శాఖ శుక్రవారం విడుదల చేసింది. ఈ మినిట్స్ ప్రకారం.. కృష్ణా జలాలు/ప్రాజెక్టుల సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి, ప్రాజెక్టులను తటస్థంగా ఉన్న కృష్ణా బోర్డుకు అప్పగించడానికి రెండు రాష్ట్రాలు అంగీకరించాయని కేంద్రం పేర్కొం ది. రెండు రాష్ట్రాలతోపాటు కృష్ణాబోర్డుకు చెందిన అధికారులు వారం రోజుల్లో చర్చించుకొని, ప్రాజెక్టుల అప్పగింతకు నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలని, నెలరోజుల్లోగా ప్రాజెక్టులను అప్పగించాలని ఆదేశించింది. ప్రాజెక్టుల కట్టలతోపాటు కాంపోనెంట్లపై సీఆర్‌పీఎఫ్ బలగాలు గట్టిగా నిఘా ఉంచాలని, తెలుగు రాష్ట్రాల అధికారులను ప్రాజెక్టులపైకి కృష్ణా బోర్డు అనుమతి తీసుకున్న తర్వాతే అనుమతించాలని తెలిపింది. ప్రాజెక్టుల అప్పగింత పురోగతిపై 15 రోజుల్లో మరోమారు సమావేశం ఉంటుందని పేర్కొంది.

కృష్ణా ప్రాజెక్టులు చేజారొద్దు

(మొదటి పేజీ తరువాయి)

నవంబరు 28కి ముందున్న పరిస్థితిని పునరుద్ధరించాలని కోరింది. ఏపీ మాత్రం కేంద్రం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని, కృష్ణాబోర్డుకు శ్రీశైలం, సాగర్‌తోపాటు 15 కాంపోనెంట్లు అప్పగించాల్సిందేనని డిమాండ్ చేసింది. అయితే తెలంగాణ శాసనసభ ఎన్నికలకు ముందు సాగర్ వివాదం చోటుచేసుకోగా.. రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనలో ఉన్నప్పుడు జలశక్తి శాఖ సమావేశం నిర్వహించింది. ఆ భేటీలో శ్రీశైలం, సాగర్‌లను కృష్ణాబోర్డుకు అప్పగించాల్సిందేనని కేంద్రం ఆదేశించిన నేపథ్యంలో.. లండన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ పరిణామాలపై ఆరా తీశారు. నీటి పంపకాలు తేలేదాకా ప్రాజెక్టుల అప్పగింతకు అంగీకరించరాదని మంత్రి ఉత్తమ్‌ను ఆదేశించారు.

ఏ ప్రాజెక్టునూ అప్పగించం..

ఏ ప్రాజెక్టునూ కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు తాము అంగీకరించలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టులపై సమీక్ష అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టులు అప్పగించాలంటూ కేంద్రం చర్చలు జరిపిందని, కానీ.. తెలంగాణ తరఫున ఎటువంటి సమాధానం చెప్పలేదని అన్నారు. కేంద్రం ఆదేశాలను ఒప్పుకోబోమని, ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేది లేదని స్పష్టం చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టును అప్పగించేందుకు ప్రభుత్వం అంగీకరించిందంటూ కొందరు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అసలు కృష్ణా జలాలపై మాట్లాడే అర్హత మీకు ఉందా? అంటూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావును ఉద్దేశించి ఉత్తమ్ ప్రశ్నించారు. "మీ వల్లే కృష్ణా నీళ్లు తగ్గాయి. శ్రీశైలం బ్యాక్ వాటర్‌పై లిఫ్టులు కడుతుంటే ఎప్పుడైనా మాట్లాడారా? మీరు, మీ పెద్ద మనుషులు, జగన్ అలయ్ బలయ్ చేసుకున్నారు. సంగమేశ్వర ఎత్తిపోతలపై ఒక్క రోజు కూడా మాట్లాడలేదు. మీ హయాంలోనే ఏపీ ప్రాజెక్టుల నిర్మాణం జరిగింది" అని ఉత్తమ్ అన్నారు. ఒక్క ప్రాజెక్టును కూడా బోర్డుకు అప్పగించబోమని ప్రకటించారు.

వ్యవసాయ యాంత్రీకరణ అనివార్యం!

- ఆహార శుద్ధి పరిశ్రమలకు మద్దతివ్వండి..
- జర్మన్ కాన్సులేట్ జనరల్‌తో భేటీలో తుమ్మల



మంత్రి తుమ్మలతో భేటీ అయిన జర్మన్ కాన్సులేట్ జనరల్ మైఖేలా కుచ్లర్

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రీకరణ అమలుచేయటానికి జర్మనీ సహకారం అవసరమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కార్మికుల కొరత, పెరిగిన కూలీ ఖర్చు కారణంగా యాంత్రీకరణ అనివార్యమని పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయంలో జర్మన్ కాన్సులేట్ జనరల్ మైఖేలా కుచ్లర్(చెన్నై), అమిత దేశాయ్(హైదరాబాద్)తో ఆయన భేటీ అయ్యారు. ఇండో-జర్మన్ విత్తనరంగ సహకార ప్రాజెక్టు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ధాన్యం, మొక్కజొన్న ఉత్పత్తి ఎక్కువగా ఉన్నందున.. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను బలోపేతం చేయటానికి సహకరించాలని, వ్యవసాయ, మార్కెటింగ్ వ్యవస్థను ఆధునీకరించటం, కోల్డ్ స్టోరేజీల్లో మౌలిక సదుపాయాల కల్పనలపై సహకరించాలన్నారు. రాజస్థాన్, పంజాబ్ తరహాలో ప్రాజెక్టు చేపట్టాలని కోరారు.ఈ భేటీలో టర్కీ కాన్సులేట్ జనరల్ ఓర్హాన్ యల్మాన్ ఓకాన్ కూడా పాల్గొన్నారు.

వ్యవసాయేతర రుణాలనే వసూలు చేయాలన్నాం

గురువారం నిజామాబాద్ పర్యటన సందర్భంగా.. వ్యవసాయేతర రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని ఎగవేతదారుల నుంచి బకాయిలను వసూలు చేయాలని మాత్రమే తానూ ఆదేశాలు జారీ చేశానని మంత్రి తుమ్మల ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని పత్రికలు రాజకీయ దురుద్దేశంతో ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయని, ఇది సరైంది కాదని హితవు పలికారు. ఓ ప్రముఖ వార్తా పత్రికలో వచ్చిన వార్తను మంత్రి ఖండిస్తూ శుక్రవారం ఈ ప్రకటన విడుదల చేశారు.

నిజామాబాద్ డీసీవోపై విచారణకు ఆదేశం

ధాన్యం సేకరణ ద్వారా సహకార సంఘాల కొనుగోలు కేంద్రాలకు వచ్చిన కమీషన్ డబ్బులపై సమకూరిన వడ్డీని సొంతానికి వాడుకున్నట్లు నిజామాబాద్ జిల్లా సహకార అధికారి సింహాచలంపై వచ్చిన ఫిర్యాదుపై తుమ్మల విచారణకు ఆదేశించారు. రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి, రైతుసంఘం నేత సోమేశ్వర్‌రావు.. శుక్రవారం సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి డీసీవోపై ఫిర్యాదుచేశారు. ఫిర్యాదులపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సహకారశాఖ కమిషనర్‌కు మంత్రి ఆదేశాలు జారీచేశారు.

పైసల కోసమే ప్రాజెక్టుల నిర్మాణం

- కాళేశ్వరం అవినీతి బాధ్యులను వదిలిపెట్టం
- సీతారామ ప్రాజెక్టులోనూ భారీ కుంభకోణం
- ప్రజలను తాకట్టుపెట్టి 2 లక్షల కోట్ల అప్పులు
- అద్భుతాలు చేస్తున్నట్లు భ్రమలు కల్పించారు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న ఉత్తమ్, చిత్రంలో భట్టి, పొంగులేటి, తుమ్మల

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గడిచిన పదేళ్లలో ఏ ప్రాజెక్టూ నీళ్లకోసం కట్టలేదని, పైసల కోసమే కట్టారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. కాళేశ్వరం ఎత్తిపోతలలో అవినీతికి బాధ్యులైన వారిని వదిలిపెట్టేది లేదని, అధికారులతో పాటు అందరిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం సచివాలయంలో సీతారామ ఎత్తిపోతల పథకం పై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మలనాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఉత్తమ్ విలేకర్లతో మాట్లాడారు. కేసీఆర్ కుటుంబసభ్యులు నీళ్లకోసం కాకుండా పైసల కోసమే ప్రాజెక్టులు కట్టినట్లు తేలిందన్నారు. కాళేశ్వరంలో అవినీతిపై విచారణకు సిటింగ్ జడ్జిని నియమించాలని కోరుతూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామన్నారు. ఈ అవినీతిని చూస్తుంటే విచారణ కోసం ఎంత మంది జడ్జిలు కావాలో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. "నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాల్లో అవినీతిని చూసి, ఇలా కూడా చేయొచ్చా అని నిర్ఘాంతపోతున్నా. కేసీఆర్, హరీశ్‌రావు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేశారు. కాళేశ్వరంలో రూ.94 వేల కోట్లు ఖర్చుపెడితే... లక్ష ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదు. పాలమూరు-రంగారెడ్డిలో రూ.27 వేల కోట్లు పెడితే ఒక్క ఎకరాకు కూడా నీళ్లు రాలేదు. సీతారామలో రూ.7 వేల కోట్లు పెట్టినా ఒక్క ఎకరా సాగులోకి రాలేదు" అని ఉత్తమ్ మండిపడ్డారు. మేడిగడ్డ మరమ్మతుల బాధ్యత నిర్మాణ సంస్థదేనని, ఇప్పటికే ఆ సంస్థకు బిల్లులు ఆపేశామని, బ్యాంకు గ్యారంటీలు జప్తు చేశామని వెల్లడించారు. మన జీవితాలు, పిల్లల జీవితాలు తాకట్టుపెట్టి, అధిక వడ్డీకి రూ.2 లక్షల కోట్ల అప్పులు చేశారని దుయ్యబట్టారు. 10.5, 11 శాతం వార్షిక వడ్డీకి రుణాలు తెచ్చారని మండిపడ్డారు. ఈ రుణాలు, అసలు/వడ్డీల చెల్లింపులకే వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.18 వేల కోట్ల అవసరమని తెలిపారు.

పదేళ్లలో ఒక్క దరఖాస్తు చేయలేదు

పదేళ్లల్లో ఒక్క ప్రాజెక్టును కూడా సరైన ఫార్మాట్‌లో జాతీయ హోదా కోసం దరఖాస్తు చేయలేదని ఉత్తమ్ వెల్లడించారు. మహబూబ్‌నగర్ ప్రత్యేకత వివరించిన తర్వాత ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన కింద దరఖాస్తు చేసుకుంటే పాలమూరు-రంగారెడ్డికి 60 శాతం నిధులు ఇవ్వడానికి కేంద్రం అంగీకరించిందని చెప్పారు. సీతారామలో కూడా భారీ కుంభకోణం ఉందని. రాజీవ్ దుమ్ముగూడెం, ఇందిరాసాగర్ వేర్వేరుగా ఉండగా.. దాన్ని కలిపి, వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారన్నారు. రెండుమూడురోజుల్లో సీతారామ పథకాన్ని పరిశీలిస్తామని ఉత్తమ్ ప్రకటించారు.

అంచనాలే తప్పు.. ఆయకట్టు పెరగలేదు: భట్టి

రీ డిజైన్లతో అంచనాలు తప్పు... ఆయకట్టు పెరగలేదని భట్టి మండిపడ్డారు. దుమ్ముగూడెం-రాజీవ్ సాగర్ నిర్మాణ అంచనా వ్యయం రూ.1681 కోట్లు కాగా.. రాష్ట్ర విభజన జరిగే నాటికీ రూ.889 కోట్లు పెట్టారని వివరించారు. ఇందిరాసాగ ర్ నిర్మాణ అంచనా వ్యయం రూ.1824 కోట్లు కాగా 2014నాటికే రూ.1064 కోట్లు ఖర్చుపెట్టారని వివరించారు. ఈ రెండు ప్రాజెక్టులపై రూ.1551 కోట్లు పెడితే... 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని, ఏడు మండలాలు ఏపీకి వెళ్లడంతో 70 వేల ఎకరాలు పోనూ... 3.30 లక్షల ఎకరాల కు నీళ్లు వచ్చేవని ఆయన వివరించారు. రీ డిజైన్ చేసిన , సీతారామ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.13 వేల కోట్లుకాగా.. దానిని రూ.18500 కోట్లకు పెంచేశారని వివరించారు. సీతమ్మ బ్యారేజీ అంచనా వ్యయం రూ.4481 కోట్లకు చేరిందన్నారు. 7 మండలాలు ఏపీకి పోవడంతో శబరి నది పోయిందని ప్రచారం చేశారని, శబరి ఎక్కడికి పోలేదని, కూనవరం దగ్గరే ఉందని భట్టి చెప్పారు.

మేత మిల్లర్లకు.. వాత సర్కారుకు

(మొదటి పేజీ తరువాయి)

చెల్లిస్తుంది. దీనికోసం బ్యాంకుల నుంచి స్వల్ప కాలానికి అప్పు తెస్తుంది. ధాన్యాన్ని మిల్లర్లకు ఇస్తే.. వారు మర ఆడించి భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు అప్పగించాలి. దీనికిగాను ఎఫ్‌సీఐ.. పౌర సరఫరాల సంస్థకు డబ్బు చెల్లిస్తుంది. దానిని బ్యాంకులకు కడుతుంది. మొత్తం ప్రక్రియకు 6 నెలల సమయం ఉంటుంది. ఈ కాలానికి బ్యాంకు అప్పులకు వడ్డీని ఎఫ్‌సీఐ ఇస్తే పౌర సరఫరాల సంస్థ చెల్లిస్తుంది. అయితే, ఎఫ్‌సీఐకి సకాలంలో (6 నెలల లోపుగా) బియ్యం అందిస్తేనే వడ్డీని చెల్లిస్తుంది. గడువు దాటితే మాత్రం వడ్డీ భారం పౌర సరఫరాల సంస్థదే! మిల్లర్లు సకాలంలో బియ్యం ఇవ్వకపోవడంతో ఏటా భారీగా వడ్డీని సొంతంగా చెల్లించాల్సి వస్తోంది. మిల్లింగ్, సీఎంఆర్ నిర్ణీత వ్యవధిలో జరిగితే క్వింటాకు రూ.26 చొప్పున వడ్డీ డబ్బులు రికవరీ అవుతాయి. కానీ, సీఎంఆర్ డెలివరీని ఆర్నెల్లకు మించి మిల్లర్లు ఎంత ఆలస్యం చేసే అంత చేటు జరుగుతుంది. గడువు దాటితే బిల్లులు పెట్టినా వడ్డీ డబ్బులు వస్తాయో రావో తెలియదు.

నెలకు రూ.280 కోట్ల వరకు..

పౌర సరఫరాల సంస్థ ప్రస్తుతం రూ.56,146 కోట్ల అప్పుల్లో ఉంది. దీంతో వడ్డీ భారం అధికమవుతోంది. బ్యాంకులకు 2019-20లో రూ.1,327 కోట్లు, 2020-21లో రూ.1,619 కోట్లు, 2021-22లో రూ.2,101 కోట్లు వడ్డీ కింద చెల్లించింది. 2022-23లో సుమారు రూ.2,400 కోట్లు, 2023-24లో తొమ్మిది నెలలకు రూ.2,520 కోట్ల వడ్డీ కట్టినట్లు తెలిసింది. అంటే.. ఐదేళ్లలో రూ.9,966 కోట్లు. ఇందులో మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ ఇవ్వకపోవడంతో ఏటా 6 నెలల (సగం) వడ్డీని అదనంగా భరించాల్సి వచ్చింది. ఐదేళ్లలో చెల్లించిన వడ్డీలో సగం లెక్కేసినా రూ.4,983 కోట్లను కట్టాల్సి వచ్చింది. కాగా, కార్పొరేషన్ ఆడిట్ ఆలస్యంగా జరుగుతోంది. ప్రస్తుతం 2018-19కు సంబంధించిన ఆడిట్ చేస్తున్నారు. నాలుగైదేళ్ల లెక్కలు కూడా పూర్తయితే వడ్డీ భారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశముంది. ఇప్పుడున్న అప్పుల ప్రకారం ప్రతి నెల సుమారు రూ.250 కోట్ల నుంచి రూ.280 కోట్ల వడ్డీని బ్యాంకులకు చెల్లిస్తోంది. ఆలస్యాన్ని బట్టి ఈ వడ్డీ మోత పెరుగుతుంది.

అప్పులు- వడ్డీల సంగతి అలా ఉంటే.. రాష్ట్రంలో సీఎంఆర్ నత్తనడకన సాగుతుండటంతో టార్గెట్ పూర్తవుతుందా? లేదా? అనే సందేహాలు నెలకొన్నాయి. గతేడాదికి చెందిన రూ.16,405 కోట్ల విలువైన 42 లక్షల టన్నుల బియ్యం ఇంకా మిల్లర్ల వద్దనే ఉంది. దీంతో సంస్థకు రూ.వేల కోట్ల నష్టం వస్తోంది. ఇదంతా చివరకు ప్రభుత్వానికే భారంగా మారుతోంది. మరోవైపు మంత్రి, కమిషనర్ సమీక్ష నిర్వహించినా మిల్లర్లు, డీఎంలు, డీఎస్‌వోలు, అదనపు కలెక్టర్లలో చలనం కలగడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 2,025 రా రైస్ మిల్లులు, 1,007 బాయిల్డ్ మిల్లులున్నాయి. మొత్తం మిల్లింగ్ సామర్థ్యం 98,984 టన్నులు కాగా అందుకు అనుగుణంగా జరగడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం మిల్లర్ల విషయంలో ఉదాసీనత అవలంబించింది. ధాన్యం సేకరణకు బడ్జెట్ నుంచి నిధులు కేటాయించకుండా బ్యాంకు గ్యారెంటీ పత్రాలిచ్చి వదిలేసింది. మరోవైపు టెండర్లు పిలిచిన సమయంలోనే ధాన్యం భారీగా నల్ల బజారుకు తరలిపోయింది. నాటి సర్కారు నిర్లక్ష్యంతో నిర్ణీత వ్యవధిలో ధాన్యాన్ని మిల్లింగ్, డెలివరీ చేయాలనే విషయాన్ని మిల్లర్లు మర్చిపోయారు. ఇష్టమొచ్చినపుడు ఎంతో కొంత ఎఫ్‌సీఐకి ఇస్తూ వచ్చారు. ఈ క్రమంలో మిల్లర్ల వద్ద నిల్వలు భారీగా పెరిగిపోయాయి. నిరుడు రెండు సీజన్లలో కలిపి 132 లక్షల టన్నుల ధాన్యం సేకరించి మిల్లర్లకు అప్పగించారు. వారు 89 లక్షల టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. కానీ, 47 లక్షల టన్నుల ధాన్యమే ఇచ్చారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి కొని మిల్లర్లకు అప్పగించిన ధాన్యంలో 35 లక్షల టన్నులు నల్ల బజారుకు తరలిపోయింది. కొందరు మిల్లర్లు తమిళనాడు, కర్ణాటక, ఏపీలకు అమ్ముకున్నారు. ఇంకొందరు ధాన్యం మిల్లింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేశారు.

సీఎంఆర్ బకాయిలపై కొరడా

- మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు
- ఉమ్మడి నల్లగొండలో రూ.360కోట్ల బకాయిలు

నల్లగొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బకాయిలపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. తొలుత భారీగా బకాయిలున్న మిల్లులను లక్ష్యంగా చేసుకుంది. సీఎంఆర్ బియ్యం వసూలే ఏకైక లక్ష్యంగా పనిచేయాలని పై నుంచి కింది స్థాయి దాకా అధికారులందరికీ దిశానిర్దేశం చేసింది. గతంలో జరిగిన తప్పిదాల వల్ల భారీగా బకాయిపడిన మిల్లుల నుంచి నెమ్మదిగా బకాయిలు వసూలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటిదాకా ఉన్న బకాయిలు వసూలు చేయడంతో పాటు ఇకపై బకాయిలు లేకుండా చేయాలని అధికారులు అన్ని అస్త్రాలను ఉపయోగించేందుకు సిద్ధమవుతున్నారు. పేరుకుపోయిన బకాయిలపై కూడా డీటీసీఎస్ స్థాయి అధికారులకు నోటీసులు జారీకి సిద్ధమవుతున్నారు. రెండ్రోజులుగా సీజన్‌ల వారీగా సీఎంఆర్ వసూలుపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 278 మిల్లులు ఉండగా, ఇందులో సీఎంఆర్‌కు కేటాయించిన 236 మిల్లులున్నాయి. రెండు సీజన్లు కలిపి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.360కోట్ల విలువైన లక్ష టన్నుల మేర సీఎంఆర్ బకాయిలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మిల్లర్ల నుంచి రూ.18 వేల కోట్ల విలువైన బియ్యం రావాల్సి ఉండగా ఇందులో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించి రూ.360 కోట్ల విలువైన బియ్యం నిల్వలున్నాయి. నల్లగొండ జిల్లాలో ఎనిమిది మిల్లుల వద్ద పెద్ద మొత్తంలో సీఎంఆర్ బియ్యం ఉన్నట్లు గుర్తించిన ఉన్నతాధికారుల తనిఖీలకు ఆదేశాలు జారీ చేశారు. మిగిలిన మిల్లర్ల బకాయిల వసూలుకు చర్యలు తీసుకుంటున్నారు. నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి జిల్లాల్లో లక్ష టన్నుల బియ్యం బకాయి ఉన్నట్లు సమాచారం. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం మిల్లులో గత నెల 27, 28 తేదీల్లో తనిఖీలు చేపట్టింది. నల్లగొండ టాస్క్‌ఫోర్స్ పోలీసులు జిల్లాకేంద్రంలోని పెద్ద మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ అధికారులను పిలిపించి మిల్లుల్లో ధాన్యం నిల్వల లెక్కలు తేల్చే పనిలో పడ్డారు. సూర్యాపేట జిల్లాలో ఓ మిల్లర్‌ను టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టుచేశారు. నల్లగొండ జిల్లాలో రెండు మిల్లుల యజమానులపై 409, 420 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నల్లగొండ, హాలియాలో 87వేల టన్నుల ధాన్యం కనిపించడం లేదని పోలీసులకు సివిల్ సప్లయి అధికారులు నివేదించడంతో కేసులు నమోదు చేశారు.

ప్రాణం తీసిన కాలం చెల్లిన ట్యాబ్లెట్

- గడువు తీరిన అజిత్రోమైసిన్ ఇచ్చిన మెడికల్ షాప్ ఓనర్
- వికారాబాద్ జిల్లా పాలెపల్లిలో ఇంటర్ విద్యార్థిని మృతి
- దుకాణదారుతో పాటు ఆర్ఎంపీపై కేసు నమోదు



గత ఆగస్టుతో గడువు తీరిన అజిత్రోమైసిన్ 500ఎంజీ

దోమ, జనవరి 19: సంక్రాంతి సెలవుల్లో కుటుంబంతో సంతోషంగా ఉందామని వచ్చిన ఆ విద్యార్థిని జ్వరం బారినపడింది. ఆర్ఎంపీ వద్ద చూపించుకుని ఆయన ప్రిస్క్రిప్షన్‌తో వెళ్లగా మెడికల్ షాప్ యజమాని కాలం చెల్లిన ట్యాబ్లెట్ ఇచ్చాడు. అది వేసుకున్న విద్యార్థిని కాసేపటికే ప్రాణాలు కోల్పోయింది. అనారోగ్యానికి గురైన బిడ్డ.. గంటల వ్యవధిలోనే మృత్యుఒడికి చేరడాన్ని చూసి ఆ కుటుంబం తల్లడిల్లిపోయింది. వికారాబాద్ జిల్లా దోమ మండలం పాలెపల్లి గ్రామానికి చెందిన శివానిగారి నర్సమ్మ, చంద్రయ్యల కూతురు లక్ష్మి(18). పరిగి మండలం జాఫర్‌పల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సంక్రాంతి సెలవుల్లో స్వగ్రామం వచ్చింది. ఉన్నట్టుండి గురువారం రాత్రి జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు దోమ మండల కేంద్రంలోని ఆర్ఎంపీ శివరాం దగ్గరకు తీసుకెళ్లి వైద్యం చేయించారు. అతడు రాసిన మందుల చిట్టీ మేరకు స్థానిక ఎంఆర్ఎస్ మెడికల్ షాప్‌నకు వెళ్లగా దాని యజమాని భాస్కర్.. అజిత్రోమైసిన్ 500 ఎంజీ (2023 ఆగస్టు వరకే గడువుంది) ట్యాబ్లెట్ ఇచ్చాడు. శుక్రవారం ఉదయం ఆ ట్యాబ్లెట్ వేసుకున్న లక్ష్మి కొద్దిసేపటికే అస్వస్థతకు గురైంది. తల్లిదండ్రులు గమనించి పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. కాగా, లక్ష్మి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మెడికల్ షాప్ యజమాని, ఆర్ఎంపీపై కేసు నమోదు చేసినట్లు దోమ ఇంచార్జి ఎస్ఐ శ్రీశైలం తెలిపారు. వైద్య నివేదిక అందాక తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బిల్లులు చెల్లించడం లేదని కోర్టు ధిక్కరణ పిటిషన్లు

- దాఖలు చేసిన ఐవీఆర్‌సీఎల్, నవయుగ, ఎస్ఈడబ్ల్యూ జేవీ

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదసాగర్ ప్రాజెక్టు, కల్వకుర్తి లిఫ్ట్ పనులకు సంబంధించిన బిల్లుల బకాయిలు ఎందుకు చెల్లించడం లేదో వివరణ ఇవ్వాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు ధిక్కరణ నోటీసులు జారీచేసింది. పదిరోజుల్లో నిధులు విడుదల చేయాలన్న తమ ఆదేశాలు ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించింది. తమ ఉత్తర్వులు అమలు చేయకపోవడంపై కౌంటర్‌లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఆర్థికశాఖ, నీటిపారుదల శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీలు, ఈఎన్‌సీ (జనరల్), ఈఎన్‌సీ (కాళేశ్వరం), కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల ఇంజినీరింగ్ అధికారులకు నోటీసులు ఇచ్చింది. పనులు పూర్తిచేసి ఎలాంటి వివాదం లేనప్పటికీ శ్రీపాదసాగర్ ప్రాజెక్టు స్టేజ్ -2 ఫేజ్ -1 పనులకు సంబంధించిన బిల్లులు రూ.76. 53 కోట్లు విడుదల చేయడం లేదని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐవీఆర్‌సీఎల్, నవయుగ, ఎస్ఈడబ్ల్యూ జాయింట్ వెంచర్ సంస్థ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా ఉన్న పంపింగ్ స్టేషన్‌లు, ఓఅండ్ఎం వర్క్స్‌కు సంబంధించిన బిల్లులు రూ.29 కోట్లు విడుదల చేయడం లేదని మరో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. వీటిపై విచారణ చేపట్టిన జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం.. ఎలాంటి వివాదాలు లేనందున పది రోజుల్లో సొమ్ము చెల్లించాలని ఆదేశించింది. ఆ ఆదేశాలు అమలు చేయకపోవడంపై కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలయ్యాయి. నోటీసులు ఇచ్చిన ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 22కు వాయిదా వేసింది.

రద్దీకి అనుగుణంగా మరిన్ని కొత్త బస్సులు: పొన్నం

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరిన్ని కొత్త బస్సులు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి పొన్నం రవాణా, ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమావేశమై 'మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్ ప్రయాణ పథకం' అమలుపై సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పథకం అమలవుతున్న తీరును టీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బందిని అభినందించారు. ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు సంస్థకు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రవాణా, ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తానా నూతన అధ్యక్షుడిగా నరేన్ కొడాలి



అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అనూహ్య మలుపులతో రెండేళ్లపాటు కొనసాగిన తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా)ఎన్నికలు ఎట్టకేలకు ముగిశాయి. తానా తదుపరి అధ్యక్షుడిగా వర్జీనియాకు చెందిన నరేన్ కొడాలి ఎన్నికయ్యారు. జనవరి 18న ప్రకటించిన ఫలితాల ప్రకారం అన్ని జాతీయ పదవులను నరేన్ టీమ్ చేజిక్కించుకుంది. సుమారు 3వేల ఓట్ల ఆధిక్యంతో సతీష్ వేమూరిపై నరేన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా విజయం సాధించారు. బోర్డు డైరెక్టర్లుగా లావు శ్రీనివాస్, రవి పొట్లూరి, మల్లి వేమన గెలుపొందారు. కార్యదర్శిగా రాజా కసుకుర్తి, కోశాధికారిగా భరత్ మద్దినేని, జాయింట్ సెక్రటరీగా వెంకట్ కోగంటి, జాయింట్ కోశాధికారిగా సునీల్ పాంత్రా ఎన్నికయ్యారు.


గురుకుల పీఈటీ పోస్టులు భర్తీకి వినతి

- న్యాయం చేయండి : జీవో 317 ప్రభావిత నర్సులు
- వేర్వేరు సమస్యలపై ప్రజావాణికి 1483 దరఖాస్తులు

బేగంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చమంటే గూండాలతో దాడి చేయించారు మమ్మల్ని కాపాడండి... మూతబడిన చక్కెర పరిశ్రమలను తెరిపించి ఆదుకోండి.. పాత జోన్లకు పంపి 317 జీవో బాధిత నర్సులకు న్యాయం చెయ్యండి.. ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులకు కుట్టిన దుస్తుల పెండింగ్ బిల్లులు విడుదల చెయ్యండి... ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి వచ్చిన కొన్ని దరఖాస్తులు ఇవి. వివిధ వర్గాల వారి నుంచి వేర్వేరు సమస్యలపై మొత్తం 1483 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాల, కళాశాలల విద్యార్థులకు కుట్టిన దుస్తులకు సంబంధించిన రూ.40 కోట్ల బిల్లులు తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే బిల్లులు చెల్లించాలని తెలంగాణ టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. చంచల్ గూడలోని ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్న తనపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత మహిళ ఫిర్యాదు చేశారు. మెదక్, మెట్‌పల్లి, బోధన్‌లో మూతబడిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి 305 మంది ఉద్యోగులను ఆదుకోవాలని ఎన్.డి.ఎస్.ఎల్ కార్మికులు కోరారు. అప్పు తీర్చమన్నందుకు తమపై గూండాలతో దాడి చేయించారని, ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని తమకు న్యాయం చేయాలని ప్రభాకర్‌రెడ్డి, సౌజన్య అనే దంపతులు అర్జీ సమర్పించారు.

స్టాట్యూ ఆఫ్ లిబర్టీలా ఏపీలో అంబేడ్కర్ విగ్రహం

సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనం: ఏపీ సీఎం జగన్



అమరావతి/విజయవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక సమతా న్యాయ శిల్పం (స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్) అంబేడ్కర్ 210 అడుగుల విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. శుక్రవారం విజయవాడలోని స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. అమెరికాలో స్టాట్యూ ఆఫ్ లిబర్టీ మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయ మహాశిల్పం అంబేడ్కర్ విగ్రహం వెలిగిపోతుందని జగన్ అన్నారు. 56 నెలల్లో నిర్మించిన ఈ విగ్రహం సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనమ

ఆద్యకళ మ్యూజియం ఏర్పాటుకు కృషి

- మంత్రులు సీతక్క, జూపల్లి హామీ
- 'జానపద, గిరిజన కళలు - సంస్కృతి, అధ్యయనం - పరిరక్షణ' సమావేశంలో వెల్లడి
- ఆద్య కళలను కాపాడుకోవాలి : ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్

రవీంద్రభారతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన, సాంస్కృతిక వారసత్వ సంపద పరిరక్షణ కోసం ఆద్య కళ మ్యూజియం ఏర్పాటుకు కృషి చేస్తామని రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. మ్యూజియం ఏర్పాటు అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఈ మేరకు 'జానపద, గిరిజన కళలు - సంస్కృతి, అధ్యయనం - పరిరక్షణ' అంశంపై ఆద్యకళ మ్యూజియం ఆధ్వర్యంలో తెలుగు వర్సిటీలో శుక్రవారం జరిగిన సమావేశానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆద్య కళ మ్యూజియంలో ఏర్పాటు చేసిన కళాఖండాలను తిలకించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఆద్య కళలు, కళాఖండాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సాంస్కృతిక పరిరక్షణ, జానపద, గిరిజన వస్తు సంచయాన్ని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. జానపద కళల వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందజేసేందుకు కృషి చేస్తున్న ఆద్యకళ నిర్వాహకుడు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు సేవలను కొనియాడారు. తెలంగాణ ఉద్యమం అస్తిత్వ పరిరక్షణ కోసం సాగిందని, చారిత్రక, వారసత్వ సంపద పరిరక్షణ అందరి బాధ్యత అని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సాంస్కృతిక, వారసత్వ సంపదకు తెలంగాణ చిరునామా అని, ఆద్య కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కే శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. ఆద్య కళా పరిరక్షణకు గత ప్రభుత్వం తగినంత ప్రాధాన్యం ఇవ్వలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఆద్య కళ మ్యూజియంను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆద్యకళలోని కళాఖండాలను సందర్శించిన సాంస్కృతిక, పర్యాటకాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ మ్యూజియం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ జానపద, గిరిజన కళల పరిరక్షణకు ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


ఆద్య కళ కళాఖండాలను తిలకిస్తున్న మంత్రి సీతక్క, చిత్రంలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే శ్రీనివాస్, తదితరులు

బకాయిలు రాబడదాం!

హౌసింగ్ బోర్డుకు రూ.1000 కోట్ల బకాయిలు.. హౌసింగ్ శాఖ సమీక్షలో మంత్రి పొంగులేటి



హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ శాఖపై దృష్టి సారించింది. గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ బోర్డు పరిధిలో జరిగిన పలు అంశాలను సేకరిస్తోంది. ఇప్పటికే గృహనిర్మాణ శాఖను ఆర్ అండ్ బీ నుంచి వేరుచేసి ప్రత్యేక శాఖగా ఏర్పాటుచేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. తాజాగా హౌసింగ్ బోర్డు, దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్ లిమిటెడ్ (దిల్), రాజీవ్ స్వగృహ పరిధిలో నిర్మించిన టవర్లు, ఓపెన్ ప్లాట్లపై దృష్టి పెట్టింది. ఉమ్మడి ఏపీ విభజన సమయంలో కొన్ని భూములు వివాదంగా మారడంతో వాటిని పునర్విభజన చట్టం 9వ షెడ్యూల్‌లోకి చేర్చారు. ఈ నేపథ్యంలో అసలు వీటి పరిధిలో ఎన్ని భూములున్నాయి, వాటి ద్వారా ఎంత ఆదాయం వస్తోంది, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖ పరిధిలోని అన్ని అంశాలపైనా అధికారులతో చర్చించారు. హౌసింగ్ బోర్డుపై మంత్రి వివరాలు కోరగా.. దాదాపు రూ.1000 కోట్ల మేర బోర్డుకు బకాయిలున్నాయని మంత్రికి అధికారులు చెప్పినట్లు తెలుస్తోంది. కొన్నేళ్ల క్రితం హౌసింగ్ బోర్డు పరిధిలోని భూములను అప్పటి ప్రభుత్వాలు విక్రయించగా పలువురు వాటిని కొనుగోలు చేశారు. చెల్లింపుల ప్రక్రియను ఇప్పటికీ పూర్తిచేయలేదని మంత్రికి చెప్పినట్లు తెలిసింది. ఈ అంశంపై స్పందించిన మంత్రి.. విక్రయించిన భూములు ఎక్కడెక్కడున్నాయి. గతంలో వాటిని ఎందుకు విక్రయించాల్సి వచ్చింది? ఏ ధరకు వాటిని విక్రయించారు? అసలు హౌసింగ్ బోర్డు పరిధిలో ఎన్ని ఎకరాలున్నాయి? అనే వివరాలు అడిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బోర్డు పరిధిలో గతంలో విక్రయించిన భూములకు సంబంధించి రావాల్సిన బకాయిలన్నింటినీ రికవరీ చేసేందుకు అవసరమైన ప్రణాళిక చేయాలని అధికారులు ఆదేశించినట్లు తెలిసింది. ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి 31నాటికి బకాయిలన్నింటినీ వసూలు చేయాలని సూచించినట్లు సమాచారం. ప్రస్తుతం రాజీవ్ స్వగృహ కింద ఎన్ని టవర్లున్నాయి, వాటిలో ఎన్ని ప్లాట్లు ఉన్నాయనే వివరాలతో పాటు ఏయే జిల్లాల్లో ఎన్ని ఓపెన్ ప్లాట్లు ఉన్నాయని మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ భూముల విక్రయాలు, వేలం కోసం సోమవారం ప్రత్యేక కమిటీని నియమించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. హౌసింగ్ బోర్డు, దిల్ పరిధిలో హైదరాబాద్ చుట్టూ జిల్లాల్లో కొన్ని భూములు వివాదాల్లో ఉన్నాయి. దీంతో ఈ వివాదాల్లో ఉన్నవాటిని పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఒక లీగల్ కౌన్సిల్ ఏర్పాటుచేయాలని సమీక్షలో మంత్రి నిర్ణయించినట్లు తెలిసింది.

షెడ్యూల్-9 ల్యాండ్స్ రక్షణకు చర్యలు

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విభజన సమయంలో దిల్, హౌసింగ్ బోర్డు భూముల పంపకాల విషయంలో కొంత వివాదం ఏర్పడింది. దాంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఆ భూములను పునర్విభజన చట్టం 9వ షెడ్యూల్‌లోకి చేర్చింది. దీంతో ఇరు రాష్ట్రాల మధ్యన ఇప్పటికీ ఈ భూముల విషయంలో ఒక స్పష్టత రాలేదు. ఇందులో భాగంగానే ఏపీలోని విశాఖపట్నంలో దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్స్ లిమిటెడ్ (దిల్) కింద దాదాపు 160 ఎకరాల భూమి ఉండగా, హౌసింగ్ బోర్డుకు కొన్ని భూములున్నట్లు సమాచారం. ఈ భూముల విషయంలో ఇరు రాష్ట్రాలు సహకారంతో కలిసి ముందుకు వెళితేనే ఒక పరిష్కారం లభించనుంది. అప్పటి వరకు షెడ్యూల్ 9 పరిధిలో ఇరు రాష్ట్రాల్లో ఉన్న భూములు కబ్జాలకు గురవకుండా ప్రత్యేక రక్షణా చర్యలను తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

బీఆర్ఎస్ నేతలకు జ్ఞానోదయం కావట్లేదు!

మానసిక దౌర్బల్యంతోనే విమర్శలు: జూపల్లి

తమను మోసం చేసిన బీఆర్ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారని, అయినా ఆపార్టీ నేతలకు జ్ఞానోదయం కలుగడం లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గాంధీ భవన్‌లో కాంగ్రెస్ శాసనసభ్యులు వంశీకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి జూపల్లి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు, కేటీఆర్ అర్థం పర్థం లేని విమర్శలు చేస్తున్నారని, అవి వారి మానసిక దౌర్బల్యాన్ని స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ఇచ్చిన అనేక హామీలను తుంగలో తొక్కారని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతుందని, ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి కాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. లోకసభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని, పార్టీని బతికించుకునేందుకు బీజేపీతో పొత్తు పెట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపిస్తామని, ప్రతీ పైసాకు వారు లెక్క చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు.

హెచ్ఎండీఏలో షట్‌డౌన్

- మూడు రోజులుగా ఇంటర్నెట్ బంద్
- నిలిచిపోయిన ఆన్‌లైన్ సేవలు
- ఇబ్బందుల్లో ఉద్యోగులు, ప్రజలు

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏలో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. మూడు రోజులుగా ఇంటర్నెట్ సమస్య వల్ల హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయంలోని కంప్యూటర్ ఆధారిత సేవలకు ఇబ్బందులు తలెత్తాయి. ఎప్పటికి పునరుద్ధరణ అవుతాయన్నది సంబంధిత విభాగాల అధికారులు సైతం చెప్పలేకపోతున్నారు. మూడు రోజులుగా ఆన్‌లైన్ దరఖాస్తులన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో అటూ ఉద్యోగులు, ఇటూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా మంది వివిధ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి హెచ్ఎండీఏ కార్యాలయానికి వచ్చి వెనుతిరుగుతున్నారు. హెచ్ఎండీఏ తన సేవలన్నీ ఆన్‌లైన్ చేసిన విషయం తెలిసిందే. లేఅవుట్, భవన నిర్మాణ అనుమతులు, చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్, ఎన్ఓసీస్, ఆక్యుపెన్సీ తదితరాలన్నీ పూర్తిగా ఆన్‌లైన్‌లోకి వచ్చాయి. ఇక నాలుగేళ్ల క్రితం టీఎస్‌బీపాస్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు అంటూ లేకుండా ఆన్‌లైన్‌లోనే సాగుతున్నాయి. ఇంజనీరింగ్, అడ్మినిస్ట్రేషన్ విభాగంలోనూ వివిధ రకాల సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో, అమీర్‌పేటలోని స్వర్ణ జయంతి కాంప్లెక్స్‌లో గల హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయంలో ఇంటర్నెట్ నిలిచిపోతే అధికారులు, ఉద్యోగుల విధులకు తీవ్ర ఆటంకం తలెత్తుతోంది. ప్రస్తుతం మూడు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో కొందరు హెచ్ఎండీఏ ప్లానింగ్ అధికారులు తమ సొంత ల్యాప్‌టాప్‌లను మొబైల్ హాట్‌స్పాట్‌లకు కనెక్ట్ చేసి విధులు కొనసాగిస్తున్నారు. హెచ్ఎండీఏలో ఇంటర్నెట్ నిలిచిపోవడం ఇదేమీ కొత్త కాదు. గతంలో తార్నాకలో ప్రధాన కార్యాలయం కొనసాగిన సందర్భంలో అనేకసార్లు ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. మూడేళ్ల క్రితం అమీర్‌పేటలోని స్వర్ణ జయంతి కాంప్లెక్స్‌కు తరలించిన తర్వాత కూడా పలు మార్లు ఇంటర్నెట్ సేవలకు అంతరాయం తలెత్తింది. వారం పాటు సేవలు నిలిచిన సందర్భాలున్నాయి. సర్వీసు ప్రొవైడర్‌తోనే ఇంటర్నెట్ సేవల్లో ఇబ్బందులుంటున్నాయని ఓ అధికారి తెలిపారు.

'రామానాయుడు' భూములను ఇతర అవసరాలకు వాడొద్దు

- భూ వినియోగ మార్పిడిపై సుప్రీం స్టే
- కోర్టులో జగన్ సర్కారుకు ఎదురుదెబ్బ

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని రామానాయుడు స్టూడియో భూముల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. స్టూడియోకు సంబంధించిన భూమి వినియోగ మార్పిడిపై స్టే విధించింది. స్టూడియో ఏర్పాటుకు 2003లో ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్న అవసరాలకు మినహా ఇతరత్రా కార్యకలాపాలకు భూమిని వినియోగించరాదని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు మునిసిపల్, రెవెన్యూ, పర్యాటక శాఖల ముఖ్య కార్యదర్శులు, విశాఖ కలెక్టర్, వీఎంఆర్‌డీఎ, జీవీఎంసీల కమిషనర్లతో సహా మొత్తం ఎనిమిది మందికి నోటీసులు జారీ చేసింది. మాస్టర్‌ప్లాన్‌లో విశాఖ మెట్రోపాలిటన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) మార్పులు చేయడం, లేఅవుట్‌కు మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) ఆమోదం తెలపడంపై టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వివరాలన్నీ పరిశీలించి భూమి వినియోగంపై స్టే ఆర్డర్ ఇచ్చింది.

'చంద్రబాబు బెయిల్ రద్దు'పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఏపీ హైకోర్టు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని జగన్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఫిబ్రవరి 13వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో కౌంటర్ దాఖలుకు సమయం కావాలని చంద్రబాబు తరఫు న్యాయవాదులు గుంటూరు ప్రమోద్ కుమార్, ప్రేరణ కోర్టును అభ్యర్థించడంతో ఉన్నత న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ లోపు ఇరు పక్షాలు తమ వాదనలను లిఖిత పూర్వకంగా సమర్పించాలని జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

సామర్థ్యాలను పెంచే పుస్తకాలు అవసరం: సురేఖ

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యువ పరిశోధకులు, శాస్త్రవేత్తల సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు జీఎస్ఐ ఎంతో ప్రభావవంతమైన కార్యక్రమాలు నిర్వహిస్తోందని మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో జాతీయస్థాయి వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జీఎస్ఐ పుస్తకాల్లో పేర్కొన్న అంశాలు టైగర్ రిజర్వ్‌లలో విధులు నిర్వహిస్తున్న అటవీ అధికారులకు మార్గదర్శకం చేస్తున్నాయని తెలిపారు. 'ఫ్రెష్ వాటర్ ఫిష్ ఆఫ్ రివర్ గోదావరి' పుస్తకం అంతరించిపోతున్న మత్స్య జాతులపై అధ్యయనం చేసేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

జగన్ కేసుల్లో జాప్యమేల?

(మొదటి పేజీ తరువాయి)



నమోదైన కేసుల విచారణను తెలుగు రాష్ట్రాల నుంచి బదిలీ చేయాలని వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణం రాజు దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లపై శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. జగన్ బెయిల్ రద్దు, విచారణను ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయడంపై సీబీఐకి సుప్రీం గతంలోనే నోటీసులు జారీ చేసింది. జగన్ బెయిల్ రద్దు పిటిషన్ పై రఘురామరాజు పిటిషన్‌ను కొట్టివేయాలని జగన్ తరఫు న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, నిరంజన్ రెడ్డి చేసిన అభ్యర్థనను శుక్రవారం కోర్టు తోసిపుచ్చింది. సీబీఐ, జగన్ కుమ్మక్కై కేసును జాప్యం చేస్తున్నారని రఘురామరాజు తరఫు న్యాయవాది బాలాజీ శ్రీనివాసన్ తెలిపారు. అసలు జగన్ కేసుల్లో విచారణ ఎందుకు ఆలస్యమవుతోందని జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించారు. జాప్యానికి తాము బాధ్యులం కాదని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బదులిచ్చారు. అలాంటప్పుడు ఎవరు బాధ్యత వహిస్తారని న్యాయమూర్తి ప్రశ్నించారు. అలాగే... కింది కోర్టుల్లో జరుగుతున్న వాయిదాలతో తమకు సంబంధంలేదని సీబీఐ తరఫు న్యాయవాది జవాబిచ్చారు. సీబీఐ వంటి దర్యాప్తు సంస్థకే సంబంధంలేకపోతే ఎవరికి ఉంటుందని జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించారు.

పిటిషన్ రద్దు చేయాలని ఆ ఇద్దరూ...

జగన్ బెయిల్ రద్దు కోరుతూ రఘురామ దాఖలుచేసిన పిటిషన్ పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పే సరిపోతుందని తుషార్ మెహతా వాదించారు. రఘురామ పిటిషన్‌ను రద్దు చేయాలన్న జగన్ తరఫు న్యాయవాది రోహత్గీకి మద్దతు పలికారు. కాగా, ప్రజాప్రతినిధులపై దాఖలైన పిటిషన్లను త్వరితగతిన విచారించాలని సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందని, దానిపై తెలంగాణ హైకోర్టు తగిన చర్యలుతీసుకుంటోందని జగన్ తరఫు న్యాయవాది నిరంజన్ రెడ్డి సుప్రీంకోర్టుకు తెలిపారు. హైకోర్టు సుమోటోగా ఆదేశాలు జారీ చేసినందువల్ల మూడు నెలల గడువు ఇవ్వాలని, తర్వాత పరిశీలన జరపాలని జగన్ తరఫు న్యాయవాదులు చేసిన విజ్ఞప్తిని కూడా ధర్మాసనం తోసిపుచ్చింది. ఎంత సమయం ఇచ్చినా ఫలితంఎక్కడా కనపడడం లేదని వ్యాఖ్యానించింది.



జాప్యంపైనే మా దృష్టి: ధర్మాసనం

కేవలం రాజకీయ దృక్పథంతోనే రఘురామరాజు ఈ పిటిషన్ దాఖలు చేశారని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ఆయనపై పార్టీ చర్యలు తీసుకున్నందున మూడేళ్లుగా పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రఘురామరాజుపై అనర్హత పిటిషన్ దాఖలు చేసినందువల్లే ఆయన సుప్రీంలో ఈ పిటిషన్లు దాఖలు చేశారని నిరంజన్ రెడ్డి అన్నారు. అయితే... తాము రాజకీయ వ్యవహారాలను పరిశీలించడంలేదని, న్యాయపరమైన అంశాలను మాత్రమే పరిశీలిస్తున్నామని జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టం చేశారు. విచారణ ఎందుకు ఆలస్యమవుతోందన్నదే ఇక్కడ ప్రధానాంశం అని ఆయన అన్నారు. ఇంతకాలం నుంచీ ఒక్క డిశ్చార్జి పిటిషన్ అన్నా పరిష్కరించారా? అని ఆయన ప్రశ్నించారు. పలుకుబడి గల వ్యక్తుల కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని తెలంగాణ హైకోర్టు గత ఏడాది డిసెంబరు 15న ఆదేశాలు జారీ చేసిందని ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకు వచ్చారు. ఈ ఆదేశాలతో ఏం జరుగుతుందో చూద్దామని వ్యాఖ్యానించిన ధర్మాసనం రెండు కేసుల విచారణను ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేసింది.

ఆవిష్కరణలు అదరహో

పళ్ల తొక్కలతో ఇమ్యూనిటీ మాత్రలు.. గాయపడిన ముఖాలను గుర్తించే ఏఐ

- ఐఐటీహెచ్‌లో నవ కల్పనల ప్రదర్శన
- ప్రారంభించిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర

కంది, జనవరి 19 : తొక్కే కదా అని తీసి పారేయ లేదు.. వాటితో రోగ నిరోధక శక్తిని పెంచే మాత్రలను తయారు చేశారు. ఎందుకూ పనికి రావనుకుంటున్న పరిశ్రమల వ్యర్థ జలాలతో ఎరువును రూపొందించారు. గాయాలైన ముఖాలను గుర్తించే ఏఐ సాంకేతికత.. పాడైపోయిన శరీర భాగాలకు పాత రూపునిచ్చే పరిజ్ఞానం.. ఇలా.. కావేవీ ఆవిష్కరణలకు అతీతం అంటూ యువ పరిశోధకులు సృష్టించిన సాంకేతికతలు అబ్బురపరిచాయి. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-హైదరాబాద్(ఐఐటీ) క్యాంపస్‌లో శుక్రవారం 'ఇన్వెంటివ్-2024' పేరుతో ఇన్నోవేషన్ ఫెయిర్ నిర్వహించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆవిష్కరణలతోనే ఆర్థిక పురోగతి సాధ్యమని ఆయన అన్నారు. కాగా, ప్రమాదంలో మనుషుల ముఖానికి దెబ్బలు తగిలినపుడు వారిని గుర్తించడం కష్టంగా ఉంటుంది. కృత్రిమ మేధలోని డీప్ లెర్నింగ్ టెక్నాలజీని ఉపయోగించి ఐఐటీ జోధ్‌పూర్ విద్యార్థులు రూపొందించిన ఫేస్ రికగ్నైజ్ టెక్నాలజీ దీనికి పరిష్కారం చూపుతోంది. ఈ సాంకేతికతతో ఇప్పటి వరకు 120 మంది మృతదేహాలను గుర్తించారు. ప్రమాదాల్లో దెబ్బతిన్న, పాడైపోయిన, రంగు మారిన మానవ శరీర భాగాలను కృత్రిమ రంగులతో పూర్వ స్థితికి చేర్చే సిలికాన్ టెక్నాలజీని ఐఐటీ జోధ్‌పూర్ విద్యార్థులు రూపొందించారు. శక్తిమంతమైన స్నైపర్ గన్ బుల్లెట్‌నైనా తట్టుకునేలా ఐఐటీ ఢిల్లీ పరిశోధకులు అధునాతన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్‌ను తయారు చేశారు. శత్రుమూకల దాడి నుంచి సైనికులను రక్షించుకునేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని.. దీనిని భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్ దళాల కోసం తయారు చేశామని పరిశోధకులు వెల్లడించారు. నాన్ థర్మల్ ప్లాస్మా టెక్నాలజీని ఉపయోగించి పరిశ్రమల నుంచి వెలువడిన వ్యర్థ జలాలతో లిక్విడ్ ఎరువును తయారు చేశారు ఐఐటీ తిరుపతి విద్యార్థులు. జీవవైవిధ్యానికి ఆటంకం కలగకుండా చేయాలనే ఆలోచనతో విద్యార్థులు ఈ ప్లాస్మా టెక్నాలజీని అభివృద్ధి చేశారు. పళ్లు, కూరగాయల తొక్కలతో రోగ నిరోధక శక్తిని పెంచే మాత్రలను ఎన్ఐటీ నాగ్‌పూర్ పరిశోధకులు రూపొందించారు. శరీరంలో అలసట, నీరసం అనిపించినప్పుడు ఈ మాత్రలను తీసుకుంటే క్షణాల్లో శక్తిని పొందవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.


ఎన్ఐటీ నాగ్‌పూర్ పరిశోధకులు రూపొందించిన ఇమ్యూనిటీ మాత్రలు


ఐఐటీ జోధ్‌పూర్ విద్యార్థులు రూపొందించిన నలిగిన ముఖాలను గుర్తించే టెక్నాలజీ

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ ● శనివారం 20 జనవరి 2024

diksuchi@andhrajyothy.com

హైదరాబాద్‌లోని మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(టీఎంఆర్ఈఐఎస్)- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని 204 టీఎంఆర్ పాఠశాలల్లో అయిదోతరగతి ప్రవేశాలు; ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో బ్యాక్‌లాగ్ అడ్మిషన్స్ అలాగే 194 టీఎంఆర్ జూనియర్ కళాశాలలు(జనరల్ & ఒకేషనల్), 10 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) మైనారిటీ గురుకులాల్లో జూనియర్ ఇంటర్ అడ్మిషన్స్ నిర్వహించనున్నారు. మైనారిటీ వర్గాలతోపాటు అన్ని కేటగిరీల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాక్‌లాగ్ అడ్మిషన్స్‌కు మైనారిటీ అభ్యర్థులు మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. అడ్మిషన్ పొందినవారికి విద్య, భోజనం, వసతి ఉచితం. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, స్పోర్ట్స్ డ్రెస్, షూస్, కాస్మొటిక్ కిట్, హెల్త్‌కేర్ కిట్ అందిస్తారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లు, సైన్స్ ల్యాబొరేటరీలు, లైబ్రరీ, రోబోటిక్స్ & ఇంజనీరింగ్ ల్యాబొరేటరీలు, వెంటిలేటెడ్ డార్మిటరీలు ఉంటాయి. డ్రింకింగ్ వాటర్, హాట్ వాటర్ అందిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. అడ్వెంచర్ యాక్టివిటీస్, సమ్మర్ క్యాంప్‌లు, లిటరసీ యాక్టివిటీస్(డిబేట్, ఎస్సే రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, స్పీచ్), ఫీల్డ్ ట్రిప్స్, ఎడ్యుకేషనల్ టూర్స్, డిస్ట్రిక్ట్/స్టేట్ లెవెల్ స్పార్క్ ఫెస్ట్‌లు, పేరెంట్-టీచర్ మీటింగ్స్ నిర్వహిస్తారు. క్రీడలకు ప్రాధాన్యం ఉంటుంది. సెల్ఫ్ అవేర్‌నెస్ & కాన్ఫిడెన్స్ స్కిల్స్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తారు.

తెలంగాణ మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలు



మైనారిటీ గురుకుల కళాశాలల వివరాలు

- టీఎంఆర్ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయి. సీఓఈ మైనారిటీ గురుకులాల్లో జేఈఈ/ఐఐటీ, నీట్, ఎన్‌డీఏ, క్లాట్, సీయూఈటీ, యూపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ బోర్డు, సీఏ/సీఎస్ ఫౌండేషన్‌లకు సంబంధించి సమగ్రమైన శిక్షణ అందిస్తారు. ఫస్ట్ లాంగ్వేజ్‌గా ఇంగ్లీష్, సెకండ్ లాంగ్వేజ్‌గా తెలుగు/ఉర్దూ ఉంటాయి.
- మైనారిటీ ఒకేషనల్ కళాశాలల్లో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్(ఎంఎల్‌టీ), మల్టీపర్పస్ హెల్త్ వర్కర్(ఎంపీహెచ్‌డబ్ల్యూ), కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ(సీజీటీ), ఎలక్ట్రికల్ టెక్నీషియన్(ఈటీ), కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ(సీటీ), కంప్యూటర్ సైన్స్(సీఎస్), అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్(ఏ&టీ), టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(టీ&హెచ్ఎం), అగ్రికల్చరల్ క్రాప్ ప్రొడక్షన్(ఏసీపీ), లైవ్‌స్టాక్ మేనేజ్‌మెంట్ & డెయిరీ టెక్నాలజీ(ఎల్ఎం&డీటీ) కోర్సులు ఉన్నాయి. వీటికి నిర్దేశించిన సబ్జెక్టులతో పాటు ఇంగ్లీష్, జనరల్ ఫౌండేషన్ కోర్సులను చదవాల్సి ఉంటుంది.

అర్హత

- విద్యార్థులు ప్రవేశం పొందాలనుకొన్న తరగతికి కింది స్థాయి తరగతి చదువుతూ ఉండాలి. అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు 2012 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య, ఆరోతరగతి చదువుతున్న విద్యార్థులు 2011 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య, ఏడోతరగతి చదువుతున్న విద్యార్థులు 2010 సెప్టెంబరు 1 నుంచి 2013 ఆగస్టు 31 మధ్య, ఎనిమిదోతరగతి చదువుతున్న విద్యార్థులు 2009 సెప్టెంబరు 1 నుంచి 2012 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి.
- ఇంటర్లో చేరే అభ్యర్థులు ప్రస్తుతం పదోతరగతి చదువుతూ ఉండాలి. వీరికి 2024 మార్చి/ఏప్రిల్‌లో నిర్వహించే బోర్డు ఎగ్జామ్‌లో కనీసం 6 సీజీపీఏ రావాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 18 ఏళ్లు మించకూడదు.
- కుటుంబ వార్షికాదాయం గ్రామాల్లో రూ.1,50,000; నగరాల్లో రూ.2,00,000లు మించకూడదు.

ఎంపిక

- అయిదోతరగతిలో ప్రవేశానికి మైనారిటీ అభ్యర్థులను ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో; ఇతర కేటగిరీల అభ్యర్థులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేస్తారు.
- బ్యాక్‌లాగ్ అడ్మిషన్స్‌కు ముందుగా దరఖాస్తు చేసుకున్న మైనారిటీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యమిస్తారు.
- జూనియర్ ఇంటర్(జనరల్/ఒకేషనల్)లో ప్రవేశానికి అభ్యర్థులను పదోతరగతిలో సాధించిన మెరిట్ ప్రకారం ఎంపిక చేస్తారు.
- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) మైనారిటీ గురుకులాల్లో ప్రవేశానికి స్క్రీనింగ్ టెస్ట్, ఓరల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్క్రీనింగ్ టెస్ట్‌ను పెన్-పేపర్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో పదోతరగతి సిలబస్‌ను అనుసరించి మొత్తం 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జేఈఈ/ఐఐటీ అభ్యర్థులకు మేథ్స్ నుంచి 40, ఫిజిక్స్ నుంచి 20, కెమిస్ట్రీ నుంచి 20, లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు; నీట్ అభ్యర్థులకు బయాలజీ నుంచి 30, ఫిజిక్స్ నుంచి 15, కెమిస్ట్రీ నుంచి 15, మేథ్స్ నుంచి 20, లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు; ఎన్‌డీఏ అభ్యర్థులకు జనరల్ మేథ్స్ నుంచి 40, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20, జీకే& కరెంట్ అఫైర్స్ నుంచి 20, లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు; క్లాట్/సీఏ/సీఎస్ ఫౌండేషన్ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్ నుంచి 20, సోషల్ నుంచి 20, జీకే&కరెంట్ అఫైర్స్ నుంచి 15, మేథ్స్ నుంచి 15, జనరల్ సైన్స్ నుంచి 10, లాజికల్ రీజనింగ్& లీగల్ ఆప్టిట్యూడ్ నుంచి 20 ప్రశ్నలు; యూపీఎస్సీ/టీఎస్‌పీఎస్సీ/ఎస్ఎస్‌సీ/బ్యాంకింగ్ సర్వీస్ రిక్రూట్‌మెంట్/ఆర్ఆర్‌బీ అభ్యర్థులకు సోషల్ నుంచి 20, జనరల్ ఇంగ్లీష్ నుంచి 15, జనరల్ సైన్స్ నుంచి 15, జీకే & కరెంట్ అఫైర్స్ నుంచి 20, జనరల్ మేథ్స్ నుంచి 10, లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఆంగ్ల మాధ్యమంలో ఉంటాయి. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందినవారికి సంబంధిత సబ్జెక్టుల్లో ఓరల్ ఇంటర్వ్యూ ఉంటుంది.

ముఖ్య సమాచారం

- రిజిస్ట్రేషన్ ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 6
- **అయిదు నుంచి ఎనిమిదోతరగతి వరకు విద్యార్థుల ఎంపిక ప్రక్రియ:** ఏప్రిల్ 24 నుంచి 30 వరకు
- **జూనియర్ ఇంటర్ విద్యార్థుల ఎంపిక ప్రక్రియ:** మే 1 నుంచి 10 వరకు
- **సీఓఈ గురుకులాల్లో ప్రవేశానికి స్క్రీనింగ్ టెస్ట్:** ఫిబ్రవరి 25
- **వెబ్‌సైట్:** tmreistelangana.cgg.gov.in

ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ(ఏపీఎఫ్‌యూ) - 2023-24 అకడమిక్ ఇయర్‌కు సంబంధించి మాస్టర్ ఆఫ్ ఫిషరీ సైన్స్(ఎంఎఫ్ఎస్సీ), పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ ర్యాంక్, అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్‌ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరులోని కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్సెస్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. స్థానిక అభ్యర్థులకు ఫెలోషిప్ సౌకర్యం ఉంది. ఎంఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లో చేరినవారికి నెలకు రూ.9,000; పీహెచ్‌డీలో చేరిన వారికి నెలకు రూ.10,000 ఇస్తారు.

సీట్ల వివరాలు: ఎంఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లో ఆక్వాకల్చర్ 3, ఆక్వాటిక్ యానిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్ 2, ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ 4, ఆక్వాటిక్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ 2, ఫిష్ ప్రాసెసింగ్ టెక్నాలజీ 3, ఫిషరీస్ ఇంజనీరింగ్ 2 సీట్లు చొప్పున మొత్తం 16 సీట్లు ఉన్నాయి.

- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ఆక్వాకల్చర్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఎంఎఫ్ఎస్సీలో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి నాలుగేళ్ల బీఎఫ్ఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. దరఖాస్తు నాటికి అభ్యర్థుల వయసు 40 ఏళ్లు మించకూడదు. పీహెచ్‌డీలో ప్రవేశానికి ఎంఎఫ్ఎస్సీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 50 ఏళ్లు మించకూడదు. రెండు ప్రోగ్రామ్‌లకు జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జనవరి 20
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ, అయిదో అంతస్తు, విశాల్ రెసిడెన్సీ, పద్మజ నగర్, తాడిగడప, విజయవాడ-521134
- **వెబ్‌సైట్:** www.apfu.ap.gov.in

ఎన్‌పీటీఐలో పీజీ డిప్లొమా



హరియాణాలోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా 2024 వింటర్ సెషన్ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్ అనే స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా పలు మాడ్యూల్స్, ఇండస్ట్రియల్/ఫీల్డ్ ట్రెయినింగ్, ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ చివర్లో ఫైనల్ ఎగ్జామ్ నిర్వహిస్తారు. మొత్తం 360 సీట్లు ఉన్నాయి. వీటిలో 25 శాతం సీట్లను పవర్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ప్రత్యేకించారు.

పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: ఈ స్పెషలైజేషన్‌లో గ్యాస్, సోలార్, విండ్, బయోమాస్ తదితర పవర్ ప్లాంట్‌లకు సంబంధించిన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ అంశాలు వివరిస్తారు. పవర్ సెక్టార్ విభాగాల నిర్వహణకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఫరీదాబాద్, నాగ్‌పూర్, నైవేలీ, శివపురి క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 చొప్పున మొత్తం 240 సీట్లు ఉన్నాయి.

రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్: ఈ స్పెషలైజేషన్‌లో రెన్యూవబుల్ ఎనర్జీ సోర్సెస్‌కు సంబంధించిన టెక్నాలజీ, ఎకనామిక్స్, పాలసీ, ఎనర్జీ సిస్టమ్స్, సప్లయ్ తదితర అంశాలు ఉంటాయి. సోలార్ ఎనర్జీ సిస్టమ్స్, ఫొటోవోల్టాయిక్ సిస్టమ్స్, థర్మల్ ఎనర్జీ సిస్టమ్స్, విండ్ ఎనర్జీ, బయోమాస్, జియోథర్మల్, టైడల్ అండ్ వేవ్ ఎనర్జీ, హైడ్రోజన్ అండ్ ఫ్యూయెల్ సెల్స్, గ్రిడ్ ఇంటిగ్రేషన్, ఇంటర్ఫేసింగ్ టెక్నాలజీస్ అంశాలు వివరిస్తారు. న్యూఢిల్లీ, బెంగళూరు క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో(బీఈ/బీటెక్/తత్సమాన కోర్సు)(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సీ అండ్ ఐ/పవర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు రెండు స్పెషలైజేషన్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్ స్పెషలైజేషన్‌కు(బీఈ/బీటెక్)(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఐటీ) అభ్యర్థులు కూడా అర్హులే. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, టెలిఫోన్/ఆన్‌లైన్ ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అకడమిక్ ప్రతిభకు 90 శాతం, ఇంటర్వ్యూకి 10 శాతం వెయిటేజీ ఇస్తారు.

- **కోర్సు ఫీజు:** నాన్ స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.2,30,000; స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.3,60,000. అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 22
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** ఫిబ్రవరి 26
- **కౌన్సెలింగ్ తేదీ:** ఫిబ్రవరి 29
- **కోర్సు ప్రారంభం:** మార్చి 4 నుంచి
- **సీట్లు మిగిలిన పక్షంలో స్పాట్ అడ్మిషన్స్:** మార్చి 11
- **వెబ్‌సైట్:** npti.gov.in

సీఆర్‌పీఎఫ్‌లో కానిస్టేబుల్ పోస్టులు

ఖాళీలు 169

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)... స్పోర్ట్స్ కోటాలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ)(నాన్-గెజిటెడ్ నాన్ మినిస్టీరియల్)

క్రీడా విభాగాలు: జిమ్నాస్టిక్, జూడో, పుష్, షూటింగ్, బాక్సింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ, రెజ్లింగ్ ఫ్రీస్టయిల్, గ్రీకో రోమన్, తైక్వాండో, వాటర్ స్పోర్ట్స్ కయాక్, కానో, రోయింగ్, బాడీబిల్డింగ్, వెయిట్‌లిఫ్టింగ్, స్విమ్మింగ్, ట్రయత్లాన్, డైవింగ్, డైవింగ్ ఈక్వెస్ట్రియన్, యాచింగ్, ఐస్ హాకీ, ఐస్ స్కేటింగ్, ఐస్ స్కీయింగ్.

జీతభత్యాలు: రూ.21,700 - రూ.69,100

అర్హత: పదో తరగతి ఉత్తీర్ణత, నిర్దిష్ట శారీరక ధారుఢ్యంతో పాటు సంబంధిత క్రీడాంశాల్లో అర్హత సాధించి ఉండాలి.

వయోపరిమితి: 2024 ఫిబ్రవరి 15 నాటికి 18 నుంచి 23 సంవత్సరాల మధ్య ఉండాలి

ఎంపిక ప్రక్రియ: క్రీడా ప్రదర్శన, స్పోర్ట్స్ ట్రయల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15

వెబ్‌సైట్: https://crpf.gov.in/

డీఆర్‌డీఎల్‌లో ఐటీఐ అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓకు చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ(డీఆర్‌డీఎల్)... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

పోస్టు: ఐటీఐ అప్రెంటిస్

ట్రేడులు: ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, మెషినిస్ట్(గ్రైండర్), కార్పెంటర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, అటెండెంట్ ఆపరేటర్ కెమికల్ ప్లాంట్, పెయింటర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఫౌండ్రీమ్యాన్.

అర్హతలు: సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డైరెక్టర్, డీఆర్‌డీఎల్, కంచన్‌బాగ్, హైదరాబాద్ చిరునామాకు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 29

వెబ్‌సైట్: www.drdo.gov.in/

ఏపీ జ్యుడీషియల్ సర్వీస్‌లో జడ్జి పోస్టులు

ఏపీ స్టేట్ జ్యుడీషియల్ సర్వీస్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్/ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అమరావతిలోని ఏపీ స్టేట్ హైకోర్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

పోస్టు: సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్)

ఖాళీలు: 39(32 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, 7 ట్రాన్స్‌ఫర్ ద్వారా భర్తీ చేస్తారు)

అర్హత: లా లో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు అయిదేళ్లు; దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, రాత పరీక్ష, వైవా-వాయిస్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.1500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.750

స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష కేంద్రాలు: గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: జనవరి 31

చివరి తేదీ: మార్చి 1

స్క్రీనింగ్ టెస్ట్ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేదీ: మార్చి 15

స్క్రీనింగ్ పరీక్ష తేదీ(కంప్యూటర్ ఆధారిత పరీక్ష): ఏప్రిల్ 13

ప్రాథమిక కీ విడుదల/అభ్యంతరాల స్వీకరణ: ఏప్రిల్ 18

వెబ్‌సైట్: https://aphc.gov.in/

డా.వైఎస్ఆర్ హెల్త్ వర్సిటీలో జూనియర్ అసిస్టెంట్స్

ఖాళీలు 20

విజయవాడలోని డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి 18 నుంచి 42 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

జీతభత్యాలు: నెలకు రూ.25,220 - రూ.80,910

ఎంపిక ప్రక్రియ: ప్రిలిమినరీ ఎగ్జామ్, మెయిన్ ఎగ్జామ్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికులు, దివ్యాంగులకు రూ.750. ఇతరులకు రూ.1500.

ఫీజు చెల్లింపునకు చివరి తేదీ: జనవరి 31

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 1

వెబ్‌సైట్: drysruhs.edu.in/



లిటిల్స్




మీకు తెలుసా?

- ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్, సెమీ ఎడారుల్లో కనపడే ఈ అడవి పిల్లి పేరు 'కారాకల్'. ఈ పదం టర్కీ భాష నుంచి వచ్చింది. దీని అర్థం నల్ల చెవులుండే పిల్లి అని! చూడటానికి పొట్టి చిరుతలా కనిపించే దీని చెవులు మాత్రం పొడవైనవి. చెవుల మీద జుట్టు ఉంటుంది.
- పురాతన చరిత్రలో వీటి ఆనవాళ్లు ఉన్నాయి. విచిత్రమేంటంటే.. ఇవి నీళ్లు తాగకుండా చాలా రోజులు బతుకుతాయి.
- ఇవి కేవలం తెల్లారుజామున మాత్రమే వేటకు బయలుదేరుతాయి. పెద్ద ఎలుకలు, పెద్ద పక్షులను సైతం వేటాడతాయి. వీటి చెవుల్లో కేవలం ఆరు కండరాలే ఉంటాయి. దూరంగా అలికిడి కలిగినా కనుక్కుంటాయి. ముఖ్యంగా వేగంగా చెట్లు ఎక్కగలవు కాబట్టే పక్షులను వేటాడగలవు. 40 కేజీలలోపు ఉండే చిన్న జీవులను వేటాడే సామర్థ్యం వీటికి ఉంది.
- రాళ్లమధ్య, వ్యవసాయ భూముల్లో కూడా నివసించటానికి చాలా ఇష్ట




పడతాయి. ఏడు కేజీల నుంచి 20 కేజీల వరకు బరువుంటాయి.
- గంటకు 75 కిలోమీటర్ల వేగంతో పరిగెతే ఈ పిల్లులను సింహాలు, హైనాల చేత చిక్కి చనిపోతుంటాయి.
- వీటిని చిరుత పులుల్లో ఉండే బిహేవియర్ ఉంటుంది. అలానే నడుస్తుంది. చిరుతలానే దాని చెంపలను రాళ్లకు రుద్దుకుంటుంది. అంటే రెండూ ఒకే జాతికి చెందినవి అనమాట. ఇక ఇవి పక్షులను బాగా వేటాడగలదు కాబట్టి అక్కడి లోకల్స్ వీటిని పెంచుకుంటారు. శిక్షణ ఇస్తారు.
- 42 ఇంచుల పొడవు ఉంటుంది. వీటి తోక 13 ఇంచులు ఉంటుంది. ఇవి రెండు పిల్లలను ఏడాదికి ఒకసారి మాత్రమే కంటాయి.
- 12 మిలియన్ల సంవత్సరాల కితం వీటి ఆనవాళ్లు ఉన్నాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు.
- వీటి జీవనకాలం 12 ఏళ్లు.


దారి కనుక్కోండి



రంగులు వేయండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 208

3	6	7	8	9	5	1	2	4
2	1	5	6	4	3	8	9	7
4	8	9	2	1	7	5	6	3
7	3	6	1	5	2	9	4	8
8	9	1	4	3	6	2	7	5
5	2	4	9	7	8	3	1	6
9	7	2	3	8	4	6	5	1
1	5	3	7	6	9	4	8	2
6	4	8	5	2	1	7	3	9

సుడోకు - 207 సమాధానం

5	1	9	4	7	3	8	2	6
3	6	7	1	8	2	9	5	4
2	8	4	9	5	6	7	1	3
6	5	8	3	4	1	2	7	9
1	7	2	6	9	8	4	3	5
4	9	3	5	2	7	1	6	8
8	2	6	7	3	9	5	4	1
7	3	5	8	1	4	6	9	2
9	4	1	2	6	5	3	8	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.



గూగుల్ సెర్చ్‌కు హంగులు





గూగుల్ - సెర్చ్‌కు సంబంధించి మేజర్ అప్డేట్ 'సర్కిల్ టు సెర్చ్'ని ప్రకటించింది. యాప్‌ల నుంచి స్విచ్ కాకుండానే యూజర్లు తమ డివైజుల్లో దేనికోసమైనా దీంతో సెర్చ్ చేసుకోవచ్చు. కాంటెక్స్టువరంగా సెర్చ్ సులువుగా ఉంటుంది. వాస్తవానికి ఒక్కోసారి సెర్చ్ ఇబ్బందికరంగా ఉంటుంది. అయితే ఈ కొత్త ఫీచర్ ఆ సమస్యలను పరిష్కరించనుంది. సర్కిల్ సెర్చ్‌ని ఒకసారి లోడ్ చేసుకుంటే చాలు - సర్కిలింగ్, హైలైటింగ్, స్క్రిబ్లింగ్, టాపింగ్‌కు వీలు ఉంటుంది. యూజర్ ఆసక్తిని అనుసరించి సమాచారాన్ని పొందవచ్చు. చేస్తున్న పనికి ఎలాంటి ఆటంకం కలుగకుండా, కావాల్సిన సమాచారాన్ని పొందడం ఇందులోని ప్రత్యేకత. ఈ నెలాఖరు నుంచి సర్కిల్ టు సెర్చ్ అందుబాటులోకి వస్తుంది. ప్రీమియం ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్లు అంటే పిక్సెల్ 8, పిక్సెల్ 8 ప్రొ, న్యూ గెలాక్సీ ఎస్24 సిరీస్‌ల్లో లభ్యమవుతుంది. అలాగే అన్ని ప్రాంతాల్లో, అన్ని భాషల్లో సెర్చ్‌కు వీలు ఉంటుంది. వీడియోల్లోనూ లభ్యమవుతుంది. యూట్యూబ్‌లో ఒక షార్ట్‌ను వీక్షిస్తున్నప్పుడు ఫేవరేట్ యాక్టర్ కోసం పాజ్ చేసుకోవచ్చు. అదైన తరవాత మళ్ళీ పాత వీడియో దగ్గరకు రెజ్యూమ్ కావచ్చు. ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్‌లో సర్కిల్ టు సెర్చ్ కోసం హోమ్ బటన్ లేదా నేవిగేషన్ బార్‌ని లాంగ్ ప్రెస్ చేయాలి. ఒకసారి యాక్టివేట్ అయితే చాలు, యూజర్లు ఏ ఐటెమ్‌ను సెలక్ట్ చేసుకున్న మరింత సమాచారాన్ని సర్కిలింగ్‌తో పొందవచ్చు.

మల్టీసెర్చ్, జనరేటివ్ ఏఐ

సర్కిల్ టు సెర్చ్‌కు తోడు ఏఐ పవర్డ్ మల్టీసెర్చ్ ఎక్స్‌పీరియెన్స్‌ని కూడా గూగుల్ ప్రకటించింది. దీంతో సెర్చ్ టెక్స్ట్‌కు పరిమితం కాదు. ఇమేజెస్ లేదా స్క్రీన్‌షాట్స్‌కు తోడు ఏఐ పవర్డ్ ఇన్‌సైట్స్ కూడా లభ్యమవుతాయి. ఉదాహరణకు ఒక పిక్చర్ కనిపించినప్పుడు తెలియకుంటే అడగవచ్చు. ఏఐ పవర్డ్ ఓవర్‌వ్యూతో సంబంధిత సమాచారం లభిస్తుంది. అమెరికాలో ఈ వారమే ఇది అందుబాటులోకి వస్తోంది. దీనికోసం ప్రత్యేకించి సెర్చ్‌ల్యాబ్స్‌లో నమోదు కానవసరం లేదు. గూగుల్ యాప్, ఆండ్రాయిడ్, ఐఓఎస్‌లలో లాంచ్ లెన్స్‌తో ఈ మల్టీసెర్చ్ ఎక్స్‌పీరియెన్స్‌ని పొందవచ్చు. అమెరికాలో కాకుండా మరెక్కడైనా అయితే సెర్చ్ ల్యాబ్స్‌లో సెర్చ్ జనరేటివ్ ఎక్స్‌పీరియెన్స్(ఎస్‌జీఈ)ని ఎంచుకోవాలి. తద్వారా గూగుల్ యాప్‌లో ఈ ఫీచర్‌ని పొందవచ్చు.

రియల్ టైమ్ ఇంటర్‌ప్రెటర్ ఫీచర్

ఇవాల్టి స్మార్ట్ ఫోన్లు పలు హిడెన్ జెమ్స్‌కు అడ్డాలు. పలు ఫీచర్ల సమాహారాలు. అలాంటి వాటిలో రియల్-టైమ్ వాయిస్ ట్రాన్స్‌లేషన్ ఫీచర్ ఒకటి. ఇది ఆండ్రాయిడ్, ఐఓఎస్ రెంటిలోనూ అందుబాటులో ఉంది. తాజా ఫీచర్‌తో టెక్స్ట్ టైపింగ్, రెస్పాన్స్‌కు వేచిఉండటం అన్న ప్రక్రియ ఉండదు. తెలియని భాష నుంచి అనువాదం దానంతట అదే జరుగుతుంది. అందుకోసం



- మొదట గూగుల్ ట్రాన్స్‌లేట్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ముఖ్యంగా విదేశాల్లో ఉంటే దీని కోసం డేటా కన్స్యూమ్ అవుతుంది. అలాగే ఇంటర్నెట్ కనెక్షన్ ఉండాలి కూడా. ట్రాన్స్‌క్రైబ్ ఫీచర్‌గా దీనికి పేరు. ఇంగ్లీష్ సహా ఎనిమిది భాషలను ఇది సపోర్ట్ చేస్తుంది.
- లాంగ్వేజ్‌ని ఎంపిక చేసుకున్న తరవాత కాన్వర్సేషన్ బటన్‌ని టాప్ చేసి మాట్లాడాలి. వాయిస్‌ని వినిపించే ఇందులో మాన్యువల్, ఆటోమేటిక్ విభాగాలు ఉంటాయి.
- మాట్లాడుతుంటే, టెక్స్ట్ ట్రాన్స్‌క్రిప్షన్స్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. యాక్యురసీని వెరిఫై చేసేందుకు అవకాశం కూడా ఉంటుంది. టెక్స్ట్‌ను టాపింగ్ చేయడం ద్వారా ఇన్‌పుట్‌ని ఎడిట్ చేసుకోవచ్చు. స్పోకెన్ ఔట్‌పుట్ కూడా డిస్‌ప్లే అవుతుంది. రీప్లే ఆప్షన్ కూడా ఉంది.
- ట్రాన్స్‌క్రైబ్ ఫీచర్‌కు పలు ఎక్స్‌టెన్సివ్ సెట్టింగ్స్ ఉన్నాయి. హ్యాండ్ వీవింగ్ ఐకాన్ ఉపయోగించి అనువదించిన భాషలో సమాచారాన్ని ఇన్ఫర్మేషన్ కార్డుని డిస్‌ప్లే చేసుకోవచ్చు. ట్రాన్స్‌లేషన్ ప్రక్రియను మరో స్పీకర్‌కు తెలియజేసేందుకు ఇది ఉపయోగపడుతుంది.
- ఇందులో రీజినల్ యాక్సెంట్, వాయిస్ స్పీడ్, ట్రాన్స్‌లేషన్ హిస్టరీ క్లియర్ చేసుకునే వీలు కూడా ఉంటాయి. దాదాపుగా అన్ని పరిస్థితుల్లో ఇది ఉపయోగపడుతుంది. మొత్తానికి లాంగ్వేజ్‌పరంగా ఎదురయ్యే అడ్డంకులను తొలగించుకునేందుకు ఉపయోగపడుతుంది.

టైమ్లీ యాప్‌తో ట్రబుల్స్‌కు చెక్

టైమ్లీ యాప్... సమయపరంగా వచ్చే సమస్యలకు అసలు సిసలు చెక్‌గా దీన్ని భావించవచ్చు. ఇది ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) పవర్డ్ యాప్, ఆటోమేటెడ్ టైమ్ ట్రాకర్. టైమ్‌పరంగా ఎదురయ్యే సమస్యలను దీంతో సులువుగా అధిగమించవచ్చు. దీంతో పనిచేయడం ద్వారా షెడ్యూల్‌కు తగ్గట్టు టీమ్స్ పనిచేసుకోవచ్చు. నిర్దేశిత సమయంలోగా టాస్క్‌లను పూర్తి చేసుకోవడానికి కూడా వీలు ఉంటుంది. పైపెచ్చు దీనికి ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఫీచర్స్ కూడా ఉన్నాయి. మీటింగ్, టాస్క్స్, బ్రేక్స్ తదితరాలన్నింటినీ ఇది షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసే వీలును కల్పిస్తుంది. ప్రధానంగా...

- ఏఐ కారణంగా టైమ్ మేనేజ్‌మెంట్ యావత్తు ఆటోమేటిక్‌గా పూర్తి చేసే వీలు ఉంటుంది. వెబ్ ట్యాబ్, డెస్క్‌టాప్ యాప్‌పై ఎంత సమయం వినియోగించారు అన్నది తెలుస్తుంది. టైమ్‌ను ఎలా వినియోగించుకుంటున్నారు అన్నది లోతుగా అర్థం చేసుకోవచ్చు.
- డాక్యుమెంట్స్, మీటింగ్స్, ఈమెయిల్స్, వెబ్‌సైట్స్, వీడియో కాల్స్, బ్రేక్స్ వారీగా సమయం ఎలా గడుపుతున్నామన్నది తెలుస్తుంది.
- ప్రాజెక్ట్ ట్రాకింగ్ అంటే రియల్ టైమ్ పరిధిలో బడ్జెట్ మానిటరింగ్, గంటలు, యాక్టివిటీస్ తదితరాలను మానిటర్ చేస్తుంది. ఫలితంగా క్లయింట్లు, భాగస్వాములు ప్రాజెక్టు పనితీరును తెలుసుకోగలుగుతారు. అవసరమైన కరెక్షన్స్ చేసుకోగలుగుతారు.
- కొలాబిరేషన్, సులువుగా యాక్సెసిబిలిటీకి అవకాశం ఉంటుంది. మూడో పార్టీ యాప్స్ అంటే గూగుల్ క్యాలెండర్, జీమెయిల్, మండే.కామ్, టొడేయిస్ట్ తదితరాలతో ఇంటిగ్రేట్ కావచ్చు.

అయితే టైమ్లీ అనేది చందా ఆధారిత టూల్. ఉచిత ట్రయిల్ అవకాశం ఉంది. నెలకు తొమ్మిది డాలర్లతో అయిదుగురు ఉపయోగించు కోవచ్చు. దీని హై ఎండ్ వెర్షన్ రేటు నెలకు 22 డాలర్లు.

షావోమీ 14 ఫీచర్స్ లీక్!



షావోమీ 14 స్మార్ట్‌ఫోన్‌కు సంబంధించిన అల్ట్రా కెమెరా కిట్ - 3సీ వెబ్‌సైట్‌లో ప్రత్యక్షమైంది. షావోమీ 13కి సక్సెసర్‌గా దీన్ని చెబుతున్నారు. చైనా కంపల్సరీ సర్టిఫికేషన్(3సీ) వెబ్‌సైట్‌లో ఇది కనిపించింది. వాస్తవానికి క్వాడ్ రేర్ కెమెరా యూనిట్‌తో వస్తుందని భావిస్తున్నారు. 2402CPS69C నెంబర్‌తో వస్తున్న దీని గరిష్ఠ ఔట్‌పుట్ 1500ఎంఏహెచ్ అట్ 5వి. కిట్ ఎక్స్‌టర్నల్ బ్యాటరీగా పనిచేస్తుంది. మోడల్ నంబర్‌ను పరిశీలిస్తే వచ్చే ఫిబ్రవరి నెలలో దీన్ని విడుదల చేస్తారని సూచిస్తోంది. షావోమీ 14 అల్ట్రా 2కె రిజల్యూషన్‌తో 6.7 ఇంచీల అమోల్డ్ స్క్రీన్. 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు కలిగి ఉంటాయని అనుకొంటున్నారు. 50 మెగాపిక్సెల్‌తో నాలుగు కెమెరాలు ఉన్న క్వాడ్ కెమెరా సెట్ ఉందని చెబుతున్నారు. సోనీ ఎల్‌వైటి900 ప్రైమరీ సెన్సర్‌కు తోడు ఎఫ్/1.63 యాపరేచర్ ఉండనున్నాయి. 5,180 ఎంఏహెచ్ బ్యాటరీ, 90వాట్స్ వైర్డ్ చార్జింగ్ సపోర్ట్, 50 వాట్స్ వైర్‌లెస్ చార్జింగ్ సపోర్ట్ ఉండనున్నాయి.

ఈ-సిమ్‌కు అనువుగా ఆండ్రాయిడ్ 14!

ఆల్ఫాబెట్‌కు చెందిన ఆండ్రాయిడ్ 14క్యూపీఆర్ నిజానికి గేమ్ చేంజర్ కాగలదని భావిస్తున్నారు. ఈసిమ్స్ దిశగా ఇది ముందుకెళుతోంది. అంటే ఫిజికల్ సిమ్ నుంచి ఈ సిమ్ కన్వర్టింగ్‌పై ఫోకస్ కనబరుస్తోంది. ఫీచర్ల పనితీరు పెంపునకు దోహదపడనుంది. 'కన్వర్ట్ టు ఈసిమ్' ఫీచర్‌తో ఫిజికల్ సిమ్ కార్డులను ఈ సిమ్‌గా మార్చుకోవచ్చు. నెట్‌వర్క్ పరిధిలో, ఆండ్రాయిడ్ 14 డివైజుల్లో సిమ్స్ మెనూలో ఇది సాధ్యమవుతుంది. మెజారిటీ ఆండ్రాయిడ్ డివైజులు ఇప్పటికీ ఫిజికల్ సిమ్స్‌తోనే పనిచేస్తున్నందున ఇప్పటికిప్పుడు కన్వర్షన్ సాధ్యం కాదనే చెప్పాలి. అమలులోకి వస్తే సిమ్ కన్వర్టింగ్ కోసం ప్రొవైడర్‌ని సంప్రదించాల్సిన అవసరం ఉండదు.



సోనీ ఇన్‌జోన్ బడ్స్



సోనీ ఇన్‌జోన్ బడ్స్ ఇండియన్ మార్కెట్లోకి వచ్చేశాయి. కంపెనీకి సంబంధించి ఇవి లేటెస్ట్ ఎడిషన్. యాక్టివ్ నాయిస్ క్యానిలేషన్ ఫీచర్‌కు తోడు ఇది ఎక్స్‌టెర్నల్ నాయిస్‌ని కూడా తగ్గిస్తుంది. 8.4ఎంఎం డ్రైవర్స్ ఉన్నాయి. యూఎస్‌బీ టైప్-సి డోంగిల్ కనెక్షన్ ఉంది. లెటెన్సీ రేటు ముప్పయ్ మిల్లీ సెకండ్లకు లోపే. సింగిల్ చార్జ్‌తో 12 గంటల ప్లేబ్యాక్ సమయం లభిస్తుంది. సోనీ లేటెస్ట్ ఇయర్ ఫోన్లు - మైక్రోఫోన్ అదీ ఏఐ ఆధారిత నాయిస్ రిడక్షన్‌తో వస్తున్నాయి. అలాగే బ్లూటూత్‌తో పది మీటర్ల పరిధిలో ఉండే డివైజ్‌లతో కలవగలదు. కాల్ తీసుకోవడం లేదా రిజెక్ట్ చేసేందుకు వీలుగా ఈ బడ్స్‌లో టచ్ ఎనేబుల్డ్ కంట్రోల్స్ ఉన్నాయి. వాల్యూమ్ పెంపు లేదా స్కిప్ చేసేందుకు వీలుగా కంట్రోల్ కూడా ఉంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ డివైజ్‌లు రెంటికీ సోనీ హెడ్‌ఫోన్స్ కనెక్ట్ యాప్ ద్వారా జోడించుకోవచ్చు. ఇండియాలో దీని ధర రూ.17,990 కాగా బ్లాక్, వైట్ కలర్ ఆప్షన్స్‌లో లభ్యమవుతోంది. సోనీ సెంటర్, సోనీ ఎక్స్‌క్లూజివ్- రిటైల్ స్టోర్స్‌లో ఈ నెల 22 నుంచి లభ్యమవుతుంది.

యాపిల్ విజన్ ప్రొ హెడ్‌సెట్‌లో నెట్‌ఫ్లిక్స్ నో

యాపిల్‌కు చెందిన విజన్ ప్రొ హెడ్ సెట్‌లో డెడికేటెడ్ నెట్‌ఫ్లిక్ యాప్ సౌకర్యం లేదు. బ్లూమ్‌బర్గ్ ఈ విషయాన్ని రిపోర్ట్ చేసింది. యాపిల్ ఐపాడ్‌లో సైతం నెట్‌ఫ్లిక్స్‌కు సానుకూలత లేదు. అసలు ఆ యాప్ ఉండేందుకు వీలుగా ఆ రెంటినీ మలచలేదని సమాచారం. అయితే యాపిల్ హెడ్‌సెట్‌కు డిస్నీ ప్లస్, మేక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియో సపోర్ట్ ఉంది. వీటికి బదులు వెబ్ బ్రౌజర్‌తో నెట్‌ఫ్లిక్స్ కంటెంట్‌ను వాచ్ చేయవచ్చు. ఆఫ్‌లైన్‌లో సైతం నెట్‌ఫ్లిక్స్ కంటెంట్‌ను వీక్షించడాన్ని కూడా నిరోధించింది. మేక్స్‌పై నెట్‌ఫ్లిక్స్ మాదిరిగానే విజన్ ప్రొ వెబ్ బ్రౌజర్‌పై నెట్‌ఫ్లిక్స్ కంటెంట్‌ను ఎంజాయ్ చేయవచ్చని యాపిల్ స్పోక్స్‌పర్సన్ ఈ సందర్భంలో 'ద వెర్జ్' అధికార ప్రతినిధి తెలిపారు.



యాపిల్ డివైజ్‌లకు చోరీ నుంచి రక్షణ



యాపిల్ కొత్తగా విడుదల చేస్తున్న అప్డేట్ ఐఓఎస్ 17.3తో డివైజ్‌లను ఎవరైనా తస్కరించినా వాటికి తగు ప్రొటెక్షన్ లభిస్తుంది. 'స్టోలెన్ డివైజ్ ప్రొటెక్షన్'గా ఈ అప్డేట్‌ను ప్రస్తుతం బేటా టెస్టర్లకు అందుబాటులో ఉంచింది. అంటే కొద్ది వారాల్లోనే వినియోగదారుల చేతికి అందుతుంది. బాధితుడి పాస్‌కోడ్‌ను దొంగ తెలుసుకున్నప్పటికీ రక్షణగా ఉంటుంది. డివైజ్ ప్రొటెక్షన్‌కు సంబంధించి ఇదో అదనపు అంచె(లేయర్). యాపిల్ వాచీ కోసం బ్లాక్ యూనిటీ స్పోర్ట్ బ్యాండ్‌ను విడుదల చేస్తున్న సమయంలోనే ఈ అప్డేట్‌ను కూడా సూచనప్రాయంగా తెలియజేసింది. యూజర్ పాస్‌కోడ్‌ని తస్కరించిన వ్యక్తి తెలుసుకున్నప్పటికీ ఈ అప్డేట్ కౌంటర్‌గా పనిచేస్తుంది. ఐఫోన్ పొందగానే దొంగ చేసే మొదటి పని పాస్‌కోడ్‌ను తెలుసుకోవడం. సరిగ్గా అదే సమయంలో ఈ ఫీచర్ కారణంగా సెట్టింగ్ ఆప్షన్స్‌ను లాక్ చేస్తుంది. బయోమెట్రిక్ అథెంటికేషన్స్ అంటే ఫేస్ ఐడీ, టచ్‌ఐడీ కూడా లాక్ అవుతాయి. వాటన్నింటిని తొలగించుకోవాలంటే ఒక గంటకు పైగా సమయం పట్టేస్తుంది. ఈలోపు బాధితుడు తను పోగొట్టుకున్న డివైజ్‌పై పట్టు సాధించవచ్చు. ఇదేకాకుండా ఈ అప్డేట్‌తో కొలాబిరేటివ్ మ్యూజిక్ ప్లేలిస్ట్ (యాపిల్ మ్యూజిక్ ఫీచర్)ను తీసుకు వచ్చింది.

ఆ జీమెయిల్స్ వద్దనుకుంటే కట్



జీమెయిల్ బాక్స్ తెరవగానే అసలు వద్దు అనుకునే న్యూస్‌లెటర్స్ కనిపిస్తే మహా చిరాకుగా అనిపిస్తుంది. వాటన్నింటినీ ఎప్పటికప్పుడు తొలగించుకోవడం ఒక పనే కాదు, విసుగు అనిపిస్తుంది కూడా. జీమెయిల్ ఆండ్రాయిడ్ యాప్‌లో అందుకు పరిష్కారంగా అన్‌సబ్‌స్క్రయిబ్ బటన్‌ను కలుపుతోంది. దీంతో ఆండ్రాయిడ్ యాప్ యూజర్లు తమకు వద్దనుకునే న్యూస్‌లెటర్స్‌కు యాక్సెస్ అస్సలు లేకుండా చేయవచ్చు. ఫలితంగా స్మార్ట్ ఫోన్లలో ముఖ్యమైన మెయిల్స్‌ను మాత్రమే చూసుకోవచ్చు.

'ఆండ్రాయిడ్ పోలీస్' రిపోర్ట్ ప్రకారం ఆండ్రాయిడ్ యాప్ యూజర్లు ఈ అన్‌సబ్‌స్క్రయిబ్ బటన్‌ని మెయిల్ టాప్‌కార్నర్‌లో చూడవచ్చు. దానిపై క్లిక్ చేస్తే చాలు అన్‌సబ్‌స్క్రయిబ్ అనే పాపప్ మెసేజ్ వస్తుంది. ఈ బటన్ అన్ని స్మార్ట్ ఫోన్లలో అందుబాటులో లేదు. పిక్సెల్ 8 ప్రొ వెర్షన్‌లో ఈ సౌలభ్యం ఉంది. డిసెంబర్ నెలలో దీని రీడిజైనింగ్ జరుగుతున్న సమాచారం తెలిసింది. అంటే సదరు ఫీచర్ రాబోయే రోజుల్లో జీమెయిల్ ఆండ్రాయిడ్ యూజర్లకు అందుబాటులోకి వస్తుందని భావించవచ్చు.

గూగుల్ వైఫై, నెస్ట్ వైఫై ఔట్!



సరికొత్త మోడల్‌ని తీసుకువస్తున్న నేపథ్యంలో గూగుల్ వైఫై అలాగే నెస్ట్ వైఫై రౌటర్లకు గూగుల్ స్టోర్ స్వస్తి పలికింది. పిక్సెల్ 7 సిరీస్‌ను 2002లో తీసుకువస్తున్న సమయంలో నెస్ట్ వైఫై ప్రొని కూడా రిలీజ్ చేసింది. కంపెనీ దీన్నిప్పుడు మరింత స్మార్ట్‌గా మలిచింది. కొత్తగా వస్తున్న రెంటికి సంబంధించిన 'ప్రొ' మోడల్ వైఫై 6ఇ కనెక్టివిటీ అదీ వేగంలో పెరుగుదల, మేటర్ సపోర్ట్‌కు ఉపయోగపడుతుంది. రాబోయే నెలల్లో నెస్ట్ వైఫై మోడల్ వస్తుండటమే ఈ చర్యకు కారణమన్న వివరణ ఒకటి వినిపిస్తోంది. ఇదిలా ఉండగా కొత్త రౌటర్‌ని అభివృద్ధి చేస్తున్నారని, 'బ్రెజ్జా' అనే కోడ్ నేమ్‌తో రూపొందిస్తున్నారని




'9టు5గూగుల్' గత ఏడాది తెలిపింది. గూగుల్ వైఫై 2016 ప్యాటర్న్‌ని ఇది ఫాలో అవుతోందని పేర్కొంది.

గూగుల్ స్టోర్ నుంచి తొలగించిన రెండూ ఇతర రిటైలర్స్ వద్ద లభిస్తున్నాయి. రాబోయే కొద్ది వారాల్లో ఈ స్టాక్ కూడా తగ్గుతుంది. ఇదే సందర్భంలో వీటిని ఏడీటీ ద్వారా పొందవచ్చని గూగుల్ స్టోర్ తెలిపింది.

నెస్ట్ వైఫైని అమెజాన్, న్యూఎగ్, టార్గెట్; గూగుల్ వైఫైని అమెజాన్, బెస్ట్ బయ్, న్యూఎగ్, టార్గెట్ నుంచి పొందవచ్చు.

క్రోమ్ సైడ్ ప్యానల్‌కు రీడిజైన్



గూగుల్ - డెస్క్‌టాప్ క్రోమ్‌ని రీడిజైన్ చేసింది. బుక్‌మార్క్స్‌కు, యాక్సెస్‌కు తోడు సైడ్ ప్యానెల్ యూఐతో కొత్తగా మార్చింది. స్క్వేర్-ఐష్ ఐకాన్‌తో సైడ్ ప్యానల్‌ని ఓపెన్ చేసేవారు. బుక్ మార్క్స్ రైట్ హ్యాండ్ కాలమ్‌లో ఉండేవి. ఇప్పుడు ఇక సౌకర్యంగా ఉండేలా వీటిని ఆర్డర్‌లో పెట్టుకోవచ్చు.

ఇందుకోసం త్రీడాట్ మెనూ ఉపయోగించి సైడ్ ప్యానల్‌ను ఓపెన్ చేయవచ్చు. ఉదాహరణకు ఓవర్‌ఫ్లో - బుక్‌మార్క్స్ అండ్ లిస్ట్- షో ఆల్ బుక్ మార్క్స్ అన్న విధంగా ఉంటుంది. దాని టాప్ రైట్ కార్నర్‌లో పిన్ ఐకాన్ ఉంటుంది. బటన్ లేకుండా సైడ్ ప్యానల్‌ని ఎలా ఓపెన్ చేస్తారన్న చింత ఈ అప్‌డేట్‌తో తీరనుంది. ఆన్‌బోర్డింగ్ యూఐ ఉండొచ్చు. డ్రాప్‌డౌన్ మెనూ ఎప్పటిలానే ఉంటుంది. ఇప్పటికిప్పుడు క్రోమ్ 121 బేటా వివరాలతో కూడిన ఫ్లాగ్‌తో మేక్, విండోస్, లినక్స్, క్రోమ్ ఓఎస్, పచ్చియా, లాక్రోస్‌లో లభ్యమౌతుంది. chrome://flags/#side-panelpinning లో పొందవచ్చు. కొత్త విధానంతో వద్దనుకుంటే సైడ్ ప్యానల్‌ని ఉపయోగించాల్సిన అవసరం ఉండదు. కొత్త మార్పుల ఫలితంగా పని వేగంగా జరుగుతుంది.

